₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 9 సంచిక - 03
పక్షపత్రిక ఫిబ్రవరి 1-15, 2018



## ధిక్కారాన్ని దాటి చూడాలి



## ప్రజల ఆస్తి, దిక్సూచి లోక్‌సత్తా



# మిలీనియం తరం కోసం...
# 60 : 40 'సురాజ్య' లైఫ్‌స్టయిల్





# కనీసం వచ్చే 50 ఏళ్ల అవసరాలకు నైపుణ్యాల్ని పెంచుకోండి

శాస్త్ర సాంకేతిక రంగాల్లో వేగంగా చోటుచేసుకుంటున్న పరిణామాల వల్ల ప్రజల ఆకాంక్షల్లో, అవసరాల్లో పెద్ద ఎత్తున వస్తున్న మార్పులను ఉపాధిగా మార్చుకోవాలని, లక్షలో వందమందికి వచ్చే ప్రభుత్వోద్యోగాలను సర్వస్వంగా భావించవద్దని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ యువతకు సూచించారు.

జనాభాలో అత్యధికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలపై హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో యూత్ ఫర్ బెటర్ ఇండియా (వైబీఐ) నిర్వహించిన కార్యక్రమంలో జేపీ ప్రసంగించారు. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలనిస్తుందనే భ్రమలు, నిరుద్యోగ భృతి వంటి ఆకర్షణల నుంచి బైటికి రావాలని, డిగ్రీ కాగితాలను కాకుండా నైపుణ్యాలను సంపాదించాలని అన్నారు. ఉద్యోగాలకు ఇప్పటిదాకా ఉత్పత్తి రంగమే కీలకమని... కానీ ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి రంగంలో 14 కోట్ల మంది ఉంటే మనదేశంలో ఇప్పటికే 14 కోట్ల మంది నిరుద్యోగులున్నారని అన్నారు. వారు కాకుండా ప్రతి ఏటా భారత్‌లో 1కోటీ 30 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల కోసం వస్తున్నారన్నారు. ప్రపంచ చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున ఉపాధిని కల్పించాల్సిన సవాలు ఇప్పటివరకూ ఏ దేశానికీ ఎదురవలేదన్నారు. దీనికి ఆచరణాత్మక పరిష్కారాలున్నాయని, సరైన విధానాలను ప్రభుత్వాల చేత అమలు చేయించటం, చుట్టూ గాలిలో ఉన్న ఉపాధి అవకాశాలను సాకారం చేసే నైపుణ్యాలను పెంచుకోవటం, గ్రామాల చుట్టూ చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం, విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయటం అవసరమన్నారు. సరైన విధానాలతో ఒక్క వైద్యరంగంలోనే 2 కోట్ల వరకూ ఉద్యోగావకాశాలున్నాయన్నారు. సమాజం అవసరాలను గుర్తించి వాటిలో నుంచి ఉపాధిని పొందాలని, కనీసం రాబోయే 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్టు యువత నైపుణ్యాలను పెంచుకుంటే ఉపాధికి ఢోకా ఉండదన్నారు. వైబీఐ నేతలు శివరామకృష్ణ, షీలారాణీ, పెంద్యాల సతీష్ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, అధికార ప్రతినిధి కొంగర గంగాధరరావు, గంగాభవానీ, పెద్దసంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఫిబ్రవరి 1-15, 2018 సంపుటి - ౨ సంచిక - 03




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

మిలీనియం తరం కోసం 60 ; 40 .............. 5
ప్రజాస్వామ్యానికి ప్రమాదం......................... 10
కంచే చేను మేసింది................................ 12
ఇది ధర్మాగ్రహం...................................... 14
న్యాయవ్యవస్థ - జవాబుదారీతనంపై............ 18
కొందరు జడ్జీలెందుకవుతారు ? .................. 19
జడ్జీలూ జవాబుదారీయే !............................ 21
స్వయంపాలన పాలిట విలన్లు .................... 25
గ్రంథాలయాలను నిత్యనూతనంగా............... 28
'ఆధునిక విద్యా, సేవా సంస్థలు' అమెరికా......... 29
(మీడియాలో) 'కీ' కామెంట్లు ! ...................... 32
ఆ గ్రామాల స్వతంత్ర పోరాటానికి ................ 34

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836*, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# ధిక్కారాన్ని దాటి చూడాలి

ప్రజాస్వామ్యానికి పర్యాయపదాన్ని చెప్పాల్సి వస్తే.. 'న్యాయం' అనే చెప్పాలి. వివక్ష లేకుండా అత్యంత సంపన్నునికి, చిట్టచివరన ఉన్న పేదవానికీ న్యాయం సమానంగా అందటమే ప్రజాస్వామ్యం! ఈ మాటని పైకి, వ్యక్తిగతంగానూ మనలో అత్యధికులు అంగీకరిస్తున్నా.. ఆచరణలో మనం వేరు, వాళ్లు వేరు అనే ధోరణితో వ్యవహరిస్తుండటం వల్లే మన ప్రజాస్వామ్యం ఇంకా పరిణతికి యోజనాల దూరంలోనే ఉంది. అందరికీ సమన్యాయాన్ని వర్తింపచేయాలనే ప్రజాస్వామిక ఆకాంక్షను మన రాజ్యాంగ నిర్మాతలు ప్రగాఢంగా చెప్పారు. సాహసోపేతంగా అందరికీ ఒకే ఓటును హక్కుగా ఇచ్చారు. కానీ తగిన వ్యవస్థల నిర్మాణం మీద వారు దృష్టి పెట్టకపోవటంతో అసమానతలు ప్రకోపిస్తూనే ఉన్నాయి. 'ఓట్ అండ్ షౌట్'కే మన ప్రజాస్వామ్యం పరిమితమైంది. సమన్యాయం అందిస్తూ ప్రజల్లో న్యాయవర్తనను పెంచటంలో మన న్యాయవ్యవస్థ సమర్థత, విశ్వసనీయత కీలకం కాబట్టే.. ప్రజాస్వామిక సంస్కరణల కృషిలో భాగంగా లోక్‌సత్తా తొలినుంచీ న్యాయసంస్కరణల కోసం పనిచేస్తోంది. 14-15 ఏళ్ల కృషి అనంతరం ఉన్నత న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత కోసం 'జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్' (ఎన్‌జేఏసీ) రాజ్యాంగ సవరణను 2014 డిసెంబర్‌లో సాధించింది. రంధ్రాన్వేషణలు లేకుండా ఉండేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన మచ్చలేని జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ వెంకటాచలయ్య, న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ కృష్ణయ్యర్‌ల ద్వారా లోక్‌సత్తా ఎన్‌జేఏసీ బిల్లును రూపొందించింది. కాంగ్రెస్, బీజేపీలు రెంటినీ ఒప్పించింది. మోదీ ప్రభుత్వం వచ్చాక.. ఆ రెండు పార్టీల మధ్య తీవ్ర శత్రుత్వ ధోరణులున్నా పార్లమెంటు ఏకగ్రీవంగా ఈ బిల్లును ఆమోదించింది. పలు రాష్ట్రాల అసెంబ్లీలూ వేగంగా ధృవీకరించటంతో 99వ రాజ్యాంగ సవరణగా ఎన్‌జేఏసీ అమల్లోకి వచ్చింది. అయితే న్యాయమూర్తుల నియామకాన్ని న్యాయమూర్తులే చేయాలి తప్ప ఎన్‌జేఏసీ చేయకూడదని సుప్రీంకోర్టు అన్యాయంగా ఆ సవరణను కొట్టివేసింది. న్యాయవ్యవస్థలోని అవినీతి, అసమర్థత, అపారదర్శకత గురించి స్పష్టమైన అవగాహన ఉంది కాబట్టే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఈ కీలక బిల్లు కోసం అన్నేళ్లపాటు నిశ్శబ్దంగా లోక్‌సత్తా కష్టపడింది. 2015 అక్టోబర్ 16న ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు ఎన్‌జేఏసీని కొట్టి వేసినప్పుడు.. 'రాజకీయం పట్ల ద్వేషంతో, అపనమ్మకంతో ప్రజలు ఈవేళ సుప్రీంకోర్టు నిర్ణయమే సరైనదనుకోవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీతనంలేని వ్యవస్థంటూ ఏదీ ఉండదు. న్యాయవ్యవస్థ అందుకు మినహాయింపు కాదు. జడ్జీలు దేవుళ్లు కాదు. ఆ తీర్పును అత్యున్నత న్యాయస్థానం సరిదిద్దుకునే రోజు వస్తుంది' అని బహిరంగంగా ప్రకటించాను. ఎన్‌జేఏసీలో భారత ప్రధాన న్యాయమూర్తితోపాటు సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తులు ఇద్దరు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఇద్దరు పౌర ప్రముఖులు ఉంటారు. ఈ ఇద్దరు సుప్రసిద్ధులను మూడేళ్ల కాలానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత నామినేట్ చేస్తారు. ప్రజలు ఎన్నుకున్న ప్రధానిని, ప్రతిపక్షనేతని, సమాజాన్ని నమ్మం, ప్రపంచంలో ఏ ప్రజాస్వామిక దేశంలోనూ లేని రీతిలో మమ్మల్ని మేం నియమించుకుంటాం అంటే.. అది భారతీయులను అపహాస్యం చేయటమే అవుతుంది. ఇదేసమయంలో, ఎన్‌జేఏసీ వచ్చే వరకూ వేచిచూడకుండా.. ఉన్న కొలీజియం వ్యవస్థలో కూడా మెరుగైన మార్పులను పౌర ప్రముఖులతో కలిసి సూచించాను. ఇటీవల నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు- జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్- సుప్రీంకోర్టు నిర్వహణ తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తూ మీడియా ముందుకు రావటాన్ని ఈ మొత్తం నేపథ్యం నుంచి చూడాలి. ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు కొట్టివేసినందున పార్లమెంటును రాజ్యాంగ సభలా సమావేశపరిచి, దేశవిదేశాల న్యాయకోవిదుల ప్రసంగాల అనంతరం చర్చించి శాసన-కార్యనిర్వాహక-న్యాయ వ్యవస్థల పరిధుల్ని రాజ్యాంగస్ఫూర్తికనుగుణంగా విస్పష్టం చేయాలన్న లోక్‌సత్తా సూచనను మోదీ ప్రభుత్వం అమలుచేసి ఉంటే.. ఇప్పుడు న్యాయమూర్తుల వివాదానికి ఆస్కారమే ఉండేది కాదు. న్యాయమూర్తుల నియామకంపై రాజ్యాంగ రచనా సంఘం ఛైర్మన్ అంబేద్కర్ సూచనలు, జస్టిస్‌లు వర్మ, వెంకటాచలయ్య, కృష్ణయ్యర్‌లు లోక్‌సత్తాతో జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలు, వివిధ దేశాల్లో న్యాయమూర్తుల నియామకాల ప్రక్రియ తదితర అంశాలన్నిటితో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకు, సంబంధిత మంత్రులకు, పార్లమెంటు సభ్యులకు లోక్‌సత్తా సమగ్రంగా వివరాలను పుస్తకరూపంలో అందచేసింది. కాంగ్రెస్ అధ్యక్షురాలి హోదాలో సోనియాగాంధీ ఎన్‌జేఏసీకి మద్దతు లేఖను పంపారుగానీ, ప్రభుత్వం మాత్రం ప్రకటనల ద్వారా పీటముడులకే పరిమితమైంది. ఫలితమే న్యాయమూర్తులు రచ్చకెక్కటం వంటి ఘటనలు. సంగ్మా కేసులో, ఎన్‌జేఏసీ తీర్పును 4:1గా సమర్థించటంలో, ఇప్పుడూ జస్టిస్ చలమేశ్వర్ కాంగ్రెస్, బీజేపీ అనుకూల, వ్యతిరేక, అనుకూల అంటూ కొందరు ముద్రలు వేస్తున్నారు. ఇంత పరస్పర విరుద్ధంగా పక్షపాతం ఎలా ఉంటుంది, ఎన్‌జేఏసీని వ్యతిరేకించిన ఇద్దరు జస్టిస్‌లతో కలిసి ఆయన ఎలా మీడియా ముందుకు వచ్చారు? అనే ఇంగితాన్ని కూడా ప్రదర్శించటం లేదు. ఆ న్యాయమూర్తులు చేసింది తప్పా, రైటా అన్నదానికన్నా.. వారి మాటల వెనక సంక్షోభాన్ని మనం అర్థం చేసుకోవటం ముఖ్యం. వాళ్లు నలుగురూ అత్యంత సీనియర్ న్యాయమూర్తులు, కొలీజియం సభ్యులు, మచ్చలేనివారు. వారిలో ఒకరు తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కావలసినవారు. పరిమితంగానే అయినా.. వారు వ్యక్తిగతంగాకాకుండా వ్యవస్థ లోపాల గురించే మాట్లాడారు. హేతుబద్ధంగా మాట్లాడారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు మరోరూపంలో ఉన్నాయి. కాబట్టి గడ్డలేయటం ఆపి.. వారి వాదనల్లోని హేతుబద్ధత మీద, ఇక ముందు ఇలాంటివి జరగకుండా చూడటం మీద దృష్టి పెట్టటం మనకే మేలు. ఈ వివాదం తాత్కాలికంగా చల్లారినా, న్యాయసంక్షోభాన్ని పరిష్కరించకుంటే పునరావృతమవుతుందనటంలో సందేహం లేదు. వారు లేవనెత్తిన అంశాలకు సాంకేతికంగా పరిమితం కాకుండా.. న్యాయమూర్తుల నియామకానికి ఎన్‌జేఏసీ, జవాబుదారీతనానికి జ్యుడీషియల్ స్టాండర్డ్స్ అండ్ అకౌంటబిలిటీ చట్టం, సామర్థ్యానికి ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ ఏర్పాటుకు చర్యలను తీసుకోవాలి. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్లతో శాశ్వత రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు, కింది కోర్టులలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచటం, న్యాయ విచారణ పద్ధతుల్ని సులభతరం చేయటం, స్థానిక న్యాయస్థానాలను బలోపేతం చేయటం, నేరపరిశోధనలో, పోలీసు యంత్రాంగాన్ని సంస్కరించటం వంటివి జోడించాలి. తద్వారా న్యాయవ్యవస్థ విశ్వసనీయతను, స్వతంత్ర ప్రతిపత్తిని పరిరక్షించుకుందాం, సామర్థ్యాన్ని పెంచుదాం, జవాబుదారీ చేద్దాం, ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం గావించుకుందాం.

# మిలీనియం తరం కోసం.. 60:40 'సురాజ్య' లైఫ్‌స్టైయిల్

ప్రాంతీయ, జాతీయ అని తేడా లేకుండా ఈమధ్య మన న్యూస్‌ఛానళ్ల ప్రైమ్‌టైమ్ చర్చా కార్యక్రమాల మీద ఆసక్తి తగ్గిపోయింది. ఎన్నికల్లో ఎలా గెలుస్తున్నారు, గెలిచినవాళ్లు ఏం చేస్తున్నారు అని కాకుండా.. ఎలాగోలా ఎన్నికల్లో గెలిచేవారెవరు, పాలనలో ఈవెంట్ మేనేజ్ మెంట్లు ఎంత ఆర్భాటంగా చేస్తున్నారు అని చర్చలు చేయటం, పరిష్కారంలో భాగమైన వారిని కాకుండా సమస్యలో భాగంగా ఉన్నవారే ఎక్కువగా ఆ చర్చల్లో పాల్గొంటుండటం వల్ల చూడబుద్ధి కావటంలేదు. అలా అని ఆ ఛానళ్లను బహిష్కరించటమేమీ లేదు. ప్రైమ్‌టైమ్‌లో ఏ అంశాల్ని చర్చిస్తున్నారు, ఎవరు మాట్లాడుతున్నారు వంటి చూడటానికి రోజూ ఒకసారి మాత్రం రిమోట్ బటన్లు నొక్కుతుంటాం. ఎందుకంటే, చాలా విలువైన సాంకేతిక సౌకర్యాలవి. సరిగా సద్వినియోగం చేయటం లేదు కదా అని వాటి ప్రాధాన్యతను కించపరచలేం.



అలా రోజూ ట్యూన్ చేస్తున్నప్పుడు.. కాస్త విజ్ఞత, పరిజ్ఞానం గలవారు మాట్లాడుతుంటే మాత్రం చూడటం కొనసాగుతుంది. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ మాట్లాడితే పూర్తి కార్యక్రమాన్ని చూస్తాం.. బహుశా చాలామంది లోక్‌సత్తావాళ్లు, ఆరోగ్యకరమైన చర్చను కోరుకునేవారు ఇలాగే చేస్తారనుకుంటా. ఈరకంగానే ఇటీవల చూస్తున్నప్పుడు ఓ ప్రముఖ తెలుగు న్యూస్‌ఛానల్‌లో ఒక మహిళా విశ్లేషకురాలు సీరియస్‌గా రాజకీయ చర్చ చేస్తున్నారు. మంచి వాక్పటిమతో గుర్తింపు పొందాలనే తపనతో ఆమె మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రోత్సహించటం కూడా ఓ బాధ్యత అనుకుంటాం కాబట్టి.. చర్చను శ్రద్ధగా వినటం జరిగింది. ఆమె ఏ రాజకీయ పార్టీలోనూ లేరు. కానీ ఓ ప్రాచుర్య రాజకీయ పార్టీ ప్రతినిధికి హితవు పలికారు. "రాజకీయ నేతలంటే అప్పుడప్పుడూ కొన్ని కార్యక్రమాలు చేయటం కాదు. నిత్యం ప్రజల్లో ఉండాలి. 24/7 ప్రజలకు అందుబాటులో ఉండాలి. అప్పుడే నిజమైన నాయకుడు" అని ఆవేశంగా తేల్చిచెప్పారు. కార్యక్రమానికి ప్రజెంటర్‌గా వ్యవహరించినవారు కూడా ఆ భావాల్ని ప్రోత్సహిస్తూ సదరు పార్టీ ప్రతినిధిపై మరో ప్రశ్నను సంధించారు: "పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి రావటమో, ఇతరత్రానో ప్రజలకు ప్రభుత్వ ఆఫీసుల నుంచి రోజూ పనులు అవసరమవుతుంటాయి. ఇలాంటివి చేసిపెట్టటానికి నాయకులు అందుబాటులో లేకపోతే ఎలా" అని ప్రశ్నించారు.. ప్రజలు యాచకులు అనే తరహాలో సాగిన ఆ పాతరాజకీయ చర్చను వింటున్నప్పుడే ఒక విషయం స్ఫురించింది. ఇటీవల సురాజ్య యాత్ర సందర్భంగా జేపీ ఒకచోట ఈ అంశాన్ని ప్రస్తావించారు. చాన్నాళ్ల క్రితం ఆయన రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు ఇద్దరు ప్రాచుర్య రాజకీయ నేతలు కలిశారట. వారు అప్పుడు రాజకీయ నిరుద్యోగులుగా ఉన్నారు. ఇప్పుడు మంత్రిపదవుల్లో ఉన్నారనుకోండి. ఆ సమయంలో ఏ పదవీలేక ఖాళీగా ఉన్నవారిని జేపీ అడిగారు.. 'మీరేం చేస్తుంటారు?' అని. 'పార్టీ పనులు చూస్తుంటాం' అని చెప్పారు వారు. 'అది సరే. మామూలుగా ఏం చేస్తుంటారు?' అనడిగారు. వారికి అర్థంకాలేదు. 'అదే సార్.. పార్టీ వ్యవహారాల్ని పర్యవేక్షిస్తుంటాం' అని చెప్పుకొచ్చారు. బాగా ఆస్తుల్ని సంపాదించో లేక ఏదోకరూపంలో సొంత వనరులుండో స్వతంత్ర పోరాటంలోలా రాజకీయాల్లోకి వచ్చినవారు కారు వారు. దీనర్థం.. పార్టీ ద్వారానే, రాజకీయాల ద్వారానే వారు పొట్ట పోసుకుంటున్నారు, విలాసమనదగ్గ సౌకర్యవంతమైన జీవితాన్ని

గడుపుతున్నారు! అంటే, ఏ రూపంలోనైనా ప్రజల డబ్బును సేకరిస్తూ వారు సొంత డబ్బులా వాడేసుకుంటున్నారు, అధికారంలో ఉన్నప్పుడంత కాకపోయినా పైరవీలతో వెనకేసుకుంటున్నారు. టీవీ చర్చలో విశ్లేషకురాలు చెప్పినట్టు చేయటమంటే.. జనం సొమ్మును రాజకీయ నేతలు ఇష్టమొచ్చినట్టు మెక్కేస్తూ దోచేస్తూ పైకి మాత్రం నిత్యం ప్రజల మధ్య ఉన్నట్టు కనిపించాలి.. అది రాజకీయమా? అది ప్రజాసేవా?.. మిగతా రంగాల్లో ఎంతో పరిజ్ఞానం, సహృదయత ఉన్నవారిలో కూడా రాజకీయాల గురించి లోతైన అవగాహన లేకపోవటం వల్ల ఇలాంటి విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

ఒకరికో, పదిమందికో, వందల మందికో కాకుండా.. కోట్లాదిమందికి తక్కువ సమయంలో ఎక్కువ మేలు చేయాలంటే.. రాజకీయాన్ని ప్రభావితం చేయటాన్ని మించిన మార్గం లేదు. అందుకే మహాత్మాగాంధీ.. రాజకీయం ఒక సర్పంలా మన జీవితంలోని ప్రతి అంశాన్నీ అల్లుకుని ఉంటుందని చెప్పారు. "పవిత్ర రాజకీయాన్ని మించిన గొప్ప వ్యాసంగం మనిషి జీవితంలో లేదు" అని లోక్‌సత్తా పేటెంట్ కోట్‌లా చెబుతుం టుంది. కానీ రాజకీయంలోనూ, ఆ రాజకీయానికి వేదికలుగా ఉండే పార్టీల్లోనూ ఎలా భాగస్వాములు కావాలి అనే దాని మీద స్పష్టత మనకు లేకపోతే, సమాజానికి లాభం చేయబోయి నష్టం చేసిన వారమవుతాం. రాజకీయాల్లో గాంధీజీనో, స్వతంత్ర పోరాటంలో జీవితాల్ని సమర్పించిన ఇతర జాతీయోద్యమ నేతలనో యధాతథంగా అనుకరించటం ఈవేళ సరైనది కాదు. గాంధీ వంటి వారి పట్ల ఉన్న రొమాంటిజానికి తోడు, స్వతంత్ర భారత దేశంలో ప్రభుత్వోద్యోగుల్లో బాధ్యత, జవాబుదారీతనం లేకపోవటం వల్ల...ప్రభుత్వ కార్యాలయాల్లో మనకు హక్కుగా చేయాల్సిన పనులను మనకేదో ప్రత్యేక ఫేవర్‌లా చేసిపెడుతూ, ఓట్లు, కోట్లు దండుకుంటూ మన మధ్యే ఉన్నట్టు కనిపించే సాంప్రదాయ నేతల రాజకీయాన్నే మనలో పలువురు సమర్థిస్తున్నారు. గాంధీలాగా త్యాగం చేయగల అసాధారణ నాయకులు ఉంటే అది వారిష్టం. వారిని కాలాతీత ఐకాన్లుగా గౌరవించటం, వారి నుంచి నేర్చుకుంటూండటం మనందరి బాధ్యత. కానీ అది అందరికీ వర్తించే మోడల్ కాకూడదు. అందులోనూ స్వతంత్ర పోరాటకాలంలో ఉన్న ఆర్థికవ్యవస్థ వేరు, ఇప్పటి ఆర్థికం వేరు. వేగవంతమైన ఈ పోటీ ప్రపంచంలో కనీస సౌకర్యాలను పొందటానికి, కాస్త ఎదగటానికి కూడా రోజూ కష్టపడాల్సి ఉంటుంది. అందుకే ప్రజల్ని జాతీయోద్యమంలోలా త్యాగాలు చేయమని అడగటం ఈవేళ న్యాయం కాదు. అదేసమయంలో ప్రజలు గాంధీ, అంబేద్కర్ వంటి వారి ఆలోచనల నుంచి నేర్చుకుంటూ.. రాజకీయాల్ని (ఎన్నికల రాజకీయాలు కావచ్చు, సామాజిక రాజకీయాలు కావచ్చు), పాలనని పట్టించుకునేలా చేయాలి. ఎందుకంటే, మన రోజువారీ జీవితంలో, చదువులో, ఉద్యోగంలో, వ్యాపారంలో మంచి ఫలితాలను సాధించి ఆనందమయ జీవితాన్ని గడపాలంటే.. రాజకీయాలు, పాలన సక్రమంగా ఉంటేనే సాధ్యమవుతుంది. అంటే, మన సమయంలో ఎంతోకొంత తప్పనిసరిగా చుట్టూ ఉన్న సమాజం గురించి, మనంతట మనం చేసుకోలేని పనులను చేసి పెట్టే ప్రభుత్వాల గురించి పట్టించుకోవాలి. ఈ చైతన్యాన్ని పెంచటం కోసం లోక్‌సత్తా దాదాపు 21ఏళ్లుగా నిర్విరామంగా కృషి చేస్తోంది. ఈవేళంటే మనకు గూగుల్ వంటి సదుపాయాలు వచ్చేశాయి. ప్రధాన మంత్రికి తెలిసిన విషయాల్ని మనం కూడా చేతిలో ఫోన్ ద్వారా సెకన్లలో తెలుసుకోవచ్చు. కానీ ఓ ప్రామాణిక సమాచారం కోసం కొన్ని పుస్తకాల్ని విదేశాల నుంచి కూడా తెప్పించుకుంటూ, పలువురు నిపుణులతో సమావేశాలు జరుపుతూ, వాస్తవాల్ని ధృవీకరించుకోవటానికి రోజులు, ఒక్కోసారి నెలల తరబడి ఎదురుచూసే కాలం నుంచి లోక్‌సత్తా తన జనసంస్కరణల కృషిని కొనసాగిస్తోంది. లోక్‌సత్తా భాష, బహిరంగ చర్చా ప్రమాణాలు, రాజకీయ సంస్కృతి అప్పట్లో చాలా కొత్తగా, వింతగా భావించేవారు. ఇప్పుడిప్పుడే కొంత ఫలితం కనిపిస్తోంది. లోక్‌సత్తా బాటలో 'ఆమ్‌ఆద్మీ' (ఆప్) పార్టీ వంటివి, పౌరసంస్థలు ఆవిర్భవించాయి. లోక్‌సత్తా భాషను సాంప్రదాయ పార్టీలు కూడా వాడుతున్నాయి.. పైన చెప్పిన టీవీ చర్చ తర్వాత అదే న్యూస్‌ఛానల్‌లో అదే ప్రైమ్‌టైమ్‌లో రెండ్రోజుల అనంతరం జేపీతో ఓ చర్చాకార్యక్రమం వచ్చింది. అందులో టీడీపీ, కాంగ్రెస్, వైసీపీ, టీఆర్ఎస్ తదితర పార్టీల ముఖ్య నాయకులు పాల్గన్నారు. వారు కూడా జేపీ చెప్పిన అంశాలతో ఏకీభవిస్తూ.. ప్రజల పన్నుల డబ్బును సద్వినియోగం చేయటం, జనాకర్షణ పథకాల స్థానంలో ప్రజలకు నిర్మాణాత్మకంగా మేలు చేసే పథకాలతో మేనిఫెస్టోలను తయారుచేయటం వంటి అంశాల గురించి మాట్లాడారు. ఒకప్పుడు ఇలాంటి మాటల్ని వారి నుంచి ఊహించగలిగేవారం కాము. మార్పు కోసం లోలోపల కదలిక మొదలైందని స్పష్టంగా కనిపిస్తోంది. ఈ లైవ్‌షో చర్చను చూశాక ఎంతోకొంత సంతోషం అనిపించింది. కానీ చర్చలో పాల్గొన్న వారిలో దాదాపు అందరూ ఎన్నో ఏళ్లుగా లోక్‌సత్తాను పరిశీలిస్తున్నవారు. వారిలో ఎట్టకేలకు స్పందన మొదలైంది. ఇప్పుడు మిలీనియం తరం వచ్చేసింది. 2000 సంవత్సరంలో పుట్టినవారు వచ్చే ఎన్నికల్లో ఓటు వేయబోతున్నారు. ఇలా 2018లో ఓటు హక్కు వచ్చిన మిలీనియం తరం

భారతదేశంలో 2.4కోట్ల మందికిపైగానే ఉంటారని అంచనా. ప్రతితరం తన ముందుతరం కంటే మెరుగ్గా, చురుగ్గా ఆలోచించగలుగుతుంది. ఎందుకంటే, గతతరం భుజాల మీద ఈతరం నిలబడి ఉంటుంది. అందరూ న్యూటన్, ఐన్‌స్టీన్‌లాంటి మేధావులు కాకపోవచ్చు.. కానీ అలాంటి అరుదైన వ్యక్తుల భుజాల మీద నిలబడి ఉన్నందున మనలో చాలామంది తమ పరిధిలో అద్భుతాల్నే చేయవచ్చు. మరి మనదేశంలో మిలీనియం తరం వారు ఆ స్థాయిలో ఉన్నారా? వారికి అంత రాజకీయ, పాలనా అవగాహన ఉందా? అంటే.. అంత అవగాహన వారిలో లేదనే చెప్పాలి.

గతతరాల్లో తప్పిదాల్ని గతతరాల్లోనే సరిచేయకుండా భావితరాలకు మీదకు నెట్టే పాపం మన రాజకీయంలో, పాలనలో కొనసాగుతూ వస్తుండటం వల్ల మిలీనియం తరాల వారిలో తెలివితేటలు ఉన్నా కూడా.. మిగతా ప్రపంచంతో పోటీపడి ఎదగలేకపోతున్నారు. వ్యక్తిగత ఎదుగుదలను అలా ఉంచితే, ఉమ్మడి అవసరాలకు సంబంధించి వారి అవగాహన, ఎన్నికల రాజకీయంలో కాకున్నా సామాజిక రాజకీయంలో, పాలనా వ్యవహారాల్లో పాలుపంచుకునే శక్తి కూడా పరిమితంగానే ఉంది. గతతరంలో ఇప్పుడిప్పుడే వస్తున్న మార్పును వేగంగా అందుకోగలిగే అవకాశం వారికున్నా.. అందుకు తగిన మార్గదర్శకత్వం, పరిస్థితులు వారికి లేవు. దీన్ని సరిచేయటం ఈవేళ మనదేశం ముందున్న అతి ముఖ్యమైన కార్యక్రమాల్లో ఒకటి.

మిలీనియం జనరేషన్ అంటే కరెక్టుగా 2000 సంవత్సరంలో పుట్టినవారే అనుకోకుండా.. ఓ నాలుగైదేళ్లు ముందు పుట్టినవారిని కూడా కలుపుకుంటే అభ్యంతరం అక్కర్లేదు. అలాగే చదువులేనివారిని కాకుండా.. కాస్త చెప్పుకోదగిన చదువు అభ్యసిస్తున్నవారినే తీసుకుందాం. ఈ యువతీయువకుల్లో కూడా సామాజిక రాజకీయ చైతన్యం ఆశించినంతగా లేదని ఇటీవల జేపీ సురాజ్య యాత్రలో వెల్లడైంది. వీరిలో వ్యవస్థలోని కుళ్లు పట్ల తిరస్కార భావం, మార్పు రావాలన్న బలమైన ఆకాంక్ష, మెరుగైన సాంకేతిక అవగాహన గతతరంలోనివారి కంటే ఎక్కువగా ఉన్నాయనటంలో సందేహం లేదు. సాంప్రదాయ రాజకీయ పార్టీలు లోక్‌సత్తా భావాల్ని, భాషని కొంతైనా అనుసరిస్తుండటానికి.. వ్యవస్థ పట్ల వ్యతిరేకతతో ఉన్న ఈ కొత్త తరాన్ని ఆకర్షించాల్సి రావటం కూడా ఒక ప్రధాన కారణం. అయితే తమ ముందున్న సవాళ్లతో పోలిస్తే యువతకున్న సామాజిక, రాజకీయ అవగాహన చాలా పరిమితంగా ఉండటం వల్ల వాళ్లు నిజమైన మార్పు చోదకశక్తుల స్థాయిని అందుకోలేక పోతున్నారు. ఆరోగ్యకరమైన ఇంగితజ్ఞానం కూడా పలువురిలో కొరవడుతోంది. ఒక దేశంగా, సమాజంగా మున్ముందు ఎదురవబోయే సంక్లిష్ట పరిస్థితులను పరిష్కరించగలిగే స్థాయిని మన యువతకు అందించటానికి చాలా కృషి జరగాల్సి ఉంది.

సురాజ్య యాత్రలో భాగంగా ఓ ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులతో జేపీ జరిపిన ముఖాముఖినే ఉదాహరణగా చూద్దాం..

'మీలో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ ఉన్నారు, ప్రభుత్వ రంగానికి–ప్రైవేటు రంగానికి మధ్య తేడా ఏంటి?' అని జేపీ అడిగారు.

'ప్రభుత్వంలో అవినీతి ఉంటుంది, ప్రైవేటులో అవినీతి ఉండదు' అని జవాబిచ్చారు విద్యార్థులు.

'అదో పాయింటే. కానీ మౌలికమైన తేడా ఒకటుంది. అదేంటి?' అని తిరిగి ప్రశ్నించారు జేపీ.

'ప్రైవేటులో చేసిన పనికి తగిన గుర్తింపు వస్తుంది. ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోరు' మరో సమాధానం వినవచ్చింది.

'అదేంటయ్యా, జనం సొమ్ము పెట్టి రోజూ రూ.2కోట్ల ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం పొందుతుంటే ఏమీ లేదని చెబుతున్నారు. ఆ ప్రచార హోరు వినలేక, చూడలేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వాలకున్న ప్రచారం ప్రైవేటు రంగంలో ఎక్కడుంది?.. ఇక ప్రభుత్వోద్యోగుల సంగతి! ఒకసారి ప్రభుత్వంలో చేరితే వారిని పీకటం జరగదు. భయంకరమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నవారు కూడా పదోన్నతులు పొందుతూనే రిటైరవుతున్నారు. ఇంకొంచెం మనసు పెట్టి ఆలోచించండి' అని తిరిగి బంతిని విద్యార్థుల కోర్టులోకి నెట్టారు జేపీ.

భాగ్యజ్యోతి, శివాజీ, ఇంకొందరు విద్యార్థులు భిన్నంగా ఆలోచించటానికి ప్రయత్నించారుగానీ సరైన సమాధానాన్ని చెప్పలేదు.

దీంతో జేపీయే వివరించారు.

"ప్రభుత్వం–ప్రైవేటు మధ్య ఉన్న తేడా– 'గుత్తాధిపత్యం' (మోనోపలీ)! ప్రైవేటులో పోటీ ఉంటుంది. ఒక సంస్థ తాను చేసిన ఉత్పత్తిని ప్రజలందరూ కొనాలని శాసించలేదు. ప్రత్యక్షంగానే కాదు, పరోక్షంగా కూడా సాధ్యం కాదు. ఆ ఉత్పత్తి నచ్చకపోతే ఎంత పెద్ద సంస్థయినా దుకాణం సర్దుకోవాల్సిందే.

ఒకప్పుడు టెలిఫోన్ కావాలంటే, కారు కావాలంటే కొన్నేళ్లపాటు క్యూలో వేచి చూడాల్సి వచ్చేది. డిపాజిట్‌గా రూ.20,000 దాకా కట్టాల్సి వచ్చేది. ఇప్పటి లెక్కలో అది దాదాపు రూ.లక్షతో సమానం. మూడునాలుగేళ్లపాటు ఆ డబ్బును అలా సర్కారువారి వద్దే అట్టి పెట్టాల్సి వచ్చేది. ఆ తర్వాత ఫోన్ వస్తే, దాన్ని బిగించటానికి లంచం ఇవ్వాల్సి వచ్చేది. అది గ్యారంటీగా కొన్ని రోజుల్లో రిపేరుకు వస్తుంది. మళ్లీ లంచం ఇస్తేనే

దాన్ని బాగుచేస్తారు. అలాగే కార్లు! ఫియట్, అంబాసిడర్ కంపెనీలుండేవి. వాళ్లు మనకిచ్చిన కారును కొనుక్కోవలసిందే. అది రిపేర్లు లేకుండా ఉంటే మన అదృష్టం. రిపేర్లు లేకపోయినా, సెకండ్ హ్యాండ్‌గా అమ్మాలంటే కారుకు పెద్ద రేటు రాదు. అయినా అంత రిస్కు చేసి కారును కొనుక్కోవలసి వచ్చేది. కానీ ఆటోమొబైల్, టెలిఫోన్ రంగాల్లో లైసెన్స్‌రాజ్‌ను తొలగించి స్వేచ్ఛామార్కెట్‌తో పోటీని ప్రవేశపెట్టటం వల్ల ఈవేళ ఆ కంపెనీల వాళ్లు వచ్చి మనల్ని బతిమిలాడు కుంటున్నారు. బాబ్బాబూ, మా ఫోన్ కొనండి, మా కారు కొనండి అని.

మనకు నచ్చిన ఫోను, కారు కొంటున్నాం. టాటా లాంటి పేరున్న కంపెనీ అయినా సరే.. ప్రొడక్ట్ బాగా లేకపోతే తిప్పికొడుతున్నాం. టెలిఫోన్ రంగంలో టాటా వాళ్లు ఎందుకు దుకాణం మూసుకున్నారు? వారి కంటే మెరుగైన సేవల్ని ఇంకొకరు అందిస్తున్నారు కాబట్టి.

భారతదేశంలో ఈవేళ టాప్‌లో ఉన్న కంపెనీల్లో అనేకం గత 30-40 ఏళ్లలోనే ఆ స్థాయికి ఎదిగాయి. స్వతంత్రం రాక ముందు, ఆ తర్వాత కొన్ని దశాబ్దాలపాటు కూడా అగ్రస్థానంలో ఉన్న అనేక కంపెనీలు కనుమరు గయ్యాయి. పోటీని తట్టుకుని, ఉత్పత్తులను అందించినవారు మాత్రమే పెరుగుతున్నారు. ఈ పోటీ వల్ల ప్రజలకు చౌకగా ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చాయి.

కానీ ఇదే పోటీ ప్రభుత్వంలోని అన్ని విభాగాల్లో సాధ్యం కాదు. ఉదాహరణకు రోడ్లు. వెళ్లినచోటల్లా తాను ప్రయాణించే విమానాశ్రయం వరకూ రోడ్డు వేసుకోవటం ఎంత ప్రపంచస్థాయి సంపన్నుడికైనా, కంపెనీకైనా సాధ్యం కాదు. అలాగే పోలీసులను నడపటం సాధ్యం కాదు. ఒకవేళ ఎంతోకొంత ఇవన్నీ చేసుకున్నా, ఏదోకచోట నుంచి వచ్చి కుట్టే దోమల్ని ఆపటం సాధ్యం కాదు. ఇలాంటివన్నీ



ప్రభుత్వమే చేయాలి. అంటే అనివార్యమైన గుత్తాధిపత్యం ప్రభుత్వంలో ఒకమేర ఉంటుంది" అని జేపీ తెలిపారు.

మనందరి జీవితాల్లో 60 నుంచి 70 శాతం వరకూ మాత్రమే మన చేతుల్లో ఉంటుందని, మిగిలింది ప్రభుత్వం, సమాజం వంటి చుట్టూ ఉన్న ప్రపంచం చేతుల్లో ఉంటుందని జేపీ వివరించారు. అందుకే ప్రభుత్వాన్ని, సమాజాన్ని పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీర్ఘకాలం పట్టించుకోకపోతే, బైట నుంచి ప్రభావం చూపే ఆ 30-40శాతం మన వ్యక్తిగత జీవితాల మీద తీవ్ర ప్రభావం చూపి చివరకు మనకున్న 60శాతం పరిధిని కూడా కుదించేసి ప్రభుత్వం ముందు యాచించేవారిగా మిగిలిపోయే అవకాశముందన్నారు. మన జీవితాలపై మౌలిక ప్రభావం చూపే ఆ 30-40శాతాన్ని ఎలా పట్టించుకోవాలో యువత, ఇతర ప్రజలకు తెలియచెప్పటం, వారిని ఆ దిశగా కార్యోన్ముఖుల్ని చేయటమే సురాజ్య యాత్ర లక్ష్యమన్నారు.

ప్రభుత్వం అధీనంలో ఉన్న రంగాల్లో గుత్తాధిపత్యం దుష్పరిపాలనకు దారితీయకుండా ఉండటానికి విద్య, ఆరోగ్య రంగాలను నాణ్యమైనవిగా తీర్చిదిద్దాలని, ఉపాధి కల్పించటంతోపాటు వ్యవసాయంలో జీవనోపాధి పొందుతున్న వారికి న్యాయమైన ఆదాయాన్ని అందించాలని, చట్టం సరిగా అమలయ్యేట్టు చూడాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేని సేవలను అందించాలని, జనం ఉన్న చోటే స్థానికంగా అధికారాలు, నిధులు బదిలీ కావాలని.. ఈ ఆరు లక్ష్యాలే ప్రస్తుత సురాజ్య యాత్ర ఎజెండా అని జేపీ అన్నారు.

సురాజ్య లక్ష్యాల గురించి స్పష్టతనిస్తూ.. ప్రభుత్వం నేరుగా ఉద్యోగాలనివ్వలేదని, ఉద్యోగాలొచ్చే పరిస్థితుల్ని కల్పించాలని జేపీ అన్నారు. చట్టబద్ధపాలన లేకుండా ఉంటే, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు తీసుకుంటూ ఉంటే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. దేశంలో గూండాగిరి పెరిగిపోతోందన్నారు. గూండాలు అప్రకటిత జడ్జీలుగా మారి సెటిల్‌మెంట్లు చేస్తున్నారన్నారు. న్యాయపదకోశంలో సెటిల్‌మెంట్ అనే పదానికున్న అర్థమే మారిపోయిన సమాజంలో ఉన్నామన్నారు. నేరం చేసినవారిలో వాళ్లంతట వాళ్లు బలవంతంగా లాఠీ దెబ్బలు తినో, పోలీస్ స్టేషన్లో టార్చర్లు అనుభవించో, మరో కారణంగానో నేరాలు ఒప్పుకుంటే తప్ప.. శిక్షలు పడుతున్నది మనదేశంలో కేవలం నూటికి ఆరుగురికి మాత్రమేనన్నారు. రాజీవ్‌గాంధీ హత్య కేసుపై తీర్పు 18 ఏళ్ల తర్వాత వచ్చిందని, ముంబయి ఉగ్రవాదులపై నేరారోపణలు 24 ఏళ్ల తర్వాత తేలాయని అన్నారు. ఇంత పెద్ద, సంచలన కేసుల పరిస్థితే ఇలా ఉంటే రక్షణ, న్యాయం ఎక్కడుంటుందన్నారు. కాగితాల మీదే రూల్ ఆఫ్ లా ఉందన్నారు. కుటుంబ

వ్యవస్థ బలంగా ఉండటం, సమాజంలో కొన్ని మంచి సంప్రదాయాలు కొనసాగుతుండటం వల్ల మనదేశంలో ఇంకా శాంతిభద్రతల సమస్య అదుపు తప్పటంలేదన్నారు. వేగంగా పెరగుతున్న పట్టణీకరణ వల్ల ముున్ముందు ఆ అదృష్టం కూడా మనల్ని కాపాడలేదన్నారు. అందుకే మేలుకోవాలన్నారు.

అలాగే నైపుణ్యమున్న చదువులు లేకుండా ఉపాధిని ఎలా ఇవ్వగలుగుతారో ఆలోచించాలని జేపీ అన్నారు. చదువు, ఆరోగ్యం, ఇలా ప్రజలందరికి తప్పనిసరి అవసరమైన అంశాల్లో 49 దేశాల మధ్య జరిపిన సర్వేలో మనదేశం 46-49 స్థానాల్లో ఉందన్నారు. కొన్నిటిలో చిట్టచివర కాకుండా కాస్త పైన ఎందుకు ఉందా అని పరిశీలిస్తే.. పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియాలు కనిపించాయన్నారు. కేవలం ఆరోగ్య ఖర్చుల కారణంగా మనదేశంలో 6కోట్ల మందికిపైగా అప్పులపాలవుతున్నారన్నారు. పేదరికాన్ని నిర్మూలిస్తామంటూ పేదరికాన్ని పెంచే విధానాలను అమలుచేస్తున్నారన్నారు.

ఈ పరిస్థితులను మార్చేందుకు అదనపు నిధులు కూడా అక్కర్లేదని, విధానాలను సరిచేస్తే చాలని జేపీ అన్నారు. వీటిని మార్చకుండా ఈవేళ దేశం ఎదుర్కొంటున్న ఉపాధి సమస్యకు పరిష్కారం దొరకదన్నారు. గతంలో కారు కొనుక్కోవడం ప్రతి ఒక్కరికీ కలగా ఉండేదని, కారు పార్కింగ్‌కు ఓ సాధారణ పట్టణంలో ఇంట్లో రూ. 4-5లక్షల వరకూ అవుతాయని, బైట పార్క్ చేస్తే అదనంగా మరో లక్షో రెండు లక్షలో అవుతాయని అన్నారు. ఇంతా చేసి కారులో రోజుకు గంట సమయం కూడా ఉండరన్నారు. ఇప్పుడు ఉబర్ కార్లు వచ్చాక.. ఆ లెక్కంతా మారిపోయిందన్నారు. కారు కొనవసరం లేకుండానే, పార్కింగ్ బాదుడు లేకుండానే నచ్చిన కార్లో ప్రయాణించే అవకాశం అందరికీ వచ్చిందన్నారు. ఈ రకమైన మార్పుల మధ్య ఎలా ఉపాధి పొందాలో, ఎలా భిన్నంగా ఆలోచించి ఎదగాలో విద్యార్థులు తెలియచెప్పేలా చదువులు ఉండాలన్నారు. సురాజ్య సాధన ప్రతి ఒక్కరికీ సొంత ప్రయోజనాల దృష్ట్యా అవసరమని, అందుకే మీ సుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానం చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.

ఉన్న వనరులతోనే, త్యాగాలు అవసరం లేకుండానే, రోజువారీ పనులు చూసుకుంటూనే సురాజ్య లక్ష్యాలను సాధించుకుంటూ జీవితాల్లో పెద్ద మార్పుల్ని చూడవచ్చని జేపీ అన్నారు. ఇందుకోసం యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌ల్లో నమోదవ్వాలని విజ్ఞప్తి చేశారు.

... ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులతో సురాజ్య సమావేశంలో జేపీ చెప్పిన ఈ సూచనల మీదే దృష్టి పెట్టటం 21వ శతాబ్దపు తరానికి అవసరం. సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికల్లో గెలవలేనప్పుడు, గెలిచినవాళ్లు సక్రమంగా పరిపాలించలేనప్పుడు మిలీనియం జనరేషన్‌ను ఓటర్లుగా ఏ రాజకీయ పార్టీ ఎక్కువగా ఉపయోగించుకోగలుగుతుంది అనే చర్చ వల్ల, ఆటనియామాలను మార్చకుండా ఆటగాళ్లను మార్చాలనే సినిమా స్టార్లను, జిగ్నేష్ మెవానీ, యోగి ఆదిత్యనాథ్ వంటి వారిని ఐకాన్లుగా చూపించటం వల్ల ప్రయోజనం పెద్దగా ఉండదు. తమిళనాడులో మిలీనియం ఓటింగ్ యువత 37 లక్షలు ఉంటారని, మరో 20-25 లక్షలు త్వరలోనే జత అవుతారని, వారిని రాజకీయాల్లోకి ఆకర్షించటం తమ వల్ల కావటం లేదని డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ అన్నారు. ఇలాంటి వారందరినీ రజనీకాంత్ తన కరిష్మాతో రాజకీయాల్లోకి ఆకర్షిస్తాడని తుగ్లక్ పత్రిక ఎడిటర్ ఇటీవల ఓ ఆంగ్ల పత్రిక కాలమ్‌లో ఉత్సాహంగా చెప్పుకొచ్చారు. రజనీకాంత్ వయసు 68 ఏళ్లు, స్టాలిన్ వయసు 64 ఏళ్లు. వారి వద్ద యువతకు గొప్ప భవిష్యత్తునిచ్చే విధానాలేవైనా ఉన్నాయా అంటే.. ఇప్పటివరకైతే అవి కూడా లేవు. కాబట్టి కేవలం ఆటగాళ్ల మార్పు ఎంత ఆకర్షణీయంగా అనిపించినా దానివల్ల పెద్ద ప్రయోజనం ఉండదు కాబట్టి యువత, వారి వేలుకోరేవారు సీరియస్‌గా పట్టించుకోవాల్సిన పనిలేదు.

తమ జీవితంలో వ్యక్తిగతానికి-ఉమ్మడి అవసరాలకు మధ్య ఉండే 60:40 సంబంధాన్ని, తమ సుఖానికి, సమాజహితానికి మధ్య సంబంధాన్ని మిలీనియం జనరేషన్‌కి తెలియచెప్పటం, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో వారు ఎక్కడికక్కడ తమ రోజువారీ జీవితాల్ని చూసుకుంటూనే ఉమ్మడి సమస్యల పరిష్కారంలో సరైనదిశలో అవగాహనతో భాగమయ్యేందుకు వీలుగా యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్ వంటి వెబ్‌ప్లాట్‌ఫారాలను, సోషల్ మీడియా అకౌంట్లను వేదికలుగా అందుబాటులోకి తేవటం ఇప్పుడు అవసరం. ఇలా సామాజిక రాజకీయంలో భాగమవుతూ.. ఎన్నికల రాజకీయాల్లో పాల్గనాలా?, ఓటు ఎవరికి వేయాలి? వంటివి తమ ఇష్టానుసారం వారు నిర్ణయించుకోవచ్చు. వారిలో వనరులపరంగా ఇబ్బంది లేనివారు, బాగా ఆసక్తి, సామర్థ్యం ఉన్నవారు.. పూర్తి సమయాన్ని తమకు ఓపికున్నన్ని ఏళ్లపాటు రాజకీయంలో నాయకత్వం అందించటానికి ఇవ్వొచ్చు. సురాజ్య యాత్ర ద్వారా ఈ దిశగా జేపీ చేస్తున్న ప్రయత్నమే దేశ రాజకీయానికి, మిలీనియం తరంతోపాటు వారి సహచర యువతకు కూడా సరైన దిశ. ఈ ప్రయత్నంలో ఎంతమేర భాగస్వాములు కాగలిగితే అంతమేర ఇతర ప్రజానీకం కూడా చరిత్రకు సరైన వైపున నిలిచిన వారవుతారు.

# ప్రజాస్వామ్యానికి ప్రమాదం

## (సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ప్రజలకు విడుదల చేసిన లేఖ)



దేశ అత్యున్నత న్యాయస్థానంలో సమస్యల వల్ల భారత ప్రజాస్వామ్యంలో ముప్పు ఏర్పడుతుందని సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్లయిన నలుగురు న్యాయమూర్తులు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి.లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు న్యూఢిల్లీలో మీడియా ముందుకొచ్చి మాట్లాడారు. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) పనితీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో పాలన వ్యవహారాలు సక్రమంగా జరగటం లేదని, వాటిని సరిదిద్దేలా సీజేఐని ఒప్పించడంలో తాము విఫలమయ్యామని చెప్పారు. అందువల్ల విధిలేని పరిస్థితుల్లో ప్రజల ముందుకొచ్చి వాస్తవాలను వెల్లడించాల్సి వస్తోందన్నారు. తాము ఆత్మవంచన చేసుకున్నామన్న అపవాదును భవిష్యత్తులో ఎదుర్కోకూడదనే ఉద్దేశంతో బహిరంగంగా మాట్లాడాల్సి వస్తోందన్నారు.

"మేం చెప్పాలనుకుంటున్న విజ్ఞాపనలు, ఫిర్యాదులు అన్నీ సీజేఐకి కొన్ని నెలల క్రితం రాసిన ఈ లేఖలోనే ఉన్నాయి. లేఖ చదివితే అన్ని సమాధానాలూ మీకే దొరుకుతాయి" అంటూ వారు ఒక లేఖ విడుదల చేశారు.

లేఖ పూర్తి పాఠం:

ప్రియమైన ప్రధాన న్యాయమూర్తిగారికి,

ఇటీవలికాలంలో ఎంతో ఆవేదనకు, ఆందోళనకు గురైన మేం.. ఎంతో ఆలోచించిన పిమ్మట, మిమ్మల్ని ఉద్దేశించి ఈ లేఖ రాయటం సబబే అని భావించి ఈ పనికి పూనుకున్నాం. ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన కొన్ని న్యాయపరమైన ఉత్తర్వులు దేశంలోని హైకోర్టుల స్వతంత్రతనే కాదు, దాంతోపాటు మొత్తం న్యాయవ్యవస్థ పనితీరునే ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. అంతేకాదు, ఆ ఉత్తర్వులు గౌరవ ప్రధాన న్యాయమూర్తి కార్యాలయ పరిపాలనా విధానాలనూ భంగపరిచాయి.

మనదేశంలో బ్రిటిష్‌వారు కలకత్తా, బోంబే, మద్రాసుల్లో మూడు హైకోర్టులను ఏర్పాటు చేసిన నాటి నుంచీ కూడా న్యాయ పరిపాలనా రంగంలో కొన్నికొన్ని సత్సంప్రదాయాలు, కట్టుబాట్లు బలంగా స్థిరపడ్డాయి. ఆ మూడు హైకోర్టుల ఏర్పాటు తర్వాత దాదాపు దశాబ్దకాలానికి అస్తిత్వంలోకి వచ్చిన ఈ సర్వోన్నత న్యాయస్థానం కూడా ఆ సంప్రదాయాలను, కట్టుబాట్లను చక్కగా అందిపుచ్చుకుంది. ఈ సంప్రదాయాలన్నింటికీ మూలాలు సువ్యవస్థీకృతమైన 'ఆంగ్లో శాక్సన్' న్యాయప్రక్రియల్లోనూ, విధానాల్లోనూ ఉన్నాయి.

వీటిలో బాగా స్థిరపడిన ఒక సూత్రమే ప్రధాన న్యాయమూర్తిని 'రోస్టర్' విధానానికి నిర్దేశకుడిగా (రోస్టర్ మాస్టర్‌గా) పరిగణించటం! ఏ కేసును ఎవరు విచారించాలో బదలాయించే (రోస్టర్) అవకాశం ప్రధాన న్యాయమూర్తికి ఉంది. లెక్కకు మించిన కోర్టులున్న నేపథ్యంలో వ్యవహారాలన్నీ ఒక క్రమపద్ధతిలో జరిగేందుకు ఈ ఏర్పాటు అవసరమైంది. అంశాన్ని బట్టి దేన్ని ఈ కోర్టులో ఏయే సభ్యులు, లేదా ఎంతమంది సభ్యులున్న బెంచ్ విచారించాలన్నది నిర్ధారించేందుకు వీలవుతుంది. ఈ రోస్టర్‌ను ఏర్పాటు చేయటం, కేసులను వివిధ సభ్యులకు లేదా బెంచ్‌లకు బదలాయించటమనే విశేష సదుపాయం ప్రధాన న్యాయమూర్తికి ఉన్నట్టు గుర్తించే సంప్రదాయం- కోర్టు వ్యవహారాలు ఒక పద్ధతిలో క్రమశిక్షణతో, సమర్థంగా నడిచేందుకు ఉద్దేశించినదేగానీ.. ప్రధాన న్యాయమూర్తికి తన సహ న్యాయమూర్తులకు మించిన సర్వోన్నతమైన విశేషాధికారాలేవో ఉన్నాయని గుర్తించేందుకు కాదు. ప్రధాన న్యాయమూర్తి 'సమానులలో ప్రథములు' మాత్రమే, అంతకుమించి ఎక్కువాకాదు, తక్కువా కాదన్నది ఈ దేశ న్యాయపాలికలో ఎప్పటి నుంచో ఉన్న విస్పష్ట అవగాహన. రోస్టర్‌ను నిర్ధారించేందుకు ఆయా కేసు స్వరూప స్వభావాలను బట్టి బెంచ్‌లో ఎవరుండాలి, ఎంతమంది ఉండాలన్నది నిర్ధారించేందుకు ప్రధాన న్యాయమూర్తికి స్పష్టమైన, సుస్థిరమైన మార్గదర్శక సంప్రదాయాలున్నాయి.

ఈ సూత్రానికి సరిదోడుగా నిలిచే మరో సంప్రదాయం- ఈ కోర్టుతో సహ

పెక్కుమందితో కూడిన ఏ న్యాయవిభాగ సభ్యులైనా సరే.. రోస్టర్‌ను పరిపాటిగా గౌరవించటం! జడ్జిల సంఖ్య రీత్యాగానీ, ఎంపిక రీత్యాగానీ.. అందుకు పూర్తిగా అర్హమైన బెంచ్‌లు విచారించాల్సిన వ్యవహారాలను.. ఎవరూ కూడా తాము విచారిస్తామంటూ ఆ అధికారాలను తాము ఆవాహన చేసుకోవటం, తాము చేపట్టే ప్రయత్నం చేయటం.. ఎన్నడూ లేదు.


Dear Chief Justice,

It is with great anguish and concern that we have thought it proper to address this letter to you so as to highlight certain judicial orders passed by this Court which has adversely affected the overall functioning of the justice delivery system and the independence of the High Courts besides impacting the administrative functioning of the Office of the Hon'ble the Chief Justice of India.

From the date of establishment of the three chartered High Courts of Calcutta, Bombay and Madras, certain traditions and conventions in the judicial administration have been well established. The traditions were embraced by this Court which came into existence almost a century after the above mentioned chartered High Courts. These traditions have their roots in the anglo saxon jurisprudence and practice.

ఈ రెండు సంప్రదాయిక నిబంధనలకు దూరం జరిగితే పరిస్థితి ఇబ్బందికరమైన, అవాంఛితమైన పరిణామాలకు దారి తియ్యటవే కాదు.. అది మొత్తం న్యాయవ్యవస్థ సమగ్రతనే సందేహాస్పదం చేస్తుంది. ఇక అది సృష్టించబోయే గందరగోళం గురించి ప్రత్యేకించి చెప్పనవసరమే లేదు.

కానీ ఇటీవలికాలంలో పైన పేర్కొన్న రెండు నిబంధనలను కచ్చితంగా పాటించటం లేదని చెప్పేందుకు మేం చింతిస్తున్నాం. ఎంతో కీలకమైన, మొత్తం మన జాతినీ, న్యాయవ్యవస్థనూ ప్రభావితం చేసేంతటి కీలకమైన కేసును భారత ప్రధాన న్యాయమూర్తి తన చర్యలకు ఎటువంటి హేతుబద్ధతా లేకుండానే, కేవలం తాను ఎంచుకున్న బెంచ్‌లకు అప్పగిస్తున్న సందర్భాలు ఉంటున్నాయి. దీన్ని ఎలాగైనా నిలువరించాల్సిన అవసరం ఉంది.

మన న్యాయవ్యవస్థ మరింత నగుబాటుకు గురికాకూడదన్న ఉద్దేశంతో మేం మరిన్ని వివరాలను ఇక్కడ ప్రస్తావించటం లేదు. వాస్తవానికి సంప్రదాయాలకు దూరం జరగటం వల్ల ఇప్పటికే మన న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ కొంత మసకబారిందన్న వాస్తవాన్ని మనం గుర్తించాలి.

ఈ సందర్భంగా 2017 అక్టోబర్ 27న 'ఆర్.పి లూథ్రా వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును మీ దృష్టికి తీసుకురావటం సమంజసమని మేం భావిస్తున్నాం. విస్తృత ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని– న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన విధివిధాన సూత్రాల (మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్) రూపకల్పనలో ఇంక ఏమాత్రం జాప్యం ఉండకూడదని మేం అభిప్రాయపడుతున్నాం. ఈ విధివిధానాల రూపకల్పన అన్నది రాజ్యాంగ ధర్మాసనానికి సంబంధించిన వ్యవహారం కాగా.. దీన్ని మరో బెంచ్ ఎలా విచారిస్తుందో అర్థం కావటం లేదు.

పైవిషయం అటుంచితే, రాజ్యంగ ధర్మాసనం నిర్ణయ పర్యవసానంగా ఐదుగురు న్యాయమూర్తుల కొలీజియం (అందులో మీరూ ఉన్నారు) లోతుగా చర్చించి, విధివిధాన పత్రాన్ని రూపొందించింది. దాన్ని మార్చి 2017లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి కేంద్రప్రభుత్వానికి పంపించారు కూడా. కానీ ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి స్పందనా లేదు. ఆ మౌనాన్ని మనం– కొలీజియం రూపొందించిన విధివిధానాలకు ప్రభుత్వ ఆమోదంగానే భావించాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ (సుప్రా) విషయంలో ఈ కోర్టు జారీ చేసిన ఉత్తర్వు దీన్ని సమర్థించేదిగా కూడా ఉంది. కాబట్టి విధివిధానాలకు తుదిరూపం ఇచ్చే విషయంలో బెంచ్ ఎలాంటి నిర్ణయాలూ తీసుకోవాల్సిన పని లేదు, ఈ విషయం ఇలా నిరవధికంగా నానుతుండాల్సిన అవసరమూ లేదు.

2017 జులై 4న ఈ కోర్టుకు చెందిన ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్ జస్టిస్ సి.ఎస్ కర్ణన్ విషయంలో ఒక నిర్ణయం తీసుకుంది. ఆ సమయంలో మాలో ఇద్దరు న్యాయమూర్తులం– జడ్జిల నియామక ప్రక్రియను పున:పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాం. అంతేకాదు, అభిశంసన మాత్రమే కాకుండా తగు క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు ఒక దిద్దుబాటు యంత్రాంగం ఉండాలని అభిప్రాయపడ్డాం. అప్పుడు కూడా.. నియామక విధివిధానాలకు సంబంధించి ఏడుగురు ఉన్నత న్యాయమూర్తుల్లో ఎవరూ ఏమీ చెప్పలేదు.

న్యాయమూర్తుల నియామక విధివిధానాలకు సంబంధించి ఏ విషయాన్నయినా ప్రధాన న్యాయమూర్తి సమక్షంలో జరిగే సదస్సుల్లో, పూర్తి కోర్టు చర్చించాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన అంశాన్ని న్యాయంగా చెప్పాలంటే రాజ్యాంగ ధర్మాసనం తప్పించి మరెవరూ విచారించటానికి లేదు.

ఈ పరిణామాలను తీవ్రంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీన్నంతటినీ చక్కదిద్ది, దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన విధి, బాధ్యత గౌరవ ప్రధాన న్యాయమూర్తిదే. ఇందుకోసం ప్రధాన న్యాయమూర్తి ముందు కొలీజియంలోని ఇతర సభ్యులతోనూ, అవసరమైతే ఆ తర్వాత న్యాయస్థానంలోని ఇతర న్యాయమూర్తులతో కూడా పూర్తిస్థాయిలో చర్చ జరపాలి.

ముందుగా పైన పేర్కొన్నట్టు మీరు 'లూథ్రా వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో 2017 అక్టోబర్ 27 నాటి ఉత్తర్వుల అనంతరం తలెత్తిన పరిణామాలను పూర్తి సక్రమంగా చక్కదిద్దితే.. అవసరాన్ని బట్టి ఇదే విధంగా చక్కదిద్దాల్సిన మరికొన్ని నిర్ణయాలుంటే వాటిని కూడా మీ దృష్టికి తీసుకురాగలం.

గౌరవ నమస్సులతో..

**– జస్టిస్ జాస్తి చలమేశ్వర్ – జస్టిస్ రంజన్ గొగోయ్**

**– జస్టిస్ మదన్ బి. లోకూర్– జస్టిస్ కురియన్ జోసెఫ్**

(జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన అక్టోబర్ 16, 2015న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు చేసిన బహిరంగ ప్రకటన (మీడియా రిలీజ్) ఇది)..

# కంచే చేను మేసింది!

## ఎన్‌జేఏసీని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పుని ప్రజలు తిరస్కరించాలి, ఇది రాజకీయ పోరాటం కాదు, రాజ్యాంగ రక్షణ కోసం జాతిపోరాటం: జేపీ
## పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి పార్టీలకతీతంగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి




ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పార్లమెంటుకు, ప్రభుత్వానికి, పౌరులకు భాగస్వామ్యం కల్పించే జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయటం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధం, ప్రజలు, పార్లమెంటు నిర్ద్వంద్వంగా ఈ తీర్పుని తిరస్కరించాలి అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగాన్ని తూ నాబొడ్డు అని సుప్రీంకోర్టే అనటం సాధారణ విషయం కాదు, ఇది రాజకీయ పోరాటం కాదు, జాతిపోరాటం అన్నారు. దేశ చరిత్రలోనే కీలకఘట్టమైన ఈ తీర్పు మీద పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి లోతైన చర్చతో రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలని, పార్లమెంటు సార్వభౌమాధికారాన్ని పరిరక్షించాలన్నారు. కంచే చేను మేసినట్టు అత్యున్నత న్యాయస్థానం వ్యవహరించిందని, రాజ్యాంగాన్ని ధిక్కరించిందని అన్నారు. సుప్రీంకోర్టుకు స్వయంప్రతిపత్తి రాజ్యాంగం నుంచి వస్తుంది తప్ప రాజ్యాంగాన్నే కాదనే అధికారం సుప్రీంకోర్టుకు లేదన్నారు. న్యాయమూర్తులు స్వయంభులు, దైవదూతలు, దైవాంశసంభూతులు, చక్రవర్తులు కాదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు లోబడి పనిచేయాల్సిందేనన్నారు.

**ఎన్‌జేఏసీని ఏర్పాటుకు పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన 99వ రాజ్యాంగ సవరణను కొట్టివేస్తూ, జడ్జీలను జడ్జీలే నియమించుకునే పాత కొలీజియం వ్యవస్థనే కొనసాగించాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై జయప్రకాష్ నారాయణ్ ఇక్కడ అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ,** ప్రపంచంలోని మరే ప్రజాస్వామ్య దేశంలోనూ ఇలా మాట్లాడే సాహసాన్ని న్యాయవ్యవస్థ చేయదని, కానీ రాజకీయం దిగజారి, అరుపులు, నినాదాలు తప్ప విధానాల సంక్లిష్టతల గురించి అవగాహన తక్కువ ఉండటం వల్ల మనదేశంలో ఇలాంటి తీర్పుని ఇచ్చారని అన్నారు. ఏ ప్రజాస్వామ్య దేశంలోనైనా జడ్జీలను జడ్జీలే నియమించుకోరన్నారు. ఫ్రాన్స్, కెనడా, బ్రిటన్ తదితర దేశాలన్నిటిలో ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో ప్రభుత్వాల, పార్లమెంటుల పాత్ర ఉంటుందన్నారు. చాలా దేశాల్లో సమాజంలోని పౌరులకు కూడా అవకాశం కల్పిస్తారన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి ఉన్నత న్యాయమూర్తులను నియమించమని రాజ్యాంగంలో పదజాలం ఉంటే, దానికి విపరీతార్థాలు చెప్పి ప్రపంచంలో ఏ ప్రజాస్వామిక దేశంలోనూ లేనిరీతిలో జడ్జీలను జడ్జీలే నియమించుకునే విడ్డూరమైన కొలీజియం వ్యవస్థని మన సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిందని, ఈ తరహా వ్యవస్థనే కొనసాగించాలనుకుంటోందన్నారు.

దైవదూతల్లా, దైవాంశసంభూతుల్లా తమను తామే నియమించుకుంటామని, ప్రభుత్వం, ప్రజలతో తమకు సంబంధం లేదని చెప్పటం ద్వారా సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను తానే తగ్గించుకుందని జేపీ అన్నారు. దేశంలో సంక్లిష్టమైన మందిరం-మసీదు, రిజర్వేషన్లు, నదీజలాల పంపిణీ, ఆంధ్ర-తెలంగాణ వంటి రాష్ట్రాల మధ్య తగాదాలు వంటి ఘర్షణలు తలెత్తినప్పుడు రాజకీయం వాటిని పరిష్కరించటం కష్టమని, అటువంటి పరిస్థితుల్లో విశ్వసనీయమైన సుప్రీంకోర్టు అవసరమని, ఇలాంటి తీర్పులతో సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను కోల్పేయి దైవదూతలం, దైవాంశ సంభూతులం అంటూ వ్యవహరిస్తే ఉపద్రవాలు ముంచుకొచ్చి దేశ సమగ్రత కూడా ప్రమాదంలో పడుతుందన్నారు.

దేశం కన్నా న్యాయవ్యవస్థ ఎక్కువ కాదని, ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రజల మద్దతును ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొందాల్సిందేనని, అలా ప్రజలతో సంబంధం లేని వ్యవస్థలకు విశ్వసనీయత, నైతికత ఉండదని జేపీ స్పష్టంచేశారు. పార్లమెంటు, పౌరులు, ప్రభుత్వం పాత్ర అక్కర్లేదు అంటే ఇక కలెక్టర్లని కలెక్టర్లు, ఎన్నికల సంఘాన్ని ఎన్నికల సంఘం, యూపీఎస్‌సీని యూపీఎస్సీ, ఇలా ప్రతి వ్యవస్థా తనను తానే నియమించుకోవచ్చుని, రేపు ఎన్నికలు, పార్లమెంటు కూడా అక్కర్లేదనవచ్చని అన్నారు. ఈ ధోరణి అరాచకత్వానికి, నియంతృత్వానికి దారితీస్తుందన్నారు.

భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26, 1949న డా॥ అంబేద్కర్ మాట్లాడుతూ, ఈ రాజ్యాంగం విఫలమైతే తప్పు రాజ్యాంగానిది కాదు, దాన్ని అమలు చేసే వారిదేనని హెచ్చరించిన విషయాన్ని జేపీ ఉటంకించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన సుప్రీంకోర్టే ఈవేళ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందన్నారు. దేశ చరిత్రలో ఇది కీలకఘట్టమని, 99వ రాజ్యాంగ సవరణతో ఈ చట్టాన్ని తీసుకురావటానికి లోక్‌సత్తా 14-15 ఏళ్ల పాటు పోరాటం చేసిందని అన్నారు. విజ్ఞతకు, నిర్భీతికి మారుపేరైన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, న్యాయమూర్తి జస్టిన్ కృష్ణయ్యర్‌లను ఒకచోటకి చేర్చి ఈ బిల్లును రూపొందించిందని, పదేళ్ల పాటు కృషి చేసి అన్ని పార్టీలనూ ఒప్పించిందని అన్నారు. అందుకే ఉప్పునిప్పులా ఉండే ఎన్డీయే, యూపీయేలు ఏకగ్రీవంగా పార్లమెంటులో 2014 డిసెంబర్‌లో ఈ బిల్లును ఆమోదించాయని గుర్తుచేశారు. ఎంతో నిజాయతీతో, ముందుచూపుతో, అత్యుత్తమ న్యాయమూర్తుల భాగస్వామ్యంతో లోక్‌సత్తా రూపొందించింది కాబట్టే పార్టీలకతీతంగా అది ఆమోదం పొందిందన్నారు.

### ఇంప్లీడ్ అవుతానన్నా బెంచ్ అవకాశం ఇవ్వలేదు, ఎన్‌జేఏసీపై కృషి, సమాచారం పుస్తకరూపంలో అందరికీ, స్పందించిన సోనియా

ఈ బిల్లు వెనక కృషిని, వివరాలను పుస్తకరూపంలో రాష్ట్రపతికి, ఉపరాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ప్రతిపక్ష నేతకు, అన్ని పార్టీలకు, పార్లమెంటు సభ్యులందరికీ పంపించామని, లేఖ రాశామని, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇప్పటికే ఎన్‌జేఏసీకి మద్దతిస్తామని తిరిగి లేఖ రాశారని తెలిపారు. ఆ పుస్తకాన్ని, లేఖలను మీడియాకు జేపీ విడుదల చేశారు. ఎన్‌జేఏసీపై వాదనల సమయంలో ఇంప్లీడ్ కావటానికి తాను అభ్యర్థించినా సుప్రీంకోర్టు బెంచ్ అనుమతించలేదని, వారికి కూడా ఈ వివరాలు పంపానని తెలిపారు. ఈ చట్టంలోని సంక్లిష్ట దేశ ప్రయోజనాలను గుర్తించి సంయమనంతో తీర్పునివ్వాలని కోరానన్నారు. కానీ వారికి విషయం బోధపడకో, ఏం చేసినా చెల్లుతుందని భావించో, రాజ్యాంగానికి వేరే భాష్యం అనుకునో ఎన్‌జేఏసీని వ్యతిరేకిస్తూ తీర్పునిచ్చారన్నారు.

### ఢిల్లీకి జేపీ

ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి సహా అందరినీ కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తానని జేపీ తెలిపారు. పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ తీర్పుపై కనీసం వారంరోజుల పాటు చర్చించాలని, సుప్రీంకోర్టు రాజ్యాంగ వ్యతిరేక తీర్పునకు వ్యతిరేకంగా పార్లమెంటు సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించాలని, ఇది ప్రభుత్వ, పార్టీల వ్యవహారం కాదని అన్నారు. ఈ తీర్పును సరిచేసి, న్యాయమూర్తులు దైవాంశసంభూతుల్లా తమను తాము నియమించుకోకుండా, ఉన్నత న్యాయమూర్తుల నియామకాలు పారదర్శకంగా జరిగేలా పభుత్వం, పార్లమెంటు చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలోని అన్ని రాజ్యాంగసంస్థల నిష్ణాతుల్ని, ప్రపంచదేశాల నిపుణుల్ని పిలిపించి ప్రజలకు వాస్తవాలు అర్థమయ్యేలా చర్చ చేయాలని, న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక ప్రాతినిధ్యాన్ని కాపాడేలా ఏకాభిప్రాయాన్ని సాధించాలని అన్నారు. మీడియా దేశవ్యాప్తంగా ఈ కీలక తీర్పుపై ప్రామాణిక చర్చ జరిపి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

### రాజకీయాలు దిగజారటం వల్లే ఇంతదాకా వచ్చింది, ప్రక్షాళనపైనా పార్లమెంటు కళ్లు తెరవాలి

దాంతోపాటు అసలీ పరిస్థితి ఇక్కడిదాకా రావటానికి రాజకీయాలు దిగజారటమే కారణమని పార్లమెంటు గుర్తించాలని జేపీ అన్నారు. అవినీతి, గూండాయిజం వంటి వాటితో రాజకీయం దిగజారటం వల్లే ప్రజలు రాజకీయానికి ప్రత్యామ్నాయంగా న్యాయవ్యవస్థ మీద మితిమీరి ఆధారపడుతున్నారని, ఆ ధోరణి కొనసాగితే అది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్నే హరించివేస్తుందని అన్నారు. మన ప్రజాస్వామ్యంలో, రాజకీయంలో ఉన్న లోపాలపై లోక్‌సత్తా చేసినంత పోరాటం గత ఇరవైఏళ్లలో ఎవరూ చేయలేదని, అధికారం లేకుండానే 99వ రాజ్యాంగసవరణ సహా 15 మౌలిక మార్పుల్ని శాంతియుతంగా సాధించి చూపిందని, కానీ రాజకీయాల్లో మార్పునకు రాజకీయాలను ద్వేషించటం కాకుండా మరింత మరింత మంచి రాజకీయం దిశగా ప్రక్షాళన చేయటం, అత్యుత్తములు ఎన్నికయ్యే అవకాశాన్ని కల్పించటమే మార్గమని ఆచరించి చూపిందని అన్నారు. రాజకీయాలలో విశ్వసనీయత, నైతికత పెంచటానికీ పార్లమెంటు నడుం బిగించాలన్నారు.

"నిజాయతీ, నిష్పాక్షికత, రాజ్యాంగం పట్ల గౌరవం, రాజకీయాల్లో, వ్యవస్థల్లో మౌలికమార్పు కోసం అసాధారణ కృషి అర్హతలుగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఈ పోరాటానికి పిలుపునిస్తోంది. కానీ ఈ పోరాటం చేయాల్సిన బాధ్యత, అధికారం పార్లమెంటుది, పౌరసమాజానిది. లోక్‌సత్తా తన వంతు పాత్ర పోషిస్తుంది" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

**(ఎన్‌జేఏసీపై మెజారిటీ తీర్పుతో విభేదించటమే కాకుండా కొలీజియం వ్యవస్థలోని అప్రజాస్వామిక ధోరణుల్ని జస్టిస్ చలమేశ్వర్ బైటపెట్టిన సందర్భంగా 2016 సెప్టెంబర్‌లో సీనియర్ పాత్రికేయులు, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి రాసిన వ్యాసమిది)..**

# ఇది ధర్మాగ్రహం!



'ప్రజలు న్యాయవ్యవస్థపైనే ఆశలు పెట్టుకున్నారు'. ఈ వ్యాఖ్య చేసిన వ్యక్తి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లోధా. న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించాలనీ, అందులో ప్రభుత్వానికి లేశమాత్రమైనా ప్రమేయం ఉండరాదనే వాదనతో విభేదిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ ప్రధాన న్యాయమూర్తి టీఎస్ ఠాకూర్‌కి లేఖ రాసిన అనంతరం సాగుతున్న మేధోమథనంలో భాగంగా జస్టిస్ లోధా తన అభిప్రాయం వెలిబుచ్చారు. ఆయన మనోగతం ఏమంటే ప్రభుత్వాలూ, చట్టసభలూ భ్రష్టుపట్టిపోయాయనీ, ప్రజాస్వామ్య సౌధానికి నాలుగో స్తంభంగా చెప్పుకుంటున్న మీడియా సైతం విఫలమైందనీ, ఒక్క న్యాయవ్యవస్థ మాత్రమే ఇంకా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టి ఉంచిందనీ. ఈ అంశంపైన జనాభిప్రాయం సేకరిస్తే లోధా నమ్మకం నిరాధారమని తేలవచ్చు. మూడు దశాబ్దాల కిందట ప్రజలకు అచంచల విశ్వాసం ఉన్న మాట వాస్తవమే. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ముఖ్యంగా పదేళ్ళుగా సంభవించిన పరిణామాలు న్యాయవ్యవస్థను సైతం తక్కిన వ్యవస్థల స్థాయికి దిగజార్చాయి. ఈ దుస్థితి మారాలంటే ఎవరో ఒకరు నడుం బిగించాలి. బహిరంగ చర్చ జరగాలి. ఇందుకు తెరలేపే సాహసం చేసినందుకు జస్టిస్ చలమేశ్వర్‌ను అభినందించాలి. ఈ సమస్యను దేశవ్యాప్తంగా చర్చనీయాంశం చేసినందుకు ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్నవారందరూ ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలి.

**సాగిలపడిన వ్యవస్థ**

పాలనా వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు న్యాయవ్యవస్థ డీలా పడిన సందర్భాలు చూశాం. పాలనా వ్యవస్థ బలహీనమైనప్పుడు న్యాయవ్యవస్థ ఆధిక్యం ప్రదర్శించడమూ కనిపించింది. అత్యయిక పరిస్థితిలో వొంగమంటే నేలమీద దేకారంటూ పాత్రికేయులను బీజేపీ నేత అద్వాణీ ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్య న్యాయవ్యవస్థకూ చక్కగా సరిపోతుంది. అత్యయిక పరిస్థితి ప్రకటనకు ముందే 1973లోనే ముగ్గురు న్యాయమూర్తులను పక్కన పెట్టి వారి కంటే తక్కువ అనుభవం (సీనియారిటీ) ఉన్న న్యాయమూర్తికి ప్రధాన న్యాయమూర్తిగా పట్టం కట్టినప్పుడే ఇందిరాగాంధీ న్యాయవ్యవస్థపైన ప్రభుత్వం ఆధిక్యాన్ని చాటారు. కమిటెడ్ జ్యుడీషియరీ (నిబద్ధత కలిగిన న్యాయవ్యవస్థ) అంటూ ప్రభుత్వ సైద్ధాంతిక ధోరణితో ఏకీభవించే న్యాయవ్యవస్థ కావాలంటూ సామ్యవాదం (సోషలిజం) వైపు మొగ్గే న్యాయమూర్తుకు ప్రాధాన్యం ఇవ్వాలన్న విధానం అమలులోకి వచ్చిన తర్వాత దానికి నిరసనగా పదవులను తృణప్రాయంగా త్యాగం చేసిన న్యాయ మూర్తులను ఒక చేతి వేళ్లపైన లెక్కపెట్టవచ్చు. కనుక ప్రజాస్వామ్య పరిరక్షణ తమకు మాత్రమే సాధ్యమని కానీ, అందుకు అవసరమైన అంకితభావం, తెగువ తమకు మాత్రమే ఉన్నాయని కానీ న్యాయనిర్ణేతలు ఎవరైనా భావిస్తే అంతకంటే పొరపాటు మరొకటి లేదు.

ఆ తర్వాతైనా న్యాయవ్యవస్థ నిటారుగా నిలబడలేదు. 1980ల వరకూ బిక్కుబిక్కుమంటూనే ఉంది. 1991లో కేంద్రంలో మైనారిటీ ప్రభుత్వం, అనంతరం బలహీనమైన సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భంలో న్యాయవ్యవస్థది పైచేయి అయింది. సెకండ్ జడ్జెస్ కేసును 1993లో పరిష్కరించిన న్యాయమూర్తులే ప్రభుత్వం చేతుల్లో న్యాయమూర్తులను నియమించే అధికారం కొనసాగితే ప్రమాదమని తీర్మానించారు. న్యాయమూర్తుల నియామకంపైన సీనియర్ న్యాయమూర్తులే నిర్ణయాలు చేయాలనీ, అందుకు ప్రధాన న్యాయమూర్తి, మరి ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన కొలీజియం వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాజపేయి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం (ఎన్డీయే-1) అంత బలహీనమైనది కాకపోయినా, అత్యంత ఉదారమైనది. ఆ మెతకదనాన్ని ఆసరాగా తీసుకుని 1998లో థర్డ్ జడ్జెస్ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ పీఠం కొలీజియం వ్యవస్థను విస్తరించి బలోపేతం చేసింది. సభ్యుల సంఖ్యను అయిదుకు పెంచింది- ప్రధాన న్యాయమూర్తికి తోడు నలుగురు అత్యంత అనుభవజ్ఞులైన న్యాయమూర్తులు. ప్రధాన న్యాయమూర్తి ప్రథముడు. తక్కిన నలుగురూ సమానులే. ఇప్పటి కొలీజియంలో జస్టిస్ చలమేశ్వర్ అయిదో ప్రధాన న్యాయమూర్తి అనడం సరి కాదు. నలుగురిదీ సమాన హోదా. కొలీజియం నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తిన సందర్భాలు అనేకం. న్యాయమూర్తులు తమ బంధువులనూ, స్నేహితులనూ హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమిస్తున్నారంటూ న్యాయవాద వర్గాలు గగ్గోలు పెట్టాయి. సమర్థత, నిజాయతీ, ధర్మాభినివేశం కలిగిన వారిని పక్కనపెట్టి ఇతరేతర కారణాల వల్ల అనర్హులను గద్దె (బెంచి)నెక్కించిన విషయం అందరికీ తెలుసు. న్యాయమూర్తులుగా నియమితులైన వారంతా అనర్హులని కాదు. అనర్హులను అందలం ఎక్కిస్తున్నారన్న విమర్శలో నిజం ఉన్నదనే అభిప్రాయం జనసామాన్యంలో బలంగా నాటుకున్నది.

**న్యాయవ్యవస్థ పెత్తనం**

అయినప్పటికీ సర్వోన్నత న్యాయస్థానం పాలనా వ్యవస్థపైన తన ఆధిక్యాన్నీ, ఆధిపత్యాన్నీ యూపీయే పదేళ్ల పరిపాలనలో అప్రతిహతంగా కొనసాగించింది. యూపీయే నాయకత్వం సీబీఐని రాజకీయ ప్రత్యర్థులపైన ప్రయోగిస్తే సీబీఐని నియంత్రించే బాధ్యత సుప్రీంకోర్టు స్వీకరించడం ఒక ముఖ్యమైన మలుపు. దోలాయమాన స్థితిలో నిర్ణయాలు తీసుకునే సాహసం చేయలేని ప్రభుత్వం న్యాయవ్యవస్థకు పూర్తిగా లొంగిపోయిన సన్నివేశమది. ప్రభుత్వం తీసుకోవలసిన నిర్ణయాలను సుప్రీంకోర్టు తీసుకున్న సందర్భం. పాలనా వ్యవస్థ బలహీనపడిన మాట వాస్తవం. బాధ్యత లేని అధికారం కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ చేతుల్లో ఉండటం, ప్రధాని మన్మోహన్ సింగ్‌కు అధికారం లేకపోవడం వల్ల ఏర్పడిన గందరగోళాన్ని న్యాయవ్యవస్థ వినియోగించుకున్నది. వాస్తవానికి రాజకీయ వ్యవస్థలో విలువలు పతనమైన సమయంలోనే న్యాయవ్యవస్థలోనూ ప్రమాణాలు పడిపోయాయి.

**న్యాయమూర్తులపైన అవినీతి ఆరోపణలు**

అత్యయిక పరిస్థితిలోనే-1976లో- నాటి మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వీరాస్వామిపైన అవినీతి ఆరోపణలతో ఎఫ్ఐఆర్ దాఖలు చేయడానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనుమతించారు. న్యాయమూర్తిని అవినీతి నిరోధక చట్టం కింద విచారించవచ్చునా, కూడదా అనే ప్రశ్నపైన న్యాయవ్యవస్థలో వాదోపవాదాలు జరిగాయి కానీ కేసు ముందుకు సాగలేదు. అనంతరం కాంగ్రెస్ అధికారంలో ఉన్న కాలంలోనే జస్టిస్ రామస్వామిని అభిశంసించే తీర్మానంపైన పార్లమెంటు చర్చించింది. బాంబే హైకోర్టు న్యాయమూర్తులు ఇద్దరు నేర ప్రపంచంతో సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు వచ్చిన కారణంగా వారు పదవుల నుంచి వైదొలగవలసి వచ్చింది. ఒక న్యాయమూర్తి తాను రాయబోయే పుస్తకానికి పారితోషికం కింద ముందస్తుగా 70లక్షలు స్వీకరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆయనకు అడ్వాన్స్ చెల్లించిన ప్రచురణ సంస్థకు నేరస్థ ప్రపంచంతో బంధాలు ఉన్నాయని తేలింది. 1996 నుంచి ఏకంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులపైనే అవినీతి ఆరోపణలు వినిపించసాగాయి. 2003లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఒకరు రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థకు బంటుగా తేలి పదవికి రాజీనామా సమర్పించారు. ఇటువంటివి అనేకం ఉన్నా న్యాయవ్యవస్థ పరువును యమునా నదిలో కలిపిన ఘటన 2009లో జరిగింది. ప్రముఖ న్యాయవాది, పౌరహక్కుల నేత ప్రశాంత్ భూషణ్ ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇంతవరకూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా వ్యవహరించిన 16మందిలో సగం మంది అవినీతి పరులేనంటూ ఆరోపించారు. ప్రశాంత్ భూషణ్‌పైన కోర్టు ధిక్కార నేరం నమోదు చేశారు. నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అల్తమస్ కబీర్ నాయకత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల కమిటీ ప్రశాంత్ భూషణ్‌కి నోటీసు జారీ చేసింది. సరిగ్గా ఏడాదికి 2010లో ఆయన తండ్రి, కేంద్ర

న్యాయశాఖ మాజీ మంత్రి, ప్రముఖ న్యాయవాది శాంతిభూషణ్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లో అంతవరకూ ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన వారిలో ఎనిమిదిమంది కచ్చితంగా అవినీతిపరులనీ, ఆరుగురు నిశ్చయంగా నీతిమంతులనీ, తక్కిన ఇద్దరి విషయంలో కరాఖండిగా చెప్పడానికి తమ వద్ద సమాచారం లేదనీ వివరించారు. నీతిమంతులైన, అవినీతిపరులైన న్యాయమూర్తుల పేర్లు కూడా శాంతి భూషణ్ పేర్కొన్నట్టు వార్తలు వచ్చాయి. ప్రశాంత్‌పై కేసు ఎటుపోయిందో, శాంతిభూషణ్‌పై ఏ చర్య తీసుకున్నారో తెలియదు. అసలు న్యాయమూర్తి పరిశీలన లోకి ప్రశాంత్ భూషణ్ కేసు వెళ్ళలేదని ప్రముఖ రచయిత ఎస్.గురుమూర్తి అంటున్నారు.

**నరేంద్రమోదీ ఘనవిజయం**

పాలనా వ్యవస్థ, న్యాయవ్యవస్థ పరువు బజారుపాలైన సందర్భంలో 2014లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోదీ విరాట్ స్వరూపం ప్రదర్శించి, వందలాది సభలలో అద్భుతంగా ప్రసంగించి, ఘనవిజయం సాధించి బలమైన ప్రభుత్వాన్ని ఏర్పరిచారు. దాదాపు రెండున్నర దశాబ్దాల అనంతరం ఒకే పార్టీకి పూర్తి మెజారిటీ లభించింది. న్యాయవ్యవస్థ జోక్యందారీ వైఖరిని కట్టడి చేసే ఉద్దేశంతో నేషనల్ జ్యుడీషియల్ అప్పాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ) బిల్లును 2014 డిసెంబర్‌లో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించి కొత్త చట్టం తెచ్చింది. ఈ చట్టం ప్రకారం ఎన్‌జేఏసీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులూ, కేంద్ర న్యాయ వ్యవహారాల శాఖ మంత్రి, ఇద్దరు ప్రముఖ వ్యక్తులు ఉంటారు.

ప్రభుత్వ జోక్యంతో న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి భంగం వాటిల్లు తుందనీ, ఇది రాజ్యాంగ స్వభావానికి విరుద్ధమనీ అంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ పీఠం 2015 అక్టోబర్ 16న తీర్పు చెప్పింది. రాజ్యాంగ సమ్మతం కాదంటూ ఈ చట్టాన్ని కొట్టివేయాలని నలుగురు న్యాయ మూర్తులు తీర్పు చెబితే, అయిదో న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ మాత్రం మెజారిటీ అభిప్రాయంతో విభేదించారు. న్యాయమూర్తుల నియామకాలతో ప్రభుత్వానికి ఏమాత్రం ప్రమేయం ఉండరాదనే వాదనలతో చలమేశ్వర్ ఏకీభవించలేదు. ఏ ఇతర ప్రజాస్వామ్య దేశంలోనూ ప్రభుత్వ ప్రమేయం లేకుండా న్యాయవ్యవస్థ లేదని వాదించారు. ఒక వ్యవస్థపైన మరో వ్యవస్థ నిఘా ఉండే విధంగా చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ విధానం ద్వారా సమతౌల్యాన్ని పరిరక్షించాలనే రాజ్యాంగ నిర్మాతల లక్ష్యానికి కొలీజియం వ్యవస్థ గండి కొట్టిందనీ, ఈ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లేవని, నియామకాలలో బంధుప్రీతి కనిపిస్తున్న దనే ఆరోపణలు వస్తున్నాయనీ జస్టిస్ చలమేశ్వర్ కుండ బద్దలు కొట్టారు. రెండు దశాబ్దాలుగా న్యాయమూర్తుల నియామకాలను శాసిస్తున్న కొలీజియం వ్యవస్థపైన నాటిగా, బలంగా, ధర్మాగ్రహంతో దాడి చేసిన ఘనత జస్టిస్ చలమేశ్వర్‌కి దక్కింది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన దోహదాన్ని భావితరాలు కృతజ్ఞతా పూర్వకంగా గుర్తుపెట్టు కుంటాయి.

**రట్టయిన గుట్టు**

కొలీజియం సమావేశాలు రహస్యంగా జరుగుతాయనీ, అయిదుగురు సభ్యులలో ముగ్గురు ఎవరికి అనుకుంటే వారికే అవకాశం వస్తుందనీ, తక్కిన ఇద్దరు వ్యతిరేకించినా పట్టించుకోకుండా ఏకగ్రీవంగా నిర్ణయాలు జరిగినట్టు ప్రకటిస్తున్నారనీ, సమావేశ వివరాలు నమోదు, విభేదించిన సభ్యుల అభిప్రాయాలు, ఇతర ప్రముఖుల అభిప్రాయాలు సేకరించడం, ఆ సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియ చేయడం జరగడం లేదని వెల్లడించి జాతి యావత్తునూ జస్టిస్ చలమేశ్వర్ దిగ్భ్రాంతికి గురిచేశారు. న్యాయమూర్తుల ఖాళీల భర్తీలో జాప్యంపై ప్రధానిని అడుగుతూ కంట తడిపెట్టిన జస్టిస్ ఠాకూర్ మొన్న స్వాతంత్ర్యదినోత్సవ సందేశంలో న్యాయమూర్తుల నియామకాల గురించి ఆయన ప్రస్తావించనందుకు ఆవేదన వ్యక్తం చేశారు. అంత ఆవేశంగా స్పందించే గుణం కలిగిన జస్టిస్ ఠాకూర్ సైతం జస్టిస్ చలమేశ్వర్ తనకు రాసిన లేఖ గురించి విలేకరులు ప్రశ్నించినప్పుడు, 'త్వరలోనే మేము పరిష్కరించుకుంటాం' అంటూ ముక్తసరిగా సమాధానం చెప్పారు. ఇది ఇద్దరి మధ్యనో, లేక కొలీజియం సభ్యుల మధ్యనో పరిష్కరించు కోవలసిన వివాదం కాదు. నిజానికి ప్రభుత్వానికీ, న్యాయ వ్యవస్థకీ మధ్య రగులుతున్న చిచ్చు మాత్రమే కాదు. ప్రజలకు సంబంధించిన అతి ముఖ్యమైన అంశం. అందుకే జస్టిస్ చలమేశ్వర్ ఉద్దేశించినట్టు ఈ వివాదంపై బహిరంగ చర్చ జరగాలి. దాపరికాన్ని అంతం చేయాలి. సంస్కరణలకు బాట వేయాలి. చట్టపాలనకు పట్టం కట్టాలి.


**అమెరికా, బ్రిటన్‌లో....**

ప్రభుత్వ ప్రమేయంలేని న్యాయ వ్యవస్థలు ప్రజాస్వామ్య దేశాలలో ఎక్కడా లేవు. అమెరికాలో సుప్రీంకోర్టు న్యాయ మూర్తుల నియామకాలకు సంబంధించిన ప్రతిపాదన అధ్యక్ష భవనం నుంచి వెడుతుంది. అధ్యక్షుడు సూచించిన పేర్లను సెనేట్ కమిటీ పరిశీలించి ఆమోదించాకే న్యాయమూర్తుల నియామకం జరుగు తుంది. అధ్యక్షుడు ప్రతిపాదించినా సెనేట్ తిరస్కరించినట్లయితే ఆ నిర్ణయానికి తిరుగులేదు. అమెరికా రాజ్యాంగం రెండవ అధికరణలో రెండవ సెక్షన్ కింద సెనేట్‌కు

ఈ అధికారాలు సంక్రమించాయి. అధ్యక్షుడు సెనేట్ సలహా, ఆమోదం కోరాలని ఈ సెక్షన్ స్పష్టం చేసింది. అంటే పాలనా వ్యవస్థకూ, చట్ట వ్యవస్థకూ న్యాయమూర్తుల నియామకం లో ప్రమేయం ఉండేవిధంగా అమెరికా రాజ్యాంగ నిర్మాతలు నిర్ణయించారు. అధ్యక్షుడు ప్రతిపాదించిన తర్వాత సెనేట్ తిరస్కరించిన మొట్టమొదటి అభ్యర్థి జాన్ రూట్లెజ్. 1795లో రూట్లెజ్‌ను ప్రతిపాదించిన అధ్యక్షుడు జార్జి వాషింగ్టన్. అమెరికా ఆవిర్భావం తర్వాత 2005వరకూ అధ్యక్షులు ప్రతిపాదించిన 149మంది అభ్యర్థులలో 27మందిని సెనేట్ తిరస్కరించింది. బ్రిటన్‌లోనూ జ్యుడీషియల్ అప్పాయింట్‌మెంట్స్ కమిషన్ (జేఏసీ) ఉంది. న్యాయమూర్తి పదవికి ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కమిటీ ప్రతిపాదించే అభ్యర్థుల పేర్ల జాబితాను లార్డ్ ఛాన్సలర్ (న్యాయమంత్రి)కి పంపుతారు. ఆయన, ప్రధాని ఖరారు చేసిన జాబితాను రాజ్యాధినేత రాణికి పంపుతారు. కనుక ప్రభుత్వ ప్రమేయం బొత్తిగా ఉండరాదనే వాదనలో అర్థం లేదు. పైగా సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించిన పేర్లను కేంద్రప్రభుత్వమే రాష్ట్రపతికి పంపించాలి. ఆ జాబితాను రాష్ట్రపతికి గుడ్డిగా నివేదించడానికే కేంద్ర న్యాయశాఖ మంత్రి పరిమితం కావాలని కోరుకోవడం న్యాయమా? వాస్తవానికి థర్డ్ జడ్జెస్ కేసులో కొలీజియంను విస్తరిస్తూ రాజ్యాంగ పీఠం చెప్పిన తీర్పులోని కీలకమైన అంశాలను కొలీజియం పాటించడం లేదని జస్టిస్ చలమేశ్వర్ ధ్వజమెత్తిన తర్వాత వెల్లడి అవుతోంది. థర్డ్ జడ్జెస్ కేసుపై 1998 అక్టోబర్ 28న రాజ్యాంగ పీఠం ఇచ్చిన ఉత్తర్వు పాఠంలో 22వ పేరా కొలీజియం విధివిధానాలను స్పష్టంగా పేర్కొంది. సభ్యులందరి అభిప్రాయాలనూ నమోదు చేయాలనీ, అభ్యర్థులు ఏ హైకోర్టు నుంచి వచ్చారో ఆ హైకోర్టులోని ప్రధాన న్యాయమూర్తి, సీనియర్ న్యాయవాదుల అభిప్రాయాలను సైతం సేకరించాలనీ, వీటిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సిఫార్సులతో సవివరంగా ప్రభుత్వానికి పంపాలనీ ఉత్తర్వులో స్పష్టంగా ఉంది. కొలీజియం సమావేశం తాలూకు వివరాలనూ, సభ్యుల, అనమ్మతి తెలియచేసిన సభ్యుల అభిప్రాయాలనూ వివరంగా రాసి పంపించాలన్నది అందులో ప్రధానమైన అంశం. ఇంత వివరంగా థర్డ్ జడ్జెస్ కేసులో తీర్పు వెలువడిన తర్వాత పదహారేళ్ళపాటు ఈ అంశాలను ప్రధాన న్యాయమూర్తులు తుంగలో తొక్కారు. సమావేశ వివరాలను నమోదు చేయనే లేదు. ఫలానా కొలీజియం, ఫలానా న్యాయవాదిని ఎందుకు సిఫార్సు చేసిందో తెలుసుకోవాలంటే న్యాయమూర్తులకు కూడా సాధ్యం కాదు. రికార్డు లేదు. అసమ్మతి తెలిపిన వైనం కానీ, అసమ్మతిని తెలిపింది ఎవరనే వివరం కానీ ఎక్కడా లేదు. ముగ్గురో, నలుగురో కూడబలుక్కుని తీసుకున్న నిర్ణయాలను దేశం మీద రుద్దే ప్రక్రియే అమలవు తోంది. ఇది రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించడం తప్ప వేరొకటి కాదు. ఈ దాపరికాన్నే, ఈ జవాబుదారీతనం లేని బేఫర్వా వైఖరినే జస్టిస్ చలమేశ్వర్ ప్రశ్నించారు. దీనివల్ల అర్హులైనవారికీ, ప్రతిభావంతులైనవారికీ అవకాశాలు రావడంలేదనీ, కొలీజియం సభ్యులతో సామీప్యం ఉన్నవారికీ, వారి దృష్టిలో పడినవారికీ, వారిని మెప్పించినవారికి మాత్రమే అవకాశాలు లభిస్తాయనీ అర్థం. దీనివల్ల న్యాయవ్యవస్థ ప్రమాణాలు పడిపోతున్నాయనీ, కొంతకాలానికి ఈ వ్యవస్థ కుప్పకూలిపోతుందనీ జస్టిస్ చలమేశ్వర్ ఆవేదన. తనకి ఒకరి పట్ల వ్యతిరేకత కానీ, ఎవరినైనా మెప్పించ వలసిన అవసరం కానీ లేదని ఆయన స్పష్టం చేశారు. 'నేను రెండేళ్లలోపే (2018 జూన్) పదవీ విరమణ చేయబోతున్నాను. ఆ తర్వాత నేను ఎటువంటి పదవినీ ఆశించడం లేదు. ఏదో ఒక కమిషన్‌కు అధ్యక్షుడుగా పనిచేసే ఆలోచన లేనే లేదు' అంటూ సూటిగా చెప్పారు.

జస్టిస్ చలమేశ్వర్‌కు లేనిపోని దురుద్దేశాలు ఆపాదించడం వల్ల ప్రయోజనం లేదు. ఆయన అభ్యంతరంలో అర్థం లేకపోలేదని జస్టిస్ లోధా కూడా అన్నారు. న్యాయవ్యవస్థ పరువు ప్రతిష్ఠలు పునరుద్ధరించాలంటే సంస్కరణలు అనివార్యం. రాష్ట్రపతి మరోసారి సుప్రీంకోర్టు సలహా కోరవలసిన సందర్భం ఆసన్నమైంది. ఇదివరకటి తొమ్మిదిమంది న్యాయమూర్తుల పీఠం కంటే విస్తారమైన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసి దీన్ని సాకల్యంగా పరిశీలించాలి. ప్రభుత్వ పెత్తనం లేకుండా, న్యాయమూర్తుల చేతుల్లోనే సర్వాధికారాలు పెట్టుకోకుండా చూడాలి. పారదర్శకతను పాటించాలి. ప్రతిభావంతులనే న్యాయమూర్తులుగా నియమించేందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించుకోవాలి. ఒక వ్యవస్థ బలహీనమైనప్పుడు మరో వ్యవస్థది పైచేయి కావడం మంచిది కాదు. అన్ని వ్యవస్థలూ బలంగా ఉన్నప్పుడే ప్రజాస్వామ్యానికి చేవ. జస్టిస్ చలమేశ్వర్ లేవనెత్తిన ప్రధానమైన అంశాలపైన సర్వత్రా చర్చ జరగాలి. సముచితమైన సంస్కరణలు అమలుకావాలి. సమర్థులైన న్యాయమూర్తులు హైకోర్టులలో, సుప్రీంకోర్టులలో నియుక్తులు కావాలి. అప్పుడే చట్టపాలన, ప్రజాస్వామ్యం సార్థకం అవుతాయి.

# న్యాయవ్యవస్థ – జవాబుదారీతనంపై న్యాయకోవిదులు, రాజనీతిజ్ఞులు




పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ శాసన వ్యవస్థకు, .... (లేదా) .... న్యాయవ్యవస్థకు .... లోబడి పనిచేయాలనే నిబంధనను నేను ఏ రాజ్యాంగంలోనూ చూడలేదు..... రాజ్యాంగంలోని ప్రొవిజన్లకు రాజ్యవ్యవస్థలోని అన్ని విభాగాలూ లోబడి పనిచేయాల్సిందే.....

తన అధికారం రాజ్యాంగం ద్వారా పరిమితమని ఏ రాజ్యాంగ అధికార వ్యవస్థ గుర్తుంచుకోకపోయినా, ఆ దేశంలో రాజ్యాంగబద్ధ ప్రభుత్వం పనిచేయలేదు...."

**– డా॥ బి.ఆర్ అంబేద్కర్**

ఏ చట్టాలు రాజ్యాంగబద్ధం.. ఏవి కావు అని – తమకు సంబంధించినవైనా, తమ విధినిర్వహణ పరిధిలోనైనా, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థకు సంబంధించినవైనా – నిర్ణయించే అధికారం న్యాయమూర్తులకు ఇవ్వాలన్న అభిప్రాయం న్యాయవ్యవస్థను నియంతృత్వ విభాగంగా మారుస్తుంది

**– థామస్ జెఫర్సన్**

ఎక్కువ అధికారాన్ని ప్రదర్శించే పదవిలో ఉన్నవారు జవాబుదారీతనంతో వ్యవహరించటానికి స్వయంగా ముందుకు రావటం ప్రజాస్వామ్య పరిణతికి అవసరం. న్యాయాధికారాన్ని జవాబుదారీతనం నుంచి మినహాయించటానికి వీల్లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీయకుండా జవాబుదారీతనానికి పద్ధతుల్ని రూపొందించటం ఎలా అన్నదే సవాలు.

**– ఎ లీ సాయర్, 'డెవలపింగ్ మెకానిజమ్స్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబిలిటీ ఇన్ యు.కె', లీగల్ స్టడీస్, వాల్యూమ్ 24, ఇష్యూ 1–2, 2004**

మన న్యాయమూర్తులు ఎవరు, వాళ్లు ఎలా ఎంపికయ్యారు అనేవి ప్రజాప్రయోజనాల దృష్ట్యా బహిరంగ పరచాల్సిన, చర్చించాల్సిన అంశాలు

**– టామ్ లెగ్, లార్డ్ ఛాన్సలర్స్ విభాగం మాజీ శాశ్వత కార్యదర్శి**

పార్లమెంటు సార్వభౌమాధికారం, చట్ట ప్రాధాన్యత రెండూ పరస్పర వ్యతిరేకంగా కనిపించవచ్చు, ఒకదాన్ని ఇంకోటి నిలువరిస్తున్నట్టుగా అనిపించవచ్చు. కానీ అది భ్రమే. పార్లమెంటు సార్వభౌమాధికారం.. చట్ట ప్రాధాన్యాన్ని అవసరంగా భావిస్తుంది.

**– ఎ.వి డైసీ, బ్రిటీషు న్యాయకోవిదుడు, రాజ్యాంగ సిద్ధాంతకర్త**

# కొందరు జడ్జీలెందుకవుతారు?

**- మాడభూషి శ్రీధర్,**
కేంద్ర సమాచార కమిషనర్



సమాచార హక్కు (ఆర్టీఐ)లో తేలని అద్భుతమైన ప్రశ్న ఇది. అంతుపట్టని సమస్య ఏమంటే న్యాయస్థానంలో న్యాయమూర్తులే తప్పు చేస్తే ఏం చేయాలని? మహాభిశంసన తప్ప మరో మార్గం లేదు. అనుచితంగా ప్రవర్తించారనే ఫిర్యాదు అంది, విచారణ జరిగి, సాక్ష్యాలు దొరికి రుజువైనా తొలగింపు కష్టమే. మహాభిశంసన తీర్మానం ఆర్టికల్ 124(4) కింద ఆమోదిస్తేనే తొలగిస్తారు. తమ అహాన్ని దెబ్బతీసే తీర్పులిచ్చిన న్యాయమూర్తులపై మహాప్రభువులు కోపించి పీకేయడానికి వీల్లేకుండా ఈ నియమాలు నియంత్రణలు. నిజానికి పాలకులకు న్యాయమూర్తులకు కూడా జవాబుదారీతనం ఉండాలి. మేం గద్దెనెక్కాం కనుక ఏమైనా చేస్తాం అనే విధానానికి సంవిధానంలో స్థానం లేదు. సమపాలన, న్యాయవ్యవస్థ మీద విశ్వాసం, సంస్థాగత బాధ్యత ఉండాలంటే ఏం చేయాలి? సైకిల్ దొంగను మూడు సంవత్సరాలు జైల్లో పెట్టి పోషిస్తాంకానీ న్యాయస్థానం సోఫా కొనుగోలులో వేల రూపాయలు భోంచేసిన న్యాయమూర్తిని యువర్ ఆనర్, మై లార్డ్‌షిప్ అని సగౌరవంగా సత్కరిస్తామంటే దాన్ని రూల్ ఆఫ్ లా అని మాత్రం అనరు. ఆ పెద్దలకు ఒక్కోసారి లా తెలియపోయినా ఫరవాలేదు. తినగ తినగ వేము తీయనైనట్టు కాలప్రవాహంలో అన్నీ సర్దుకుంటాయి. అంత పెద్దవారు తప్పులు, పొరబాట్లు, అనుచిత ప్రవర్తన, దుర్మార్గం, లంచగొండితనం, కొనుగోళ్లలో వేళ్లు గోళ్లు పెట్టటం వంటి పాపాలకు పాల్పడరని, న్యాయవితరణ దైవికమైన సత్కార్యం అని, అందులో ఉన్నవారు దైవాంశ సంభూతులని జనం పెంచుకున్న నమ్మకాన్ని ఒక తులమెత్తయినా నిలబెట్టే బాధ్యత మన వ్యవస్థలో కనిపించాలన్న తపనే జవాబుదారీతనం గురించిన చర్చ. పాలకుల దుర్మార్గాలను కడిగేసే న్యాయవ్యవస్థే లేకపోతే మన జనుల అవస్థలు దారుణంగా ఉండవూ? తప్పులు రుజువైన తరువాత కూడా న్యాయమూర్తులు కె.వీరాస్వామి, పీడీ దినకరన్, సౌమిత్రసేన్ విషయంలో మన సంవిధానం అస్త్రసన్యాసం చేసింది. మహా లేదూ, అభిశంసన అంతకన్నా లేదు. న్యాయపాలనలో నిర్లక్ష్యం చేస్తే నష్టపోయిన కక్షిదారుడికి నష్టపరిహారం ఇప్పించే నియమాలు రోమన్ చట్టాల్లో ఉన్నాయి. స్వీడన్‌లో చిన్న చిన్న శిక్షలు కూడా ఈ న్యాయపెద్దల మీద విధించే వీలుంది. డెన్మార్క్‌లో అయితే వారి మీద ఫిర్యాదులు వినడానికి ఏకంగా ఒక ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేశారు మరి.

మనకూ జడ్జీల విచారణ చట్టం 1968 ఉంది. జడ్జీగారి మీద ఫిర్యాదును స్వీకరించాలంటే వంద లోక్‌సభ లేదా 50 రాజ్యసభ సభ్యులు అధ్యక్షులవారికి మహజరివ్వాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంబంధిత హైకోర్టు చీఫ్ లేదా సుప్రీంకోర్టు చీఫ్‌ల కమిటీ విచారించి తొలగించమని పార్లమెంటుకు సిఫారసు చేస్తే మహాభిశంసన తీర్మానాన్ని చర్చిస్తారు. ముద్దాయి న్యాయమూర్తిగానీ, వారి లాయర్‌గానీ తన వాదాన్ని వినిపించాలి. ఉభయ సభల్లో మూడింట రెండువంతుల మంది సభ్యులు అవునంటేనే ఉద్వాసన (ఇంతమంది పార్లమెంటు సభ్యుల మద్దతు ఉంటే ఏకంగా దేశ ప్రధానే కావచ్చు మరి). ఇది అసాధ్యమని తేలిపోయింది. దీనికన్నా ఆ న్యాయమూర్తికి 62 లేదా 65 ఏళ్లు నిండేదాకా నోరుమూసుకుని ఎదురుచూడడం చాలా మంచిదని కొందరి అభిప్రాయం. మన రాజ్యాంగంలో న్యాయవ్యవస్థకు సంబంధించిన గొప్ప నియమం ఏదంటే వారి రిటైర్మెంట్ వయో నిర్ధారణ. కొన్ని దేశాల్లో ఒకసారి గద్దెనెక్కితే చాలు జీవితపర్యంతం న్యాయమూర్తే. చక్రాల కుర్చీలో వచ్చి న్యాయచక్రం తిప్పుతుంటారు. ఆ యావజ్జీవ జడ్జీలను వదిలించుకోవడానికి హతమార్చడం ఒక్కటే మార్గమని కుట్ర చేసే థీమ్‌తో ఓ మహారచయిత థ్రిల్లర్ నవల కూడా రాసి పారేశాడు. ఈ నేపథ్యంలో జాతీయ

న్యాయమూర్తుల నియామక కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని ఎన్డీయే ప్రభుత్వం నానాతంటాలుపడి తెచ్చింది. కానీ సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఒక్క మన చలమేశ్వర్ గారు తప్ప మిగిలిన నలుగురు జడ్జీలు అది రాజ్యాంగవిరుద్ధమని సెలవిచ్చారు. అది పోయింది. అయితే ఈ అయిదుగురూ ఒక విషయంలో ఏకాభిప్రాయం వెలిబుచ్చారు. అదేమిటంటే అన్నింటి మూలం నియామకాల్లోనే ఉంది. అది అత్యంత రహస్యంగా జరుగుతున్నది. అందులో పారదర్శకత తెచ్చామా.. ఇహ మనమంతా బాగుపడిపోతామన్నారు. కానీ దాన్ని తేవడం ఎలా? కేంద్రం ఒక ప్రతిపాదన పంపింది. అందులో లోపాలున్నాయని సుప్రీం న్యాయమూర్తులు తిప్పి పంపారు. మళ్లీ సవరించి పంపారు. మన మహామహిమాన్విత దేశంలో ఎవరిని జడ్జీలుగా ఎవరు ప్రతిపాదిస్తారో, ఎందుకు ప్రతిపాదిస్తారో, చివరకు కొందరి పేర్లు ఎందుకు రాలిపోతాయో, కొందరి భాగ్యవంతుల పేర్లు ఎందుకు రాలిపోవో బ్రహ్మకు కూడా అంతుబట్టదు. పోనీ ఫలానా వ్యక్తి తాను అర్హుడినని నమ్మితే జడ్జీ పదవికి దరఖాస్తు ఎక్కడ పెట్టుకోవాలో ఎవరూ చెప్పరు. ఎవరికీ తెలియదు. మన 70 ఏళ్ల రాజ్యాంగంలో న్యాయశాస్త్ర విశారదుల నుంచి కూడా సుప్రీంకోర్టు జడ్జీలను ఎంపిక చేయాలని ఉంది. జిల్లాల్లో పనిచేసిన న్యాయాధికారుల్లో కొందరు, హైకోర్టుల్లో పనిచేసే న్యాయవాదుల్లో కొందరు హైకోర్టు జడ్జీలవుతారు. వారిలో కొందరు సుప్రీంకోర్టుకు వెళ్తారు. చాలామంది వెళ్లరు. ఎందుకో తెలియదు. అడగొద్దు. అడిగి తెలుసుకోవడానికి ఆర్టీఐ ఉపయోగపడుతుందో లేదో తెలియదు. అవన్నీ వారి ప్రయివసీ పదార్థాలు కావచ్చు. కొందరు లాయర్లను నేరుగా సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమిస్తారు. కానీ న్యాయశాస్త్ర కోవిదులకు ప్రవేశమే లేదు. ఎలా నియమిస్తారో తెలియక, తొలగించే మార్గం లేక, తప్పులు రుజువైనా చర్యలుండక.. ఏమిటిది? (న్యాయమూర్తుల నియామకాధికారాలను రాజకీయ నాయకులతో పంచుకోవడం వివేకవంతమైన చర్య అనడంలో ఇబ్బందులున్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ కేహార్ అన్నారు. భారతదేశంలో పౌరసమాజం తగినంతగా పరిపక్వత చెందలేదని, కనుక న్యాయమూర్తుల నియామకంలో ఏవైనా లోపాలు జరిగితే అవి దేశాన్ని సంక్షోభంలోకి పడదోస్తాయని ఆందోళన చెందారు. అయితే ఇప్పటి నియామక విధానాల్లో జడ్జీలయినవారు ఏ విధంగా సంక్షోభం సృష్టిస్తున్నారో మనకు దృష్టాంతాలు కనిపిస్తూనే ఉన్నాయి). ఈ న్యాయమూర్తులు తమ తీర్పుల్లో చెప్పినంతకాలం సైకిల్ దొంగలు జైల్లో ఉంటూ జనం పన్నుల ఖర్చు మీద ఆధారపడి తింటుంటారు. దీనికి ఆర్టీఐ ఏం చేస్తుంది చెప్పండి. (సుభాష్ చంద్ర అగర్వాల్ వర్సెస్ లా మంత్రిత్వ శాఖ సీఐసీ/వీఎస్/ఎ/2014/000989&ఎస్ఏ కేసులో 03-05-2017న ఇచ్చిన తీర్పు ఆధారంగా)

*(సాక్షి సౌజన్యంతో)*

# జేపీ దృష్టికి ఆయిల్‌పామ్ రైతుల సమస్యలు

రాష్ట్రంలో ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నల్లజర్ల ఆయిల్‌పామ్ రైతు సమాఖ్య సభ్యులు లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీని పశ్చిమ గోదావరి జిల్లా సురాజ్య యాత్రలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆయిల్‌పామ్ దిగుమతి సుంకాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వు జారీచేసిందని, ముడి ఆయిల్‌పామ్ నూనెపై 7.5నుంచి 15శాతానికి, శుద్ధి చేసిన నూనెపై 15నుంచి 15శాతానికి పెంచారని, కానీ పరిశ్రమలకు తప్ప రైతులకు లాభం ఉండేలా ఏర్పాట్లు లేవని అన్నారు. ఆయిల్‌పామ్ ఉత్పత్తి వ్యయం రూ.10,000 అవుతుంటే, టన్నుకు రూ.7,000 మాత్రమే ఇస్తున్నారన్నారు. రైతుకు లాభం చేకూరేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రైతుల తరపున పాకలపాటి అమరనాథ్ వినతిపత్రాన్ని అందచేశారు.



(న్యాయసంస్కరణలపై సెప్టెంబర్ 11, 2016న నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం రిపోర్టు)..

# జడ్జీలూ జవాబుదారీయే!

## ప్రజలు, జాతీయ ప్రముఖుల అభిప్రాయాన్ని కూడగట్టి రాష్ట్రపతి, ప్రధాని, సీజేఐని కలవాలని ఆస్కీ-లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ రౌండ్‌టేబుల్ తీర్మానం




**జ**డ్జీలకు కూడా పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిందేనని లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్-ఆస్కీ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం స్పష్టంచేసింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, రాజ్యాంగంపై ఎవరు ఎలాంటి వాదనల్ని చేసినా అంతిమంగా ప్రజాప్రయోజనాలే రాజ్యాంగస్ఫూర్తికి, ప్రతి వ్యవస్థకూ గీటురాయి అని పేర్కొంది. న్యాయవ్యవస్థకు స్వయంప్రతిపత్తితోపాటు జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలని రౌండ్‌టేబుల్ చేసిన తీర్మానాన్ని సోషల్ మీడియా, ఇతర మార్గాల్లో దేశంలోని సుప్రసిద్ధ పౌరులు, అన్ని వర్గాల ప్రజల ముందు ఉంచి సంతకాలను సేకరించి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అందిస్తామని ప్రకటించింది.

**ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకత కోసం రూపొందించిన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టం (99వ రాజ్యాంగ సవరణ)ను సుప్రీంకోర్టు కొట్టివేయటం, అదేసమయంలో ప్రస్తుతం నియామకాలు చేస్తున్న కొలీజియం విధానం లోపభూయిష్టమైనదని అత్యున్నత న్యాయస్థానమే అంగీకరించటం, తాజాగా న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత, ఎంపిక సమయంలో చేసే చర్చల వివరాల లిఖితపూర్వక నమోదు, నిర్ణయాలు, సిఫార్సులకు ప్రాతిపదికలు వంటి అంశాలను సుప్రీంకోర్టు కొలీజియంలో సభ్యుడైన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ లేవనెత్తటం.. నేపథ్యంలో 'న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం-పారదర్శకత' అంశంపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ (ఆస్కీ), ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) సంయుక్తంగా రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్డులోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాల బెల్లావిస్టా క్యాంపస్‌లో జరిగిన ఈ రౌండ్‌టేబుల్‌ను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి, ఆస్కీ డైరెక్టర్ పద్మభూషణ్ పద్మనాభయ్య సమన్వయం చేయగా, న్యాయకోవిదులు, వివిధ రంగాలకు చెందిన అనుభవజ్ఞులైన ఆలోచనాపరులు పాల్గొన్నారు.**

**జేపీ మాట్లాడుతూ,** భారత ప్రజాస్వామ్యం పరిణతిని సాధించటంలో గత 25-30 ఏళ్లలో న్యాయవ్యవస్థ పాత్ర కీలకమని అన్నారు. ఎన్నికలలో పోటీచేసే వాళ్లు నేరచరిత్రలు సహా అన్ని వివరాలు బైటపెట్టేలా లోక్‌సత్తా సాధించిన చట్టం సాకారం కావటం వెనక సుప్రీంకోర్టు చొరవ ఉందన్నారు. 2 జీ స్పెక్ట్రం అక్రమ కేటాయింపులను రద్దు చేసి ప్రకృతి వనరులను బహిరంగ వేలం ద్వారానే కేటాయించాలని లోక్‌సత్తా సాధించిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు సరైన రీతిలో స్పందించటం వల్లే ఈవేళ బొగ్గు, ఇతర గనుల కేటాయింపులో అవినీతి తగ్గి దేశ ఖజానాకు ఆదాయం లభిస్తోందన్నారు. రాజకీయ జోక్యం వల్ల వివాదాలు మరింత పెరిగే అవకాశమున్న అయోధ్యలో రామజన్మభూమి-బాబ్రీ మసీదు, రిజర్వేషన్లు, రాష్ట్రాల మధ్య వివాదాలు వంటివి సుప్రీంకోర్టు మాత్రమే పరిష్కరించగలదన్నారు. ఇంత ప్రాధాన్యత కలిగిన న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లేకుంటే చివరకు విశ్వసనీయత దెబ్బతిని దేశం తీవ్రంగా దెబ్బతింటుందన్నారు. తమను రాజ్యాంగం ఏర్పాటు చేయలేదని, తాము రాజ్యాంగం పరిధిలోకిరామని కొందరు న్యాయమూర్తులు వాదించే స్థాయికి ఇప్పుడు సంక్షోభం చేరుకుందన్నారు. లిఖిత పూర్వక రాజ్యాంగమున్న భారత్‌లో న్యాయవ్యవస్థ పాత్ర విస్తృతమైనది తప్ప రాజ్యాంగానికి అతీతమైనది కాదని స్పష్టంచేశారు. 'యుద్ధం మొత్తాన్ని సేనానులకే వదిలేయలేం, అలాగే న్యాయవ్యవస్థ మొత్తాన్నీ జడ్జీలకే వదిలేయలేం, ప్రజలకు న్యాయవ్యవస్థ కూడా తగిన పద్ధతిలో జవాబుదారీ కావాల్సిందే' అని జేపీ స్పష్టం చేశారు. ఇందుకోసమే లోక్‌సత్తా జడ్జీలను జడ్జీలే నియమించుకునే అప్రజాస్వామిక, నిరంకుశ కొలీజియం పద్ధతి స్థానంలో ప్రజాస్వామ్యయుత జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) బిల్లును రూపొందించి వివిధ పార్టీలను ఒప్పించి పార్లమెంటు ఆమోదాన్ని సాధించిందన్నారు.

దేశంలోనే సుప్రసిద్ధులైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ వి.ఆర్ కృష్ణ అయ్యర్‌లతో ఆ బిల్లును రూపొందించిందన్నారు. పార్లమెంటులో ఒక్క రాంజత్మలానీ తప్ప అన్ని పార్టీల ఎంపీలు ఏకగ్రీవంగా ఆ బిల్లును ఆమోదించారన్నారు. పలు రాష్ట్రాల అసెంబ్లీలు కూడా అతితక్కువ సమయంలో ఆ చట్టాన్ని ధృవీకరించటంతో 99వ రాజ్యాంగ సవరణగా ఎన్‌జేఏసీ ఏర్పడిందన్నారు. కానీ ఎటువంటి వాదనలకూ ఆస్కారం లేకుండా సుప్రీంకోర్టు 2015లో ఆ చట్టాన్ని కొట్టివేసి కొలీజియమే కొనసాగుతుందని ప్రకటించిందన్నారు. కొలీజియం తీర్పుని రాసిన జస్టిస్ జేఎస్ వర్మ కూడా ఎన్‌జేఏసీని రూపొందించినవారిలో ఉన్నారని, పలు న్యాయకమిషన్లు, పాలనా సంస్కరణ సంఘం, కె.టి థామస్ వంటి విశ్రాంత ప్రధాన న్యాయమూర్తులు ఎన్‌జేఏసీని సమర్థించినా సుప్రీంకోర్టు పట్టించుకోలేదన్నారు.

అయితే కొలీజియం పద్ధతిలో లోపాలున్నాయన్న విషయాన్ని మాత్రం సుప్రీంకోర్టు అంగీకరించి సరిదిద్దుకోవటానికి సూచనలివ్వాలని కోరిందన్నారు. ఎన్‌జేఏసీని కొట్టివేయటాన్ని విభేదించిన సీనియర్ జడ్జీ జస్టిస్ చలమేశ్వర్ కొలీజియంలో కూడా సభ్యునిగా ఉన్నారని, నిర్దేశించిన కొలీజియం ప్రమాణాలను కూడా పట్టించుకోకుండా లిఖితపూర్వక వాదనలు లేకుండా జడ్జీలను ఎంపికచేయటం, తిరస్కరించటం జరుగటం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ సమావేశాలను బహిష్కరించారని అన్నారు. ఈ నేపథ్యంలో ఇతరత్రా ఐజేఎస్, జడ్జీల సంఖ్యను పెంచటం, లోక్‌సత్తా కృషితోనే 2009లోనే వచ్చిన స్థానిక న్యాయస్థానాలు వంటి అంశాలు ఉన్నా.. ఈ రౌండ్‌టేబుల్‌లో కేవలం ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని సాధించటం మీదే దృష్టి కేంద్రీకరించామన్నారు.

ఇంకో పదేళ్ల తర్వాతైనా సుప్రీంకోర్టు తన తీర్పుని వెనక్కితీసుకుని ఎన్‌జేఏసీని పునరుద్ధరిస్తుందనటంలో తనకు ఎలాంటి సందేహం లేదని, రాజకీయ వివాదాలకు ఆస్కారం లేకుండా ఎన్‌జేఏసీని సాధించాలని మాత్రం మర్చిపోకూడదని జేపీ అన్నారు. ఈ నేపథ్యంలోనే కొలీజియంలో పారదర్శకతను పెంచుతూ ఎన్‌జేఏసీని రాజకీయాలకతీతంగా సాధించటం ఈ రౌండ్‌టేబుల్ ప్రతిపాదన అని తెలిపారు. మీడియాలాగే న్యాయవ్యవస్థకు కూడా నైతికతే కీలకమని, ఆ వ్యవస్థలను బలహీనపరచకుండా బలహీనతల్ని సరిదిద్దాలని అన్నారు. ఇరవైఏళ్ల కొలీజియం ఇంకొన్నాళ్లు కొనసాగినా వచ్చే పెద్ద నష్టమేమీ లేదని, దేశ సమగ్రతను, న్యాయవ్యవస్థను విశ్వసనీయతను కాపాడేలా న్యాయ సంస్కరణలు ఉండాలన్నారు. ప్రభుత్వానికి, శాసనవ్యవస్థకి, న్యాయవ్యవస్థకి మధ్య విభజన రేఖలు స్పష్టంగా ఉండాలన్నారు.

**పద్మనాభయ్య మాట్లాడుతూ,** ఎన్‌జేఏసీ కోసం 1990 నుంచి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని, అయితే 2015లో అది కార్యరూపం దాల్చిందని, సుప్రీంకోర్టు కొట్టివేయటం దురదృష్టకరమని అన్నారు. ఈ లోపాన్ని సరిచేయటం అవసరమన్నారు. చట్టసభలో, ప్రభుత్వమో, న్యాయవ్యవస్థో ఆధిక్యంలో ఉండాలని రాజ్యాంగ రచనా సంఘం ఛైర్మన్ డా॥ అంబేద్కర్ భావించలేదని, ముగ్గురూ కలిసి నిర్ణయం తీసుకోవాలనే ఆయన స్పష్టంచేశారని అన్నారు.

**తమిళనాడు మాజీ గవర్నర్‌గా హైకోర్టు జడ్జీల నియామక భాగోతాన్ని పీఎస్ రామ్మోహనరావు తన ప్రత్యక్ష అనుభవం నుంచి వివరిస్తూ,** కొలీజియంలో పేర్కొన్న న్యాయమూర్తుల పట్ల ముఖ్యమంత్రి లేవనెత్తిన అభ్యంతరాలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లెక్కచేయలేదు. చివరికి కొలీజియంలో పేర్కొన్న పేర్లు, ముఖ్యమంత్రి అభ్యంతరాలతో గవర్నర్ కార్యాలయం నుంచి కేంద్ర న్యాయశాఖకు జాబితాను పంపగా, కేంద్రంతో రాష్ట్రానికి సరైన సంబంధాలు లేని నేపథ్యంలో కొలీజియం పేర్లు యథాతథంగా ఆమోదం పొందాయి. 16-17మంది జడ్జీలను ఆ సమయంలో నియామకం చేయగా, అందులో సగం మందిపై ఆ తర్వాత పలురకాల ఆరోపణలు వచ్చాయి. ముఖ్యమంత్రులకు, ప్రధాన న్యాయమూర్తులకు మధ్య సంబంధాలు బాగుంటే, సీజేని సీఎం విందుకు ఆహ్వానిస్తారని, ఆ విందులో తనకు కావలసిన జడ్జీలను పేర్లను కొలీజియం కోసం ముఖ్యమంత్రి ఇస్తారని అన్నారు. చివరికి రాష్ట్రపతి పాత్రను కూడా తోసిపుచ్చే రీతిలో కొలీజియం వ్యవహరిస్తోందన్నారు. ఇవన్నీ చూశాకే, న్యాయ నియామకాలను సంస్కరించటం అత్యవసరం అని తాను ఆ సమయంలోనే గట్టిగా భావించానన్నారు. న్యాయనియామకాలలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం ఏర్పడిన ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు కొట్టివేయటం దురదృష్టకరమని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రభుత్వాల మధ్య 'అహేల యుద్ధం' జరుగుతోందన్నారు.

**అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు మాట్లాడుతూ,** గత 20-25 ఏళ్లుగానే న్యాయవ్యవస్థకు, ప్రభుత్వాలకు మధ్య వివాదాలు, ఎడం పెరిగిపోతున్నాయని, రెండు వ్యవస్థల్లో ప్రమాణాలు పడిపోతున్నాయని అన్నారు. పౌరసమాజంలో అత్యున్నతమైన వ్యక్తులున్నారని, న్యాయమూర్తుల ఎంపికలో వారి పాత్రనూ పరిగణలోకి తీసుకోవాలని తన అనుభవసారంగా చెప్పారు. జేపీ చెప్పినట్టు, ప్రజాప్రయోజనాలే అంతిమంగా రాజ్యాంగ లక్ష్యమన్నారు. అమెరికాలో అధ్యక్షుడే జడ్జీలను ఎంపిక చేస్తారని, సెనేట్ చర్చిస్తుందని, ప్రజలు కూడా అభిప్రాయాలను వ్యక్తం చేసేలా విస్తృత చర్చకు ఆస్కారమిచ్చేలా వివరాలను ప్రచురిస్తారని గుర్తుచేశారు. ఈ ప్రక్రియ వెనక ఉన్న స్ఫూర్తి అంతా ప్రజాప్రయోజనాలేనని భారతదేశం గుర్తించాలన్నారు. న్యాయసంస్కరణలపై లోతుగా ఆలోచించి సరైన నిర్ణయాలు తీసుకుని అమలుచేయకపోతే తీవ్ర సంక్షోభం తలెత్తుతుందని హెచ్చరించారు. సమయం మించిపోక ముందే మేలుకోవాలన్నారు. కొలీజియం స్థానంలో తానే పారదర్శక వ్యవస్థను తీసుకురావాల్సిన నైతికతను ప్రదర్శించాల్సిన సుప్రీంకోర్టు.. ఎన్‌జేఏసీని కొట్టివేయటం అనుచిత చర్య అన్నారు.

**రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ కాకి మాధవరావు తన అభిప్రాయాల్ని చెబుతూ,** న్యాయవ్యవస్థ జవాబుదారీ కావాల్సిందేనని అంబేద్కర్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ రాజీనామా చేయాలని నారిమన్ వంటి కొంతమంది మేధావులు చేస్తున్న వాదన అర్థరహితమని, చలమేశ్వర్ పక్కకు తప్పుకుంటే కొలీజియం ఒక రహస్య కార్యక్రమంలా యథావిధిగా కొనసాగుతుందని అన్నారు. ఈ రౌండ్‌టేబుల్ అభిప్రాయాలను మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జాతీయ స్థాయిలో కూడా రౌండ్‌టేబుల్ నిర్వహించి రాజ్యాంగ పరిరక్షకుడైన రాష్ట్రపతిని, ప్రధానిని కలవాలన్నారు.

పారదర్శకంగా న్యాయమూర్తుల నియామకాలు జరపటానికి ఎన్‌జేఏసీ వంటి ఏర్పాట్లకు సుప్రీంకోర్టే చొరవ చూపితే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉంటుందని **జస్టిస్ రెడ్డప్పరెడ్డి** అన్నారు.

**ఆంధ్రప్రదేశ్ మాజీ లా సెక్రటరీ కళానిధి సత్యనారాయణ మాట్లాడుతూ,** కొలీజియంలో చర్చల వివరాలు విధిగా లిఖితపూర్వకంగా ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. పారదర్శకత, జవాబుదారీతనం తమకు వర్తించవనటం ఆమోదయోగ్యం కాదన్నారు.

కొలీజియంలో మార్పులకే పరిమితం కాకుండా సాధ్యమైనంత త్వరగా ఎన్‌జేఏసీని అమలుచేసేలా ప్రయత్నాలు చేయాలని జాతీయ పోలీసు అకాడమీ మాజీ డైరెక్టర్ కమల్ కుమార్ అన్నారు.

రాజకీయాలతో సమానంగా న్యాయవ్యవస్థలో ప్రమాణాలు గత కొన్నేళ్లుగా పడిపోతున్నాయని, ఆయారాం గయారాంల సంస్కృతి రాజకీయాలలో జరుగుతుంటే, కోర్టులలో అప్రజాస్వామికత, అవినీతి ఆరోపణలు పెరిగిపోతున్నాయని **ప్రజ్ఞాభారతి ఛైర్మన్ డా॥ హనుమాన్ చౌదరి** అన్నారు.

ఉన్నత న్యాయస్థానాలలో జవాబుదారీతనం నెలకొనేలా చర్యలు తీసుకోకుండా రాజ్యాంగ పరిరక్షకుడైన రాష్ట్రపతి ఏం చేస్తున్నారని **కేంద్ర ఆరోగ్యశాఖ మాజీ కార్యదర్శి సుజాతారావు** ప్రశ్నించారు.

కొలీజియం వంటి తాత్కాలిక ఏర్పాటు నుంచి న్యాయవ్యవస్థ జవాబుదారీతనం, పారదర్శకత, స్వయంప్రతిపత్తి కోసం శాశ్వత ఏర్పాటు జరగాలని **సీనియర్ పాత్రికేయుడు తెలకపల్లి రవి** సూచించారు. న్యాయవ్యవస్థలో ప్రస్తుతం నెలకొన్న వివాదం క్షీణస్థాయికి అద్దం

పడుతోందన్నారు. అనేక న్యాయసంస్కరణలు రావాల్సి ఉందని, ఎన్‌జేఏసీతోపాటు వాటి పైనా దృష్టి పెట్టాలన్నారు. ఎన్‌జేఏసీ బిల్లులో లోపాల కారణంగా సుప్రీంకోర్టు కొట్టివేసిందన్న రవి అభిప్రాయం సరికాదని జేపీ ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. రాజ్యాంగ సవరణ ఎలా చేయాలో ఆర్టికల్ 368 చాలా స్పష్టంగా చెబుతోందని, ఎన్‌జేఏసీ కోసం బహుముఖంగా సుదీర్ఘ కసరత్తు జరిగిందని చెబుతూ పౌర సమాజం నుంచి ఇద్దరు నిష్ణాతుల్ని ఎన్నుకోవాలన్న కారణంగా సుప్రీంకోర్టు ఆ చట్టాన్ని కొట్టివేయటంలో అర్థం లేదని అన్నారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ పౌరసమాజం నుంచి వారిని ఎంపిక చేస్తుందని, వారి ముగ్గురి మీదా నమ్మకం లేదంటే ఇక ప్రజాస్వామ్యానికే అర్థముండదని అన్నారు.

**సాక్షి ఎడిటోరియల్ బోర్డు డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి మాట్లాడుతూ,** జవాబుదారీతనానికి న్యాయవ్యవస్థ అతీతం కాదని, ఎన్‌జేఏసీకే తన ఓటు అని ప్రకటించారు. పౌరసమాజంలోనూ గొప్ప వ్యక్తులున్నారన్నారు. న్యాయవ్యవస్థను ప్రక్షాళన చేయటం ఎంత అవసరమో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వెలువడుతున్న తీర్పులే తెలియచేస్తున్నాయని, పార్టీని బట్టి, వ్యక్తులను బట్టి తీర్పులు వస్తున్నాయని అన్నారు.

వేగంగా మారుతున్న ఆర్థిక, సామాజిక పరిస్థితులకనుగుణంగా తీర్పులిచ్చే అవగాహన న్యాయమూర్తులలో కొరవడుతోందని, బగ్గు కుంభకోణంలో తీర్పు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆ శాఖ కార్యదర్శిగా పనిచేసిన పి.సి పారఖ్ అన్నారు. న్యాయవ్యవస్థలో జవాబుదారీతనంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పెరగాలన్నారు.

**మాజీ ఐఏఎస్ అధికారి భలేరావు మాట్లాడుతూ,** మనం అభివృద్ధి గురించి తెగ ఆరాటపడుతున్నాంగానీ పాలన గురించి పట్టించుకోవటం లేదని, పాలనా సంస్కరణల్ని ఇకనైనా పట్టించుకోకపోతే ఒకదశ దాటి అభివృద్ధి సాధ్యం కాదని, ఉన్న అభివృద్ధి కూడా నిలబడదని హెచ్చరించారు.

కోర్టుల్లో సకాలంలో న్యాయం జరగకపోతే కోర్టులు తమవి కాదని సామాన్య ప్రజలు భావించే పరిస్థితి వస్తుందని స్థానిక **ప్రభుత్వాల సాధికారత సమితి నేత, మాజీ ఎంపీ సోలిపేట రాంచంద్రారెడ్డి** అన్నారు.

న్యాయవ్యవస్థలో సంస్కరణలు సామాన్య ప్రజలకు ఎంత ముఖ్యమైనవో అర్థమయ్యాక తనలాంటి ఆర్థికవేత్తలు కూడా వీటి కోసం ప్రయత్నంలో భాగస్వాములయ్యేలా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగిందని **ఆస్కీ డైరెక్టర్ జనరల్ (ఐ అండ్ సీ) డా॥ పరిణీతి దాస్ గుప్తా** అన్నారు.

**అధికార వికేంద్రీకరణ లేకే ప్రజలకు తెలియటంలా**

సమావేశంలో మాట్లాడిన రైతు నేత (కన్సార్షియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్) చెంగల్‌రెడ్డి, తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆవుల మంజులత ప్రస్తావించిన అంశాలు అధికార వికేంద్రీకరణ ఎంత అవసరమో పరోక్షంగా తెలియచెప్పాయి. న్యాయవ్యవస్థలోని లోపాలు తమకు ఈ రౌండ్‌టేబుల్‌లో అర్థమయ్యాయని, అయితే ఒక అంశంపై తప్పు జరుగుతుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలో తమకు తెలియదని వారు చెప్పారు. తమలాంటి ప్రజలు కోట్ల మంది ఉన్నారన్నారు. ఇలాంటివి సరిచేస్తే చట్టసభలు, ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ గురించి ప్రజలు మెరుగ్గా స్పందించగలుగుతారన్నారు. కేంద్రీకృత పాలన వల్లే ప్రజలకు ఓటుహక్కు, పాలన గురించి అర్థం కావటం లేదని, ఎక్కడో జరిగే తప్పులకు తాము ఏమీ చేయలేమనే నిర్లిప్తతతో అయినకాడికి తాత్కాలిక లబ్ధి పొందేదుకు సాంప్రదాయ రాజకీయ పార్టీల చేతిలో పావులుగా మారుతున్నారని లోక్‌సత్తా తొలినుంచీ వాదిస్తున్న సంగతి తెలిసిందే. స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేసి తలసరి రూ.1000-2000 కేటాయిస్తే పౌరసత్వం, నాయకత్వం పెరిగి ప్రజాస్వామ్యం పరిణతి చెందుతుందన్నది లోక్‌సత్తా పరిష్కారం. న్యాయవ్యవస్థ ప్రజాస్వామికీకరణకు అధికార కేంద్రీకరణ ఎలా అవరోధంగా ఉందో ఈ రౌండ్‌టేబుల్ వెల్లడించటం ఆసక్తికరంగా మారింది.

సమావేశంలో కోవా డైరెక్టర్ మజర్ హుస్సేన్, ప్రేమ్‌చంద్, ఉషా రామచంద్రన్, శివరావు, ప్రొఫెసర్ భాస్కరరావు తదితరులు పాల్గన్నారు.

జస్టిస్ చలమేశ్వర్ వాదనకు రౌండ్‌టేబుల్ పూర్తి మద్దతును తెలుపుతోందని, అలాగే న్యాయమూర్తుల నియామకంలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాల్సిందేనని, తాత్కాలికగా కొలీజియంలో మార్పులతోపాటు ఎన్‌జేఏసీని కూడా ఏదోకరూపంలో శాశ్వత వ్యవస్థగా ఏర్పాటు చేయాలన్న రౌండ్‌టేబుల్ నిర్ణయాల్ని జాతీయ స్థాయిలోకి కూడా తీసుకెళ్లి అందరి సంతకాలనూ సేకరిస్తామని, సోషల్ మీడియా, ఇతరత్రా మార్గాల ద్వారా ప్రజాభిప్రాయన్ని కూడా కూడగట్టి రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాయటంతోపాటు నేరుగా కలిసి వివరించే ప్రయత్నం చేస్తామని పద్మనాభయ్య, జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

# స్వయంపాలన పాలిట విలన్లు.. జన్మభూమి కమిటీలు




ఆంధ్రప్రదేశ్‌లో జన్మభూమి కమిటీలు రాజ్యాంగ విరుద్ధంగా, ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేస్తున్నాయి. పలు గ్రామాల్లో, పురపాలక బస్తీల్లో కమిటీ సభ్యుల ఆగడాలు మితిమీరాయి.

రాష్ట్రం నుంచి గ్రామపంచాయతీలకు నిధుల్ని ఇవ్వకపోగా, కేంద్రం నుంచి నేరుగా పంచాయతీలకు వస్తున్న నిధులకు కూడా జన్మభూమి కమిటీలతో రాష్ట్ర ప్రభుత్వం గండికొడుతోంది. స్థానికంగా వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు, అభివృద్ధి కోసమే ఈ కమిటీలను రాజకీయాలకతీతంగా ఏర్పాటుచేసినట్టు ముఖ్యమంత్రి చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో జరుగుతున్నది విరుద్ధంగా ఉంది. కమిటీల్లో ఉండేవారంతా అధికార తెదేపా వారే. వారు జనం సొమ్మును దండుకోవటానికి వీలుగానే కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి, స్థానిక ప్రభుత్వాలను మరింత కుంగదీస్తోంది.

జన్మభూమి కమిటీలు రాజ్యాంగేతరమైనవని, రాష్ట్రం స్థానిక ప్రభుత్వాలపై జన్మభూమి కమిటీలు వేసినట్టే కేంద్రం రాష్ట్రాలపై స్వచ్ఛభారత్ కమిటీల్ని వేస్తే ఊరుకుంటారా? అని సురాజ్య యాత్రలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పలు సమావేశాల్లో ప్రశ్నించారు. స్వయంపాలనపై ప్రజలను చైతన్యపరిచే ప్రయత్నం చేశారు. కేంద్రప్రభుత్వం నుంచి పన్నుల డబ్బులో మూడు రూపాయలకు రెండు రూపాయలు రాష్ట్రానికి వస్తున్నాయని, బడ్జెట్‌లో 50.1శాతం వస్తున్నాయని, అయినా గ్రామాలకు వెయ్యికి ఒక్క రూపాయి మాత్రమే కేటాయిస్తున్నారని జేపీ వెల్లడించారు. గ్రామ పంచాయతీలకు ఏడాదికి తలసరి రూ. 8, మండల పరిషత్‌లకు రూ. 16, జిల్లా పరిషత్‌లకు తలసరి రూ. 8 ఇస్తున్నారు. పట్టణ స్థానిక ప్రభుత్వాలకు ఇంకా తక్కువగా తలసరి రూ. 12 మాత్రమే ఇస్తున్నారని ప్రజలకు తెలియచేశారు. సురాజ్య పరిష్కారాలను వివరించే సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైనప్పుడు కూడా ఈ విషయాల్ని నిర్మొహమాటంగానే జేపీ స్పష్టంచేశారు. ప్రజలు నివసించే గ్రామాలు, పట్టణాలకు పన్నుల్లో వాటాగా ఇచ్చే నిధుల్ని పెంచితేనే పాలన బాగుపడుతుందని పరిష్కారంగా వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండా జన్మభూమి కమిటీలు చేసిన లబ్ధిదారుల ఎంపిక ఎంత అరాచకంగా, అక్రమాలమయంగా ఉందో, ఎంతమంది అర్హులకు జాబితాలో అవకాశం దక్కలేదో ఇటీవలి 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో అనేక ఊళ్లలో బైటపడింది. రేషన్ కార్డు, ఇళ్లస్థలాల కేటాయింపు, ఇతర పథకాల ఎంపిక విషయంలో భారీసంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రతినిధులే చెబుతున్నారు.

జన్మభూమి కమిటీల అరాచకాలపై పలు వార్తాకథనాలు వెలువడ్డాయి. కమిటీల్ని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి కూడా హెచ్చరించారు. పాతవారిని తొలగించి కొత్తవారితో కొన్ని కమిటీలను మళ్లీ ఏర్పాటుచేశారు. సాధ్యమైనంత వార్తల్లోకి రానీయకుండా వీటి ప్రాధాన్యతను తగ్గించి చూపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ కమిటీలను అధికారికంగా పూర్తిగా రద్దు చేసినా ఎమ్మెల్యేలు అనధికారికంగా ఇలాంటి ముఠాలతో స్థానిక ప్రభుత్వాల అధికారాలను కబ్జా చేస్తారనేది వాస్తవం. వ్యవస్థలోని లసుగుని సరిచేసి స్థానిక ప్రభుత్వాలకు పన్నుల్లో తగిన వాటా, స్పష్టమైన అధికారాలు ఇచ్చే ప్రయత్నం చేయకుండా.. పైనుంచి ముఖ్యమంత్రి హూంకరింపులు, పడికట్టు మంచిమాటల ఉపన్యాసాలు ఎన్ని చేసినా ప్రయోజనం శూన్యం. జన్మభూమి కమిటీలు అనే లేబుల్‌తో పంచాయతీలు, పురపాలక వార్డుల్లో నడుస్తున్న ఎమ్మెల్యే రాజ్ అరాచకాలను పరిశీలిస్తే.. కేంద్రీకృత పాలన, జవాబుదారీతనంలేని ప్రభుత్వ

## ఏమిటీ కమిటీలు?

2014లో జన్మభూమి-మావూరు కార్యక్రమం ప్రారంభిస్తున్న తరుణంలో ఏపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల ఏర్పాటు నిర్ణయం తీసుకుంది. గ్రామ, మండల, పురపాలక సంఘాల్లో వార్డు స్థాయి కమిటీల్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో ఆరు లేదా ఏడుగురు సభ్యులుంటారు. వారిలో ఇద్దరు స్వయంసహాయక సంఘాలకు చెందినవారు. మరో ఇద్దరు ముగ్గురు ఆ ప్రాంతంలోని సామాజిక కార్యకర్తలు. పేరుకు అలా ఉన్నా వారంతా అధికార పార్టీకి చెందినవారే అవుతున్నారు. కమిటీలకు అధ్యక్షులుగా ఉన్న సర్పంచి, మునిసిపల్ ఛైర్మన్, కార్పొరేటర్, కౌన్సిలర్, గ్రామసభలు నిర్వహించే అధికారులు కూడా ఈ కమిటీల ముందు చాలా సందర్భాల్లో ప్రేక్షకుల్లా వ్యవహరిస్తున్నారు. నిజానికి చట్టపరంగా కమిటీలకు ప్రత్యేకమైన నిధులు, విధులు లేవు. ప్రణాళిక విభాగం ఉత్తర్వుల ప్రకారం వారంతా జన్మభూమి సందర్భంగా గ్రామసభ నిర్వహణకు సహకారం అందించాలి. సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు, స్వయంఉపాధి, రుణాలు, ప్రభుత్వ గృహాలు తదితర ప్రభుత్వ పథకాలకు సంబంధించి కమిటీలు ఫలానావారు అర్హులని సూచించాలి. అధికారులు అందులో వాస్తవికతను తనిఖీ చేసి ఎంపిక చేయాలి.

కార్యాలయాలు ప్రజాజీవనాన్ని ఎంత దుర్భరంగా మారుస్తున్నాయో అర్థమవుతుంది.

జన్మభూమి కమిటీలు రాష్ట్రంలోని చాలాచోట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా, కొన్నిచోట్ల మరీ బరితెగించి వ్యవహరిస్తున్నాయని మీడియా రిపోర్టులే వెల్లడిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు కమిటీల ముందు ఉత్సవ విగ్రహాల్లా మారుతున్నారు. సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు అయితే తమ ప్రాంతాల్లో జన్మభూమి కమిటీ సభ్యులను కాదని ఏమీ చేయలేని పరిస్థితి. ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో పూర్తి ఆధిపత్యం వారిదే. కమిటీ సభ్యులకు నచ్చినవారే అర్హులు. వాళ్లకు నచ్చకుంటే ఎలాంటి అర్హతలున్నా అనర్హులే. వెరసి లబ్ధిదారుల ఎంపిక ఒక ప్రహసనంగా మారుతోంది. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో జన్మభూమి కమిటీల అక్రమాలు, ఆధిపత్య ధోరణులు సామాన్యులను విసుగెత్తిస్తున్నాయి.

### గ్రామంలో సమాంతర పాలన

అధికార పార్టీ ఎమ్మెల్యే అనుచరులే చాలాచోట్ల ఈ కమిటీల్లో సభ్యులుగా ఉంటున్నారు. చట్టసభలకు పరిమితం కావాల్సిన ఎమ్మెల్యే ఓట్లు దండుకునేందుకు, కాసులు దండుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటానికి (వాస్తవానికి ఇవి ప్రజలకు హక్కుగా జరగాల్సిన పనులు), స్థానిక ప్రభుత్వాల అధికారాల్లో జోక్యం చేసుకోవటానికి జన్మభూమి కమిటీలు 'రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉన్న మార్గం'గా మారాయి. అధికార పార్టీ ఎమ్మెల్యే లేని చోట నియోజకవర్గ ఇంఛార్జి చెప్పిన వారిని కమిటీల్లో నియమించారు.

అధికార పార్టీ, విపక్షం అని తేడా లేదు.. ఎమ్మెల్యే కంటే దిగువ స్థాయిలో ఎవరైనా కమిటీ సభ్యులను కాకా పడితేనే పనులు జరిగేది. లేకుంటే చిన్నపని కూడా చేయించుకోలేకపోతున్నారు. చాలా ఊళ్లలో సర్పంచి అధికార పార్టీకే చెందినా కమిటీ సభ్యులను ఏమీ చేయలేని పరిస్థితి. ఎన్నికల రాజకీయ సమీకరణాల్లో భాగంగా సర్పంచికి వ్యతిరేకులను కమిటీల్లో పెట్టటం వల్ల గొడవలు ముదురుతున్నాయి. సర్పంచి ఏదైనా అవునంటే, ఈ కమిటీ కాదంటూ పక్కన పెట్టేస్తుంది. ఇంకొన్ని చోట్ల తమ వైరి వర్గాన్ని దెబ్బకొట్టడానికి ఆ ప్రాంతంలో విపక్షాలతో కమిటీ సభ్యులు కుమ్మక్కయి వారికి అనుకూలంగా చేస్తున్నారు. ఇలా మొత్తంగా స్థానిక స్వయంపాలన నీరుగారిపోతోంది. కమిటీల కారణంగా పలువురు సర్పంచిలు ఐదవ విడత జన్మభూమిలో కూడా పాల్గనలేదని అధికారులే చెబుతున్నారు. జన్మభూమిలో పాల్గొనని సర్పంచిల్లో ఎక్కువమంది మహిళలు, ఎస్సీ కులాలకు చెందినవారే ఉన్నారన్నది మరో కోణం. లోక్‌సత్తా సర్పంచి ఉన్న కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామంలో జన్మభూమి కమిటీ సభ్యుల ఆగడాలపై ఇటీవల సురాజ్య యాత్ర సందర్భంగా పలువురు గ్రామస్తులు జేపీకి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిఘా కూడా ఉండటం వల్లో ఏమో కొన్నిచోట్ల ఎమ్మెల్యేలకు కూడా ఈ కమిటీల సభ్యులు తలనొప్పులు సృష్టిస్తున్నారు. శాసనసభ్యులు కూడా ముఖ్యమంత్రిని కలిసి మొత్తుకుంటున్నారు.

### దందాలు కోకొల్లలు

జన్మభూమి కమిటీ సభ్యులకు డబ్బులు కావాలంటే ఒక చెక్‌డ్యాం నిర్మించేస్తారు. అవసరం లేకపోయినా పట్టించుకోరు. అప్పటికే ఉన్న చెక్‌డ్యాంను కూల్చేయడం, దానికి ముందో, వెనకో మరొకటి కట్టేయడం చేస్తున్నారు. కడప జిల్లా జమ్మలమడుగు, ముద్దనూరు, ఎర్రగుంట్ల తదితర మండలాల్లో ఇలాంటివి ఎన్నో కనిపిస్తాయి. గండికోటకు వెళ్లే దారిలో

**జన్మభూమి కమిటీల సంఖ్య**

| | | |
|---|---|---|
| గ్రామ కమిటీలు | – | 12,918 |
| మండల కమిటీలు | – | 670 |
| పురపాలక సంఘ కమిటీలు | – | 110 |
| పురపాలక వార్డు కమిటీలు | – | 3400 |

కాలువలపైనా ఇలాంటి చెక్‌డ్యాంలు కనిపిస్తుంటాయి. మరికొన్ని జిల్లాల్లోనూ ఈ దోపిడీ దృశ్యాల్ని చూడవచ్చు.

**ఒక్కో పథకానికి ఒక్కో రేటు**

అనంతపురం జిల్లాలో ఒక్కో పథకానికి లబ్ధిదారుగా ఎంపిక కావాలంటే ఒక్కో రేటు నిర్ణయించి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు. కాపు కార్పొరేషన్ తదితర ప్రభుత్వ కార్పొరేషన్ల నుంచి రుణం పొందాలంటే రూ. 25వేల నుంచి రూ. 37 వేలు చెల్లించుకోవాలి. తమకు పింఛను ఇవ్వాలంటే రూ. 3,000 డిమాండ్ చేశారంటే ఆమధ్య గుంతకల్ నియోజకవర్గంలో మహిళలు పేర్లతో సహా జన్మభూమి కమిటీ సభ్యులపై ఫిర్యాదు చేశారు. ఉరవకొండ ప్రాంతంలో బీసీ కార్పొరేషన్ రుణం పొందడానికి రూ. 10వేలు, పింఛను పొందడానికి రూ. 5వేలు కమిటీ సభ్యులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

**మనోడైతేనే**

గుంటూరు, చుట్టుపక్కల జిల్లాల్లోని పలు గ్రామాల్లో జన్మభూమి కమిటీ సభ్యుడికి కావలసిన వారైతేనే లబ్ధిదారుడిగా ఎంపికవుతారు. కంకటపాలెంలో 2014లో పొరపాటున పింఛను అవకాశాన్ని కోల్పోయిన ఒక అర్హుడికి తర్వాత కూడా పింఛను రాకుండా కమిటీ సభ్యులు చేశారు. ఎందుకంటే అతనంటే అక్కడి కమిటీ సభ్యుల్లో ఒకరికి గిట్టదు. నరసరావుపేట తదితర ప్రాంతాల్లో మరుగుదొడ్డి మంజూరు కావాలంటే రూ. 1500, ఎన్టీఆర్ గృహపథకం ఎంపిక కావాలంటే రూ. 20వేలు సమర్పించుకోవాల్సి వస్తోంది. ఇక్కడ చాలా ప్రాంతాల్లో జన్మభూమి కమిటీ సభ్యులు, ఎంపీడీవోలు కుమ్మక్కయి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**జాబితాల ఆధిపత్యం**

కొన్నిచోట్ల సర్పంచి, జన్మభూమి కమిటీ సభ్యుల మధ్య జాబితాల ఆధిపత్యం కొనసాగుతోంది. శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, చిత్తూరు, కర్నూలు, కృష్ణా తదితర జిల్లాల్లో రాజకీయ ఘర్షణలతో డబుల్ జాబితాలు వెలువడుతున్నాయి.

# చట్టబద్ధపాలన కరవైంది





మహిళలపై వేధింపులు, దాడులు పెరిగిపోతున్నాయని, రాష్ట్రంలో చట్టబద్ధపాలన కరవైందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం దళితవాడలో చుక్క ఎర్రమ్మపై అత్యాచార యత్నాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దుండగులు కత్తితో దాడి చేస్తున్నా లెక్కచేయకుండా మూగదైన తన కూతురును చుక్క సన్యాసి సాహసోపేతంగా కాపాడుకున్నారన్నారు. కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సన్యాసిని బాబ్జీ పరామర్శించారు. దోషులను కఠినంగా శిక్షించటంతోపాటు సన్యాసి కుటుంబానికి అండగా నిలవాల్సుందని, దీనిపై జిల్లా యంత్రాంగానికి లేఖ రాస్తామని తెలిపారు. డెంకాడ మండలంలోని మోదవలస గ్రామంలో జన్మభూమి కార్యక్రమం సందర్భంగా ఇరువర్గాలు కొట్లాటకు దిగిన ఘటనలో గాయపడ్డవారిని కూడా ఆయన పరామర్శించారు. సంయమనం పాటించాలని బాధితులను కోరారు. పతివాడ చంద్రరావు, ఎర్నిబాబు, తాత్రాజు రాజారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలను నిత్యనూతనంగా పెంపొందించుకుంటూండాలి, ప్రతి జిల్లాలో ఆధునీకరణలో యువత భాగస్వాములు కావాలి

గ్రంథాలయాలు నాగరికత, అభివృద్ధికి చిహ్నమని, వాటిని నిత్యనూతనంగా పెంపొందించు కుంటూండాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీని ఆయన ఇటీవల సందర్శించారు. గ్రంథాలయ ప్రతినిధులు, అధికారులను అడిగి బడ్జెట్, పుస్తకాలకు చేస్తున్న వ్యయం తదితర వివరాలను తెలుసుకున్నారు. పాఠకులనడిగి సౌకర్యాలు, అవసరాలను తెలుసుకున్నారు. ఏడాదిలో కేవలం రెండు లక్షల రూపాయలే పుస్తకాలకు వెచ్చిస్తుండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను వ్యక్తిగతంగా ఏటా రెండు లక్షల విలువైన పుస్తకాలను కొంటుంటానన్నారు. అమెరికా, చైనా వంటి దేశాల సమాజాల్లో గ్రంథాలయాలకున్న ప్రాధాన్యతను చూస్తే మనం ఎంత నిర్లక్ష్యంగా ఉన్నామో అర్థమవుతుందన్నారు. పుస్తకాల్ని చదవటం అక్కడ జీవనశైలిలో ముఖ్యభాగంగా భావిస్తారన్నారు. ప్రభుత్వాలు మన నుంచి వసూలు చేస్తున్న ఆస్తిపన్నులో గ్రంథాలయాల కోసం సెస్సుకూడా ఉంటుందని, అలా హైదరాబాద్ జిల్లాలోనే రూ. 300-400కోట్ల వరకూ లైబ్రరీల డబ్బు మునిసిపాలిటీ వద్ద మూలుగుతోందని అన్నారు. ఈ వివరాల్ని బైటపెట్టి హైకోర్టు ద్వారా కొంతడబ్బయినా తక్షణం విడుదల చేయించిన న్యాయవాది, యూత్ ఫర్ బెటర్ ఇండియా ప్రతినిధి షీలూ రాజ్‌ను ఈ సందర్భంగా జేపీ అభినందించారు. లైబ్రరీలను ఆధునీకరించే కృషిలో సలహాలు తోడ్పాటునిస్తూ వైబీఐ ప్రతినిధులతో కలిసి పనిచేయాలని అక్కడ చదువుకుంటున్న యువతకు జేపీ సూచించారు.




షీలూ రాజ్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ద్వారా రాబట్టిన వివరాల ప్రకారం 2014నాటికి.. హైదరాబాద్ జిల్లాలో రూ. 300 కోట్లు, రంగారెడ్డి జిల్లాలో 40 కోట్లు, ఆదిలాబాద్ జిల్లాలో 4 కోట్లు, కరీంనగర్ జిల్లాలో 4.87కోట్లు, నల్గండ జిల్లాలో 8.56 కోట్లు, నిజామాబాద్ జిల్లాలో 7.39 కోట్లు, వరంగల్ జిల్లాలో 5.75 కోట్లు, మెదక్ జిల్లాలో 3.78 కోట్లు, మహబూబ్‌నగర్ జిల్లాలో 0.40 కోట్లు, ఖమ్మం జిల్లాలో 4.09 కోట్లు లైబ్రరీ సెస్‌ని మునిసిపాలిటీలు జిల్లా గ్రంథాలయ సంస్థలకు బాకీ పడ్డాయన్నారు. దీనిపై లోక్‌సత్తా దాఖలు చేసిన పిటిషన్‌కి స్పందించిన హైకోర్టు.. లైబ్రరీ సెస్‌ని లైబ్రరీలకు వినియోగించాలని స్పష్టం చేసిందన్నారు. ఫలితంగా హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీకి ఇప్పటివరకూ రూ. 6కోట్ల నిధులు విడుదలయ్యాయని, మరో రూ. 5కోట్లు ఇస్తామని మునిసిపల్ మంత్రి ప్రకటించారని తెలిపారు. త్వరలో తుది తీర్పు వెలువడుతుందన్నారు. ప్రతి జిల్లాలో గ్రంథాలయాల పరిరక్షణకు, ఆధునీకరణకు విద్యార్థులు, యువత బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు.. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.యూత్‌ఫర్‌బెటర్‌ఇండియా.డాట్‌కామ్ ద్వారా లేదా 95504 64607 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించవచ్చన్నారు.

# 'ఆధునిక విద్యా, సేవా సంస్థలు' అమెరికా గ్రంథాయాలు

**- ఎ. అన్నపూర్ణ**




ప్రపంచంలో ఇప్పటికీ అగ్రగామిగా చెలామణి అవుతున్న దేశం అమెరికా. అనేక దేశాల ప్రజలు అమెరికాలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. భిన్న సంస్కృతులు, అనేక భాషలు, మతాల మేలు కలయిక యూఎస్. అందుకే నిరంతరం అనేక దేశాల నుంచి రాకపోకలూ జరుగుతూనే ఉంటాయి. విద్య వ్యాపార ఉద్యోగాల కారణంగానే కాకుండా, సందర్శనాభిలాషలతో జనాభా పెద్దసంఖ్యలో కనిపిస్తుంటుంది. అమెరికాలో జనాభాకు తగినట్టే ప్రజా గ్రంథాలయాలు రూపుదిద్దుకోవటం, పెరగటం ఒక విశేషంగా చెప్పుకోవాలి. గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు, మానవ మేధస్సుకు పదును పెట్టే సాధనాలు. తరతరాలకూ తరగని శాశ్వత సంపద! పర్యాటకులు ఈ సంపదను సందర్శించి తీరాలి. కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాండియాగో నగరంలో డవున్ టవున్ ప్రాంతంలో ఉన్న సెంట్రల్ లైబ్రరీ 9 అంతస్తుల పెద్దభవనం. ఆధునీకరించిన ఈ పుస్తకాలయంలోకి అడుగుపెట్టినవారికి ఉత్తేజకరమైన అనుభూతి కలుగుతుంది. పుస్తక పఠనాభిలాష గలవారికి పంచభక్ష్యాల విందులాగా ఉంటుంది. నిద్రాహారాల పట్టింపు ఉండదు. కాలం తెలియదు. విశాలమైన ఈ భవనంలో అనేక విభాగాలున్నాయి. పుస్తకాలు, కంప్యూటర్లు, ఆడియో, వీడియోలు, ఈ-బుక్స్ మొదలైన 360 రకాలుగా ఉపయోగించుకోగలిగిన ఉపకరణాలతో ఆధునిక విద్యాసంస్థలా ఉంటుందిది. ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం మొట్టమొదట ఈ దేశం నుంచే ప్రారంభమైందని అంటారు.

యువత, పిల్లల విభాగాలే కాకుండా, బధిర, మూగ, ఇతర దివ్యాంగులకు, వృద్ధులకు, మాజీ సైనికోద్యోగులకు ప్రత్యేకంగా ఉపయోగపడే డేటాబేస్ కంప్యూటర్లు ఉన్నాయి. వయోజన విద్య, ఆన్‌లైన్ హైస్కూల్, దివ్యాంగులకు సేవ చేయగల కార్యకర్తలకు తర్ఫీదు, ఉద్యోగ నైపుణ్యాలకు శిక్షణ, అనేక భాషలు నేర్చుకోగల అవకాశం, వృత్తిపన్ను వివరాలను వారి వారి భాషలలో వివరించే శిక్షణా తరగతులు, చర్చలు, సమావేశాలు.. ఇలా గ్రంథాలయాలు విశేషంగా బహుముఖ కృషి చేస్తున్నాయి. బుద్ధిమాంద్యం గలవారికి సహాయసహకారాలను అందించడం కోసం అమెరికా పౌరహక్కుల చట్టంలో వీలుకల్పించారు. వారి కోసం ఉపయోగపడే శిక్షణా తరగతుల్ని ఇక్కడ నడుపుతారు. దృష్టి లోపం గలవారి కోసం బ్రెయిలీ కంప్యూటర్లు ఉన్నాయి. దివ్యాంగులు, వృద్ధులు విశాలమైన తెరలు గల గదిలో చలనచిత్రాల్ని, వారికి నచ్చిన వీడియోల్ని చూడటానికి ఏర్పాట్లు ఉన్నాయి. బుద్ధిమాంద్యం గలవారికి చిత్రకళ ద్వారా వివరిస్తారు. దివ్యాంగులకు ఉపయోగపడేలా శునకాలకు శిక్షణ ఇస్తారు. ఈ శునకాలు ఎలా సహాయపడతాయో ప్రత్యక్షంగా చూశాను. ఒక మహిళతో పాటు వచ్చిన శునకం సిటీబస్‌లో ఎక్కింది. వీల్‌ఛెయిర్‌ను బస్‌లోకి ఎక్కించి సీటు దగ్గర ఏర్పాటు చేసిన స్థలంలో డ్రైవర్ అమర్చినప్పుడు శునకం తన యజమాని దగ్గరే కూర్చుంది. ఆ మహిళ దిగాల్సిన బస్‌స్టాప్‌కి ముందు స్టాప్‌లో శునకం లేచి నిలబడింది. బస్ ఆగిన తర్వాత డ్రైవర్ వీల్‌ఛెయిర్‌ను కిందకు దించారు. ఇదంతా అయ్యాకే శునకం బస్ దిగింది. ఆ తర్వాత యజమానితోపాటు ఇంటికి వెళ్లింది. వయోవృద్ధులైన యజమానికి మనిషి కంటే మిన్నగా సేవలు అందించే ఈ శునకాలను చూసినప్పుడు అద్భుతంగా తోచింది. తోటి మనిషి కూడా అంతటి విశ్వాసం చూపించదేమో! ప్రతివారినీ ముగ్ధుల్ని చేసేలా ఆ పెంపుడు జంతువు సేవలందించింది. ఇంటి దగ్గర చిన్నచిన్న పనుల్లో కూడా ఇవి సహాయపడతాయట. వీటి సేవలు కళ్లతో చూడాలి తప్ప మాటలతో చెప్పలేనివి.

పిల్లల విభాగంలో ఈ-బుక్స్, డిజిటల్, ఆడియో బుక్స్,

## ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన వ్యక్తి బెంజమిన్ ఫ్రాంక్లిన్

ప్రజా గ్రంథాలయాల స్థాపన ద్వారా మంచిపనులు చేయవచ్చునని పెద్దఎత్తున నిరూపించింది బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనే బహుముఖ ప్రజ్ఞాశాలి. ఫిలడెల్ఫియాలో 1731 సంవత్సరంలో పబ్లిక్ లైబ్రరీని స్థాపించారు. 1751లో కళాశాల ప్రారంభించారు. ఆ కళాశాల 1791లో పెన్సిల్వేనియా యూనివర్సిటీగా రూపుదిద్దుకుంది. 1737లో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను మొట్టమొదటిసారిగా పోస్ట్‌మాస్టర్‌గా నియమించింది. 1753లో జాయింట్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా అమెరికన్ కాలనీలకు చెందిన ఉన్నత పదవికి ప్రమోట్ చేసింది. ఫ్రాంక్లిన్ చరిత్రను చదివితే అనేకమైన వివరాలను తెలుసుకోవచ్చు. అమెరికాలో ప్రజా గ్రంథాలయాల ఔన్నత్యానికి ఆద్యుడైన బెంజిమన్ ఫ్రాంక్లిన్ చరిత్రలో ఎప్పటికీ గుర్తుంచుకోవాల్సిన వ్యక్తి. మనిషిగా జన్మించాక ఏదో ఒక మంచి పని చేయాలి. సంతృప్తినివ్వటంతోపాటు చిరస్థాయిగా ఉండే మంచి చేయడం సర్వులకూ ఆదర్శనీయం, చాలా సందర్భాలలో ఆచరణీయం కూడా. ఆశయాలు, ఆలోచన, మానవసేవ కలగలిసిన మానవీయ గ్రంథాలయాల ఏర్పాటు ఎంత మంచి సంకల్పమో గదా!

ఆర్కైవ్స్, ఆకర్షణీయమైన ఆటసామాగ్రి, వింతలు విశేషాలతో ఆకట్టుకునే జంతువులు, పక్షుల ప్రపంచాన్ని చూసి పిల్లలే కాదు పెద్దవాళ్లం కూడా మైమరచిపోతామంటే అతిశయోక్తి కాదు. అంతగా అందరినీ అలరించేలా వాటిని తీర్చిదిద్దారు.

యుద్ధరంగంలో గాయపడిన వారికి, పదవీ విరమణ చేసినవారికి సహాయపడే కార్యకర్తలకు ఇక్కడ శిక్షణ ఇచ్చి కోరినంత కాలమూ వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. వారంలో మూడురోజులు కార్యకర్తలు ఉచితంగానే సేవలందిస్తారు. నియమబద్ధంగానూ సేవాభావంతోనూ పనిచేస్తారు. మంచి ఆహారాన్ని సమకూర్చడం, వినోదానికి విహారాలకూ తీసుకెళ్లి వారికి మానసికోల్లాసం కలిగించడం, సమయానికి మందులు వేయడం, వైద్యుల పర్యవేక్షణ, వ్యాయామాలు చేయించటం వంటివి వీరి సేవల్లో భాగంగా ఉంటాయి.

ఈ కాలంలో దేశ, కుటుంబ పరిస్థితుల కారణంగా వృద్ధులు ఒంటరిగా జీవించటం పరిపాటి అయింది. వారిని అలా వదిలేస్తే కుంగుబాటుకు గురయ్యే అవకాశముంది. నిరాశానిస్పృహలు ఆవరిస్తుంటాయి. శారీరక అనారోగ్యం కొందరికి శాపంగా పరిణమిస్తే, అల్జీమర్స్ అనే మతిమరుపుతో కూడిన చాంచల్యం కొందరిని వేధిస్తుంది. అటువంటి వారిని కుంగుబాటు, ఒంటరితనం ఆలోచనల బారి నుంచి కాపాడటం అవసరమని వైద్యులు సూచిస్తుంటారు. వారికి ఏదైనా వ్యాపకం కల్పించాలనే అంటారు. వారానికి ఒకరోజు లేదా మూడురోజులు వారివారి వయసు ఆరోగ్యరీత్యా వ్యాపకం కల్పించాలి. బైట ప్రాంతాలకు విహారం వెళ్లటం ద్వారా పదిమందితో కాలం గడపటం, మంచిచెడ్డలు మాట్లాడుకోవటంతోపాటు.. మతిమరుపు రాకుండా ఇష్టమైన భాష లేదా అంశం మీద క్లాసులు తీసుకోవచ్చు. ఈరోజు ఈ కార్యక్రమం ఉంది కనుక.. ఇష్టమైన దుస్తులు ధరించటం, నచ్చిన సాహిత్యం మీద చర్చించటం వంటివి చేయవచ్చు. ఆరోజు కోసం ఎదురుచూడటంలోనూ ఆనందం లభిస్తుంది. తన మీద తనకు శ్రద్ధ ఏర్పడుతుంది. మానసికంగా దృఢంగా ఉండగలిగితే శారీరక బలం దానంతట అదే వస్తుందని పలువురు నిరూపించారు. శారీరకంగా బలహీనులైనప్పటికీ మేధోపరంగా చక్కని ఆలోచన చేయగలిగినవారు రచయితలు అవుతారు. పుస్తకాలు నిరంతరం చదువుతూనే వుంటారు. ఈ దిశగా ఈ గ్రంథాలయం కల్పించిన అవకాశాలు చాలానే ఉన్నాయి. సేవాతత్పరత, ఆదర్శనీయతతో ఉచితంగానే ఈ సేవలను అందిస్తున్నారు.

డవున్ టవున్ కేంద్ర గ్రంథాలయానికి రోజూ క్రమం తప్పకుండా వచ్చేవారున్నారు. వారితో మాట్లాడినప్పుడు ఎంతో సంతోషం కలిగింది. "కేవలం పుస్తకాలతో ప్రారంభించి కాలానుగుణంగా మారుతూ వచ్చిన ఈ గ్రంథాలయం దశాబ్దాలుగా మా జీవితంలో భాగం అని గర్వంగా చెబుతాను" అన్నారు ఒక మహిళ. "నాకు చిన్నతనం నుంచి పుస్తకాలు చదవటం అలవాటు. అందుకే నేనిక్కడ ఉద్యోగం చేస్తున్నాను. ఈ గ్రంథాలయం అంటే ఎంత ఇష్టమో మాటల్లో చెప్పలేను" అని చెప్పారు ఒక ఉద్యోగిని. "అన్నీ వున్న గ్రంథాలయంలో కొత్తగా ఏదైనా ప్రారంభించాలన్నదే నా ఆలోచన! అది ఏరకంగా చేయాలీ అనే దానికోసం వెతుకుతున్నాను" అని ఎంతో స్ఫూర్తిని వెదజల్లారు ఓ ధనిక పుస్తకప్రియుడు. "ఇంటికంటే గ్రంథాలయం నాకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. రాత్రి నిద్రపోవడానికి మాత్రమే ఇంటికి వెళ్తాను" అని చెప్పుకొచ్చారు మరో వ్యక్తి. ఇలా పలకరిస్తే ఎన్నో అభిప్రాయాలు ఆహ్లాదకరంగా చుట్టుముడతాయి. అయితే ఇటీవల అమెరికాలో కొంత సామరస్య వాతావరణం దెబ్బతినటం వల్ల ఇక్కడ భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేయాల్సి వచ్చింది. ఇక యువత కూడా వస్తూంటారు. వారు కార్యకర్తలుగా పనిచేయడం కోసం, నైపుణ్యాలను పెంచుకునేందుకు తరగతులకు హాజరుకావడం కోసం వస్తుంటారు. వారి అభిరుచులు, అవసరాలు కలగలసిన స్థలమిది.

నగరంలో ఇంకా అనేక గ్రంథాలయాలు ప్రజల అవసరాల్ని ఇదేరీతిలో తీరుస్తున్నాయి. ఆధునిక కంప్యూటర్లు అందుబాటులో వున్నాయి. ఏ రకమైన పుస్తకం లేదా సంబంధిత మెటీరియల్ కావాలని అడిగినా తెప్పించి ఇస్తారు. ప్రపంచవ్యాప్తంగా

రూపొందిన వేలు, లక్షల పుస్తకాలు, కోట్ల కాగితాలు లభ్యమవుతుంటాయిక్కడ. వాటిని మన అవసరానికనుగుణంగా ఆస్వాదించగలగటమే ఆలస్యం. అన్ని రంగాల వారికీ అందుబాటులో ఉండేలా ఈ పుస్తకాలయాల సేవలు అసమానమైనరీతిలో ఉంటాయి.

ప్రతి చిన్న ఊరిలో కూడా కనీస అవసరాలు తీర్చగలిగే గ్రంథాలయాలున్నాయి. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా గ్రంథాలయాల్ని మెరుగుపరుస్తున్న తీరును చెప్పుకోవాల్సిందే. విజ్ఞానం, వికాసం కలగలిసినందున ఈ పుస్తకాలయాలు ఒకరకంగా విద్యాలయాలుగా పనిచేస్తున్నాయనే చెప్పుకోవాలి.

ప్రత్యేక సందర్భాల్లో ప్రజా గ్రంథాలయాల్లో పిల్లలకూ, పెద్దలకూ ఆర్ట్ మ్యూజియం, టూర్ ప్రోగ్రాంలకు పాస్‌లు జారీ చేస్తారు. అవి అందుబాటు ధరల్లోనే ఉంటాయి. వినోద కార్యక్రమాలు, ఫ్రీ షోలు, సీజన్ వారీగా ప్రత్యేక సెలవు రోజుల్లో అందరికీ ఉల్లాసం పంచే కార్యక్రమాల నిర్వహణ తీరు అద్భుతం. వలంటీర్లుగా పనిచేసినవారికి ప్రోత్సాహక బహుమతులు, యోగ్యతా పత్రాలు ఇస్తారు. ఉన్నత ఉద్యోగాలకు చదువుకునేవారికి గుర్తింపుతో పాటు మార్కులు కలుస్తాయి.

కేవలం ప్రభుత్వం ఇచ్చే నిధులతో ఈ సేవలు చేయడం సాధ్యమవదు. ఉదారులు, ఆదర్శనీయులు, సంపన్నులు ఇచ్చే విరాళాలు అవసరం. మానవసేవకు మించినది లేదు. తోటి మనిషికి సహాయపడటం అనేది మానవత్వం, నాగరికత. ఈ అవగాహన అమెరికా సమాజంలో ఉండటం వల్లే.. అక్కడి ప్రజా గ్రంథాలయాలు ఒక్కపఠనానికే పరిమితం కాకుండా అనేక రకాల సమాజసేవకూ విస్తరించగలిగాయి.

ఈ విషయాల్ని మనదేశంలోనూ అమలుచేస్తే యువతకు మేలు జరుగుతుంది. వారికి ఇచ్చిపుచ్చుకునే సేవాగుణం అలవడుతుంది. మంచి నడవడికకు అవకాశం ఏర్పడుతుంది. మంచి మార్గంలో పయనించేలా వారి ఆలోచనలు రూపుదిద్దుకుంటాయి. గ్రంథాలయాలతో సేవా కార్యక్రమాలను సంధానం చేసి విస్తృత ప్రచారం కల్పించాలి. కనీసం స్కూలు, కాలేజీలలో అయినా చైతన్యం కలిగించాలి. గ్రంథాలయాల్లో ఎన్ని సాంకేతిక మార్పులు వచ్చినా పుస్తకం విలువ తగ్గదు. విద్యార్థుల భవితకు పునాది తల్లిదండ్రులు, తరగతి గదుల నుంచే ప్రారంభం అవుతుంది కాబట్టి.. పుస్తక పఠనంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి. పుస్తక పఠన పోటీల్ని నిర్వహిస్తే పఠనాసక్తి పెరుగుతుంది. పిల్లల్లో కుతూహలం ఇష్టం ఏర్పడుతుంది. ఇందుకోసం నాణ్యమైన విద్యావ్యవస్థలో ఆధునిక గ్రంథాలయాలను భాగం చేయాలి.

# 8సార్లు జిల్లాకొచ్చి ఏం చేశారు?

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుకథలతో కాలక్షేపం చేయటంలో అపార అనుభవం సంపాదించారని, విజయనగరం జిల్లాకు 8 సార్లు వచ్చినా చేయాల్సిన పనులు చేయకుండా తప్పించుకు తిరుగుతున్నారని బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. జిల్లాలో మూతపడిన జ్యూట్‌మిల్లులు, అగ్రిగోల్డ్ బాధితుల సమస్య, ఉపాధి సంక్షోభంతో అల్లాడుతున్న యువత, సరైన ధర లభించక నలిగిపోతున్న రైతులు, పెరిగిపోతున్న వలసలు గురించి ముఖ్యమంత్రి ప్రస్తావనే చేయటం లేదన్నారు. జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా సమస్యల్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా మోసం చేస్తున్నారన్నారు. విజయనగరంలో ప్రభుత్వ వైద్య కళాశాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. జన్మభూమి మొక్కుబడి కార్యక్రమంగా మారిందన్నారు. రూ.20 కోట్ల పనులు చేసి రూ.100కోట్ల పబ్లిసిటీ ఇచ్చుకుంటున్నారన్నారు. ప్రజల డబ్బును వేల కోట్లు ప్రభుత్వ పాఠశాలల కోసం ఖర్చు చేస్తున్నా నాణ్యమైన చదువు రావటం లేదని, అయినా ప్రభుత్వ స్కూళ్లను బాగు చేయకుండా ప్రైవేటు బడులను బాగు చేసేందుకే చంద్రబాబు, మంత్రి గంటా ప్రయత్నిస్తున్నారని అన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు తిప్పాన కోటేశ్వరరావు, శిమ్మశ్రీను తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి చూపలేరు.. వృద్ధులకు సౌకర్యాలు అందించలేరు



యువతకు ఉపాధి చూపకుండా, వృద్ధులకు పింఛన్లు, ఇతర సౌకర్యాలు అందించకుండా ప్రభుత్వం ఇంకేం పాలన చేస్తున్నట్టని బాబ్జీ ఎద్దేవా చేశారు. జన్మభూమి కమిటీలు, అధికారుల వల్ల వృద్ధులకు కోటా కార్డులు, పింఛన్లు, ఇళ్లస్థలాల్లో అన్యాయం జరిగిందన్నారు. పల్లెపల్లెకు లోక్‌సత్తా పేరుతో విజయనగరం జిల్లా కొండకరకాం గ్రామంలో వృద్ధులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు అందుకోలేని అర్హుల జాబితాను గుర్తించి జిల్లా యంత్రాంగానికి అందచేస్తామన్నారు. ప్రభుత్వ పరిశీలన ఏకపక్షంగా జరగటం వల్ల పలువురు మహిళలు పింఛన్లు, కోటా కార్డులు, మరుగుదొడ్ల బిల్లుల చెల్లింపులు అందక ఇక్కట్లు పడుతున్నారని మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు ఇనగంటి అనంతలక్ష్మి అన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు నాగభూషణం, మొల్లేటి చిన్నారావు, అప్పారావు, రాంచి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

☐ పలు కేసుల్లో నిందితులైన అత్యంత ప్రముఖుల విషయంలో భారత సుప్రీంకోర్టు వ్యవహరించిన తీరు, విచారణలో చేసిన తాత్సారం విమర్శలకు తావిచ్చింది. వాహనంతో ఢీకొని పలువురి మృతికి కారణమైన సినీనటుడు సల్మాన్‌ఖాన్, అవినీతి, అక్రమ ఆరోపణల్లో చిక్కుకున్న నాటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, సత్యం కంప్యూటర్స్ రామలింగరాజు తదితర కేసులు ఇందుకు ఉదాహరణ. వివాదాల పరిష్కారం కోసం చాలామంది కక్షిదారులు రాజకీయ నేతలు, పోలీసులు, గూండాలను ఆశ్రయించటం భారత్‌లో బహిరంగ రహస్యమే. ప్రజాస్వామ్యంలో ఇతర వ్యవస్థలు కునారిల్లుతున్న తరుణంలో అత్యున్నత న్యాయస్థాన వ్యవహారశైలిపై న్యాయకోవిదుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద న్యాయవ్యవస్థ ప్రతిష్ఠపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సుప్రీంకోర్టు విశ్వసనీయత సంక్షోభంలో చిక్కుకుంది. పారదర్శకత లేని కొలీజియం వ్యవస్థ ద్వారా న్యాయమూర్తుల నియామకం, బదిలీలు చేపట్టటం ఎలా సమర్థనీయమన్న వాదనలున్నాయి.

– బీబీసీ

☐ ప్రజాస్వామ్య వ్యవస్థకు చెందిన నాలుగు ప్రధాన అంగాలు– శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, మీడియా– గడచిన డెబ్బయ్ ఏళ్లలో భ్రష్టుపట్టిపోయాయి. దేశంలో సంభవిస్తున్న అనేక పరిణామాలే ఇందుకు నిదర్శనం. కొంతకాలం కిందట ఓ రాష్ట్రానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి (కలిఖోపుల్) ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు 60 పేజీల లేఖ రాశారు. ఆ లేఖ చాలా రోజులు వెలుగు చూడలేదు. ఆయన భార్య ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి లేఖ ప్రతులను పంచారు. ఇంతవరకూ ఆ లేఖను పత్రికలు, జాతీయస్థాయి టీవీ ఛానళ్లు ప్రస్తావించలేదు. దేశంలో మీడియా పరిస్థితి అంత అధ్వాన్నంగా ఉంది. పౌరసమాజానికి అంతగా తెలియకపోయినా.. న్యాయవ్యవస్థలోని కొందరు సభ్యుల వ్యవహారశైలి ఇబ్బంది కలిగించేదిగా ఉంది. తగిన ప్రమాణాలు రూపొందించి సామర్థ్యం, విలువలు ఉన్నవారిని న్యాయవ్యవస్థలో ఉన్నతస్థానాల్లో నియమించాలని రాజ్యాంగ రూపకర్తలు ఆశించారు.

– జస్టిస్ చలమేశ్వర్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి

☐ దక్షిణాఫ్రికాలో ఒక విశ్వవిద్యాలయం గేటు మీద ఈ రకంగా బోర్డు రాసి ఉంటుంది. 'ఒక దేశాన్ని చితికిపోయేటట్టు చేయాలంటే అణుబాంబులు అవసరం లేదు. ఆ దేశ విద్యాస్థాయిని దించి విద్యార్థులు పరీక్షల్లో తాము గ్రహించింది కాక పుస్తకాల్లోని విషయాలు చూసిరాసి పట్టాలు తెచ్చుకునేటట్టు చేస్తే చాలు, ఆ దేశం నాశనమవుతుంది'. ఈ విధంగా అర్ధ శతాబ్దం నుంచి చదువు 'కొంటూ', బట్టీపట్టినవి పరీక్షల్లో రాస్తూ మన విద్యార్థులు పాఠశాల, కళాశాలలను దాటి ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. వ్యక్తిగత నిజాయతీ, పనిలో నిబద్ధత, లంచాలకు ఎదురుచూడకపోవటం, ఉద్యోగం చేసిన చేస్తున్న ఆత్మ తృప్తి, పదిమందికి ఆదర్శంగా నిలబడటం, ఇవన్నీ భారత పౌరుల్లో ఎందుకు కొరవడుతున్నాయో అర్థమవుతున్నది కదా! విదేశాలకు వెళ్లినవాళ్లు మాతృదేశానికి ఎందుకు రావాలనుకోవటంలేదో బోధపడుతున్నది కదా! ఇకనైనా చదువు, పట్టాలని 'విద్య'గా మార్చి ఈ 'అవిద్య' (అవిద్య అంటే విద్య లేకపోవటం కాదు.. తప్పురకం విద్య ఉండటం)ను పారదోలి మన పిల్లలని కాపాడుకుందామా?

- ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

☐ సెలవలొస్తే అమెరికాలో ఊర్లకు, టూర్లకు కాకుండా పిల్లలందర్నీ తీసుకుని లైబ్రరీలకు వెళతారు. ఆ దేశంలో ప్రతి ఇంట్లో కనీసం 104 బాలసాహిత్యం పుస్తకాలుంటాయని ఒక సర్వేలో తేలింది. కొత్త పుస్తకం విడుదలవుతోందంటే బారులు తీరి కొనే ప్రజలు అక్కడ ఉంటారు. ఆన్‌లైన్‌లో ముందుగానే బుక్ చేసుకునేవారూ అధికం. ఎలక్ట్రానిక్ రీడర్స్, డిజిటల్ బుక్స్ ఎంతగా కొంటారో.. ప్రింట్ పుస్తకాలకూ అంతే ఆదరణ ఉంది. పుస్తక పఠనం కేవలం విజ్ఞానం కోసమే కాదు.. మానసికోల్లాసానికి, సమాజం పట్ల సానుకూల దృక్పథం ఏర్పడటానికి, జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికని నమ్ముతారు. పిల్లలకూ అదే నేర్పుతారు.

- సుజాత వేల్పూరి, పౌరురాలు

☐ మీరెవరో తెలియకూడదు.. మీ వయసు అడిగినా అభ్యంతరం వ్యక్తం చేస్తారు. ఇతర వివరాలు అడిగితే వ్యక్తిగత గోప్యత అంటారు.. అలాంటప్పుడు మీ కులం వివరాలు తెలిసేలా మీ పేరు చివర్లో రెడ్డి, చౌదరి, శర్మ అని ఎందుకు పెట్టుకుంటారు? వ్యక్తిగత స్వేచ్ఛ అప్పుడు గుర్తుకురాదా? మీ వ్యక్తిగత వివరాలు లోకానికి తెలియకూడదు అని భావిస్తే ముందు పేరు చివర్లో కులాన్ని తొలగించుకోండి. బీహార్‌లో ఇప్పటికే అత్యధికులు కులం తోకలను కత్తిరిస్తున్నారు. తెలుగునాట ఎందుకు చేయరు? సమాచారం దుర్వినియోగం చేయడం మాత్రమే నేరం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య రాకపోకలకు పాస్‌పోర్టులు, వీసాలు అవసరమవుతున్నాయా? చిన్న విషయాలను పెద్ద సమస్యలుగా చేసి చెప్పొద్దు.

– జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ,
సమాచార భద్రతపై కేంద్ర ప్రభుత్వ నిపుణుల కమిటీ సారథి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

☐ *ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై ఆ రాష్ట్రం నుంచి అభ్యర్థన వస్తే చూద్దాం. పోషకాహారలోపంలో మనదేశం ఉగాండాను మించిపోయింది. పోషకాహార లోపమున్న ఐదేళ్లలోపు పిల్లలు భారత్‌లో 38.4శాతం ఉండగా, ఉగాండాలో 33.4శాతమే ఉన్నారు.*

– రాజీవ్ కుమార్, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు

☐ చైనా అనుభవం వ్యవసాయంపై మనదేశ పాలకుల వాదనలను సవాలు చేస్తోంది. చైనాలో ఆర్థిక సంస్కరణలను 1978లో వ్యవసాయ ప్రక్షాళనతోనే ప్రారంభించారు. వ్యవసాయోత్పత్తుల ధరలపై నియంత్రణలను తొలగించి స్వేచ్ఛామార్కెట్‌ను ప్రోత్సహించటంతో నిజమైన తలసరి ఆదాయం పెరగటం మొదలైంది. కేవలం ఆరేళ్లలో చైనాలో పేదరికం స్థాయిలు సగానికి పడిపోయాయి. చైనా పేదరికం 1978లో 33శాతముంటే, 1984కి 15శాతానికి వచ్చింది. భారత్ అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. 1991 ఆర్థిక సంస్కరణలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించి పరిశ్రమల సరళీకరణ మీద దృష్టి పెట్టాయి. దీంతో భారత్‌లో పేదరికం సగం మేర తగ్గడానికి 18 ఏళ్లు పట్టింది. 1993లో 45శాతమున్న పేదరికం 2011లో 22శాతానికి తగ్గింది. 1991లో పరిశ్రమలకసరళీకరణ తరహాలోనే మన వ్యవసాయ రంగాన్ని ప్రక్షాళన చేయాలి.

– పూజా మెహ్రా, జర్నలిస్టు

☐ మానవుల పుట్టుక చావులు ప్రకృతి సృష్టి. జీవన విధానాలు మాత్రం మానవ నిర్మితం. మనుషులు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థలు, సమాజంలో వారి మధ్య, సమూహాల మధ్య, ప్రాంతాల మధ్య, దేశాల మధ్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవన సమాన అసమానతల స్థాయిల్ని నిర్ణయిస్తాయి. అందరికీ సమాన సంపద పంచే వ్యవస్థలు సమాన స్థాయిల్ని కల్పిస్తాయి. కనీసం అలాంటి అవకాశాలనైనా అందిస్తాయి. అసమానతలను అదుపులో పెట్టగలుగుతాయి. స్వాతంత్ర్యానంతరం ఆధునిక భారతం ప్రతి ఒక్కపౌరునికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాల్లో సమానత్వం కల్పించాలని రాజ్యాంగబద్ధంగా సంకల్పించింది. ఇప్పటికీ అది సామాన్యులకు అందని ద్రాక్షే! విద్య, వైద్య, ఆహార భద్రతల్లో సమానత్వం- రాజకీయ ఆర్థిక సమానత్వానికి పునాది. అలాంటి పునాదుల్లోనే లోపాలుంటే వ్యవస్థలు కూలిపోతాయి. సంపన్నులకు కార్పొరేట్ విద్య, పేదలకు ప్రభుత్వ చదువులు అన్నట్టు పరిస్థితులు ఉన్నాయి. వైద్య ఆరోగ్య సేవల్లో సంపన్నులు అత్యున్నత సౌకర్యాలు, నాణ్యతగల ఖరీదైన ప్రైవేటు కార్పొరేట్ వైద్యం పొందుతున్నారు. మధ్యతరగతివారు ప్రైవేటు ఆస్పత్రుల ఖరీదైన వైద్యంతో నలిగిపోతున్నారు. పేదలు ప్రభుత్వ ఆస్పత్రుల అరకొర వైద్యంతో, కొన్నిసార్లు అదీ అందక, చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు.

- డాక్టర్ చీరాల శంకర్‌రావు, సహాయ ఆచార్యులు, సీఎస్‌డీ హైదరాబాద్

☐ *ప్రజాస్వామ్యంలో మనకు సామాజిక, వర్ణ, మత విభజనలను మాపి సామరస్యాన్ని పెంపొందించే నాయకత్వం కావాలి. ప్రతి సమాజానికీ పైస్థాయి నుంచీ అలాంటి నాయకత్వం అవసరం.*

*- వర్గీస్ కె. జార్జి, జర్నలిస్టు*

*(కర్టెసీ: ఈనాడు, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, ది హిందూ, సోషల్ మీడియా)*

# ఆ గ్రామాల స్వతంత్ర పోరాటానికి లోక్‌సత్తా మద్దతు



విజయనగరం జిల్లా నెల్లిమర్లలో జూట్ మిల్లు కార్మికుల కుటుంబాలు వెంటనే క్వార్టర్లు ఖాళీ చేయాలని, లేకుంటే పీఎఫ్, గ్రాట్యుటీ ఇవ్వబోమని నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఉద్యమానికి లోక్‌సత్తా పార్టీ సంపూర్ణ మద్దతు ఇచ్చింది.

1919లో విజయనగరం మహారాజుల నుంచి బిన్నీ అండ్ కంపెనీ అనే బ్రిటిష్ సంస్థ 188.77 ఎకరాలు తీసుకుని నెల్లిమర్ల జూట్ మిల్లును ప్రారంభించింది. అప్పట్లోనే ఎన్నో కుటుంబాలు మిల్లులో పనికి చేరాయి. సమీప ప్రాంతాల్లోనే స్థిరనివాసాలు ఏర్పరచుకున్నాయి. అవే థామన్‌పేట, కొండపేట, పాకీపేట గ్రామాలుగా అవతరించాయి. అయితే 1949లో ఎస్టేట్ రద్దు చట్టం ప్రకారం సదరు లీజులన్నీ రద్దయి పోయాయని, అదంతా ప్రభుత్వ భూమి కనక ఖాళీ చేయాలని రెవెన్యూ అధికారులు మిల్లు యాజమాన్యానికి 2011లో నోటీసులు జారీ చేశారు. దీంతో మిల్లు యాజమాన్యం హైకోర్టుకు వెళ్లగా యథాతథ స్థితి (స్టేటస్‌కో)ని కొనసాగించాలంటూ ఆదేశాలు ఇచ్చింది.

అయితే, యాజమాన్యం తరపు ప్రైవేటు సైన్యం మాత్రం తరతరాలుగా అక్కడే స్థిరనివాసం ఏర్పరచుకున్న కార్మిక కుటుంబాలను హీనంగా చూస్తున్నాయి. ఖాళీచేసి వెళ్లిపోవాలంటూ పదేపదే దాష్టీకం ప్రదర్శిస్తున్నాయి. హుద్‌హుద్ తుఫాను ధాటికి కుప్పకూలిన ఇళ్లను సైతం నేటికీ కట్టుకోనివ్వలేదు. ఆఖరికి అగ్నిప్రమాదంలో అనేక ఇళ్లు కాలిపోతే కట్టుబట్టలతో రోడ్డునపడి చలిలోనే పిల్లలతో సహా నరకం అనుభవిస్తున్నా కనికరించలేదు. బాధితుల్లో చాలామంది మరుగుదొడ్లలోనే వంటలు చేసుకుంటూ తుప్పల చాటున స్నానాలు చేయాల్సిన దుస్థితి పట్టింది. వారిని ఊరు నుంచి వెళ్లగొట్టటమే లక్ష్యంగా స్నానాలు చేస్తున్న మహిళల్ని సైతం ఫోటోలు, వీడియోలు తీస్తున్నారు. అంతేకాదు.. కార్మికులు మిల్లులో పదవీ విరమణ పొందాక వారి చేత రూ.50 బాండు పేపరుపై సంతకాలు చేయించుకోవడమేకాకుండా ఇల్లు, ఊరు వదిలిపోతేనే గ్రాట్యుటీ ఇస్తామంటూ వేధిస్తున్నారు. ఇప్పటికే సుమారు 1,000మందికి దాన్ని నిలిపివేశారు కూడా. రెవెన్యూ, పోలీస్, కార్మికశాఖలన్నీ మిల్లు యాజమాన్యానికే కొమ్ము కాస్తున్నాయి. ఈ సమస్యలను ఈనాడు దినపత్రిక వెలుగులోకి తేవటంతో జిల్లా యంత్రాంగం కదిలింది. ఇళ్లు పడి పోయినా, కాలిపోయినా న్యాయ సలహా తీసుకుని పునర్నిర్మించుకోవచ్చని స్పష్టం చేసింది. దీంతో దాదాపు 800 కుటుంబాలకు ఊరట లభించింది. బాధిత కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మిస్తామని ఎయిమ్స్ స్కూల్ కరస్పాండెంట్ కడగల ఆనందకుమార్ ప్రకటించటంతో గ్రామస్తుల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిసాయి. దేశానికి స్వతంత్రం వచ్చినా ఇప్పటికీ స్వాతంత్ర్యం రాని థామస్‌పేట, కొండపేట, పాకీపేట ప్రజలకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తామని, అవసరమైతే న్యాయస్థానాల్లోనూ తోడ్పాటు అందిస్తామని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. 'మాకూ స్వాతంత్ర్యం కావాలి' అంటూ గ్రామాల ప్రజలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు.

## జానపదాల సంక్రాంతి







జానపద కళల విశిష్టతను ప్రజలకు, ముఖ్యంగా నవతారానికి తెలియచేసేలా డాక్టర్ పీవీజీ రాజు కళావేదిక విజయనగరంలో నిర్వహించిన సంబరాలకు బాబ్జీ అధ్యక్షత వహించారు.







# ప్రజల ఆస్తి, దిక్సూచి లోక్‌సత్తా : జేపీ

లోక్‌సత్తా ప్రజల ఆస్తి, దిక్సూచి అని వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎన్నికల్లో ఎలాగోలా విజయం సాధించటం లోక్‌సత్తా లక్ష్యం కాదని.. రాజకీయాలు మారటానికి సమయం పట్టినా ఈలోగా మంచిపాలనను సాధించే కృషి కొనసాగాలని అన్నారు. మంచి రాజకీయ కోసం మంచి పాలన ఆగాల్సిన అవసరం లేదన్నారు. హైదరాబాద్ మల్కాజిగిరిలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ జిల్లాల కమిటీల ఆత్మీయ సమ్మేళనంలో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు.

ఎన్నికలే రాజకీయం అనుకుంటే ఈపాటికే దేశంలో అద్భుతమైన మార్పులు వచ్చేయాలని, కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందని జేపీ అన్నారు. ప్రస్తుత రాజకీయాలు ప్రజలను దోపిడీ చేయటం చుట్టూనే తిరుగుతున్నాయన్నారు. ప్రజలకు న్యాయమైన సేవలు అందించటంకన్నా, ఇతరత్రా పనులు చేయటమే రాజకీయం, పాలన అనుకుంటున్నారన్నారు. కార్పొరేటర్లు ప్రజాసమస్యలపై స్పందించకుండా వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కేంద్రంలో మోదీ విజ్ఞతతో పనిచేయకపోవటంతో ఆయన మీద నమ్మకం తగ్గిపోతోందన్నారు. ఆవు గురించి, తలాక్ గురించి ఆలోచించే నేతలకు ప్రజల సమస్యల గురించి ఆలోచించే తీరిక లేదన్నారు. యజ్ఞాలు, యాగాలతో ఈ పరిస్థితి మారదని... విధానాలు, పద్ధతులు మారాలని అన్నారు. చేయాల్సిన దానితో పోలిస్తే లోక్‌సత్తా సాధించింది చాలా తక్కువని, అయితే తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో ఇప్పటిదాకా అధికారంలోకి వచ్చిన పార్టీలు, నేతల కంటే లోక్‌సత్తాయే ఎక్కువ సాధించిందని అన్నారు. ఉద్యమంగా, పార్టీగా లోక్‌సత్తా కృషి వల్ల మూడు కీలక రాజ్యాంగ సవరణలు, పదినిమిది చట్టాలు వచ్చాయని, 2 జీ స్పెక్ట్రం లైసెన్సుల రద్దుతో ప్రకృతి వనరుల బహిరంగ వేలం సహా పలు కీలక విధాన నిర్ణయాల్లో మార్పులు తెచ్చామని అన్నారు. తగినన్ని ఓట్లు రాకపోవటం వల్ల ఎన్నికల్లో పోటీకి లోక్‌సత్తా ప్రస్తుతం దూరంగా ఉన్నా... ప్రాచుర్యం పార్టీలకన్నా ముమ్మరంగా రాజకీయ కృషి చేస్తోందన్నారు. ప్రజలకు విలువలతో కూడిన మంచి పాలనను అందించేందుకు ఆచరణసాధ్యమైన, అందరికీ ఆమోదయోగ్యమైన ఎజెండాతో పార్టీలకతీతంగా చేస్తున్న సురాజ్య ఉద్యమం ఇందులో భాగమన్నారు. తాము చెల్లించిన పన్నుల డబ్బులో ప్రతి రూపాయీ సద్వినియోగం అవుతుందో లేదో జనం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ స్పందించినప్పుడే ప్రజాస్వామ్యానికి సార్థకత, జాతికి భరోసా అని, ఆ చైతన్యాన్ని ప్రజల్లో తేవటానికి బహుముఖంగా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వాల నుంచి ఏమి డిమాండ్ చేయాలో... విద్య, ఆరోగ్యం, ఇతర సేవల్ని హక్కుగా ఎలా పొందాలో తెలియచేస్తున్నామన్నారు. త్వరలో తెలంగాణలోనూ సురాజ్య యాత్రను ప్రారంభిస్తామని తెలిపారు. వివక్ష లేని తెలుగు రాష్ట్రాలు, భారతదేశ నిర్మాణానికి లోక్‌సత్తా విధానాలే మూలస్తంభమని, లోక్‌సత్తా భావజాలానికి ప్రజల్లో డిమాండ్ ఉందని, అందుకే కష్టమైనా ఇష్టంగా లోక్‌సత్తా పార్టీ విస్తరిద్దామని పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము, నేతలు సరోజాదేవి, దుర్గారావు, మల్లాది కిషోర్, శ్రీనివాసవర్మ, గజానని, గంగాభవానీ, బండారు రవికాంత్, గురు సిద్ధప్ప, మహేంద్రనాథ్, బి.రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

Posting Date 07-02-2018

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on February 1st, 2018



బరోడాలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్ నిర్వహించిన జాతీయ యువ సమ్మేళనం యుగాంతర్ 2018లో 'నాయకత్వం, పాలన, ప్రజాస్వామ్యం' పై ప్రసంగిస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

| Book-Post<br>PRINTED MATTER | To |
| --- | --- |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad